
సనాతన సారథి
ప్రత్యేక సంచిక
నవంబరు 2011

సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక,
నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము 54
సంచిక 11

నవంబరు 2011

ప్రచురణ తేదీ
అక్టోబరు 23

శీర్షికలు **పుటలు**

1. తొలి పలుకు	సం॥	403
2. నేను భక్తులకు భక్తుణ్ణి	భగవానుని జన్మదినోత్సవ సందేశాలు	405
3. మాయలలో పడకుండా ఉత్సాహం నిల్పుకోవాలి	ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య	411
4. జ్ఞాపకాల పందిరి *(ధారావాహికం - ప్రథమ భాగం)*	ప్రొ॥ కామరాజు అనిల్ కుమార్	414
5. శ్రీ సత్యసాయి గేయ సుధ	డా॥ రాళ్లపల్లి వసంతలక్ష్మి	420
6. 'నేను దేహమును కాను, దేహిని'	గరిమెళ్ళ కృష్ణమూర్తి	422
7. మహోన్నత 'మానవ' ఆదర్శం	"సాయిదాసు"	426
8. స్వామి సంకల్ప మాహాత్మ్యం	శ్రీమతి అంజలీదేవి	429
9. ప్రార్థన ప్రభావం	బి.వి. సత్యమూర్తి	432
10. పర్తిపురీశుని చూడరమ్మో!	ఎమ్.ఎస్. ప్రకాశరావు	434

(...త్రిప్పి చూడండి)

© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం

నవంబరులో జరుగనున్న విశేష కార్యక్రమాలు, ఉత్సవాలు

2011 నవంబరు **12** సాయంత్రం **6** గం॥ల నుండి నవంబరు **13** సాయంత్రం **6** గం॥ల వరకు

ప్రపంచవ్యాప్త అఖండ భజన

2011 నవంబరు **18**

రథోత్సవం

2011 నవంబరు **19**

మహిళా దినోత్సవం

2011 నవంబరు **22**

శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ 30వ స్నాతకోత్సవం

2011 నవంబరు **23**

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి జయంతి ఉత్సవం

11. సకల దేవతాతీత స్వరూపా!	*వింజమూరి శేషఫణి శర్మ*	435
12. విద్యావంతులు కావాలి, విద్యోన్మాదులు కాదు	*డా॥ బి.వి. పట్టాభిరాం*	436
13. సాకార నిరాకార సంధి	*పి.పి.ఎస్. శర్మ*	438
14. స్వామి మనలో తెస్తున్న పరివర్తన	*ఆదూరి శ్రీనివాసరావు*	440
15. సాయిమాత	*కవిలిగ నరసింగరావు*	441
16. స్వామితో శ్రీరామశరణ్ మధురానుభూతులు	*ప్రొ॥ జి.ఎన్. మూర్తి*	442
17. మానవతా విలువలు	*ఎన్.బి.ఎస్. రామారావు*	444
18. అనుగ్రహం	*జి. కె. సత్యనారాయణరావు*	445
19. మహా మహిమాన్విత ప్రేమావతారి (9వ భాగం)	*బి.వి. రమణరావు*	446
20. ప్రశాంతి సమాచారం	*దివి చతుర్వేది*	453
21. సమాధి చెంత స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన విషయమై భక్తులకు ఒక విజ్ఞప్తి		456

ఎడిటర్ : బి.వి. రమణరావు

అసిస్టెంట్ ఎడిటర్ : వి. శ్రీనివాసులు

వార్షిక చందా: భారతదేశంలో: ` **60.00** విదేశాలకు: ` **550**, లేక **$ 13**, లేక **£ 9**, లేక **€ 9**

టెలీఫోన్: 287375 (సనాతన సారథి Extn. 128) STD: **08555** ISD CODE: **0091-8555**

E-mail: subscriptions@sssbpt.org, editor@sssbpt.org

గమనిక: *అడ్రసు కవరుపై గల మీ చందానెంబరు ప్రక్కన చందాగడువు ఎంతవరకు ఉన్నదో సూచించడం జరిగింది. మూడు పువ్వుల గుర్తు (***)ఉన్నట్లయితే మీ చందాను వెంటనే రెన్యువల్ చేయించుకోగలరు.*

అధికారికమైన వెబ్‌సైట్లు

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం : www.sssbpt.org
శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు : www.srisathyasai.org.in
రేడియో సాయి గ్లోబల్ హార్మొనీ : www.radiosai.org
శ్రీ సత్యసాయి సేవాసంస్థ బాలవికాస్ విభాగం : www.sssbalavikas.org
శ్రీ సత్యసాయి ఈశ్వరమ్మ మహిళా సంక్షేమ ట్రస్టు : www.ewwt.org.in

చందాదారులకు విజ్ఞప్తి

1. చందా ఒకటి లేక రెండు లేక మూడు సం॥లకు స్వీకరింపబడును;
2. మనియార్డరుద్వారాగాని, బ్యాంకు డ్రాఫ్టుద్వారాగాని, క్యాష్‌ద్వారాగాని చెల్లించవచ్చును.
3. **పోస్టల్ కవర్లలో డబ్బు పెట్టి పంపవలదు.**
4. చందా పంపవలసిన చిరునామా : **కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా. పిన్ - 515134**

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) - 515134 తరఫున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

ప్రింటర్ అండ్ పబ్లిషర్ : కె.ఎస్. రాజన్

తొలి పలుకు

ఒక ఉన్నత హోదాలో ఉండే వ్యక్తులు మన ఇంటికి వచ్చినప్పుడు తమ 'విజిటింగ్ కార్డు' ఇవ్వడం పరిపాటి. మరి సాక్షాత్తు సాయి భగవానుడే మన ఇంటికి వస్తే...?

సర్వాంతర్యామి, సర్వవ్యాపి అయిన స్వామికి రాకపోకలేమిటి అంటారేమో!

అయితే, స్వామి తాము మన వెంట జంట మాత్రమే కాక మన 'ఇంట' కూడా ఉన్నామనడానికి నిదర్శన పూర్వకమైన అనుగ్రహ చిహ్నాలను చూపించ సంకల్పిస్తే....?

మన ఇంట్లో ఉన్న స్వామి ఫోటోలనుండి విభూతి వర్షించవచ్చు, పసుపు కుంకుమలు ప్రత్యక్షం కావచ్చు, అమృతం స్రవించవచ్చు, అక్షతల వర్షం కురియవచ్చు, ఉన్నట్లుండి విభూతి పరిమళం మనలను చుట్టుముట్టవచ్చు, ఇంకేదైనా అద్భుతం జరుగవచ్చు.

ఇవన్నీ స్వామి 'విజిటింగ్ కార్డులు'. కనుకనే, స్వామి 'మిరకిల్స్ ఆర్ మై విజిటింగ్ కార్డ్స్' అన్నారు. అంతేకాదు, ఈ అద్భుతాలన్నీ కేవలం దివ్యత్వానికి నిదర్శనములేగానీ, ప్రదర్శనకు కాదని స్పష్టం చేశారు.

స్వామి సశరీరులై ఉన్న రోజుల్లో ఇటువంటి విజిటింగ్ కార్డులద్వారా విశ్వవ్యాప్తంగా అనేకమందిని తమ సన్నిధికి రప్పించుకొని వారిని సంస్కరించి, సత్పరిణామం గొనివచ్చి ఆధ్యాత్మికపథగాములను చేశారు. అయితే, ఇటీవల స్వామి తమ భౌతిక దేహాన్ని వీడిన తరువాత దేశ విదేశాల్లోని భక్తుల ఇళ్ళల్లో, సాయి మందిరాల్లో ఇటువంటి అద్భుతాలు లెక్కకు మిక్కిలి జరుగుతున్నట్లు మాకు వార్తలందుతున్నాయి.

విజయవాడలోనూ, హైదరాబాద్‌లోని సఫిల్ గూడా, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లో తాము ప్రత్యక్షంగా వీక్షించి ఆనందంతో పరవశించిన అనేక అద్భుత సంఘటనలను పొందుపరుస్తూ ప్రొ॥ జి.ఎన్. మూర్తిగారు ఒక లేఖ వ్రాశారు. హైదరాబాదులోని వనస్థలిపురంలో ఒక సాయి భక్తుని ఇంట్లో ప్రత్యక్ష మవుతున్న స్వామి 'విజిటింగ్ కార్డు'లు నాస్తికులను సహితం సాయి భక్తులుగా మార్చివేస్తున్నాయట.

అంతేకాదు. ఇటీవల ప్రశాంతి నిలయంలో సౌత్ ఇండియన్ కేంటీన్, రౌండ్ బిల్డింగ్ – 4, నార్త్ బిల్డింగ్ – 4, జనరల్ హాస్పిటల్, ఇంకా బయట కొందరు భక్తుల నివాస గృహాలలో ఫోటోలనుండి దివ్యపరిమళ భరితమైన విభూతి ప్రత్యక్షమై భక్తులను దివ్యానుభూతికి లోనుచేసింది. ఒకరి ఇంట్లో కిలోల కొద్దీ విభూతి వర్షించినట్లు, స్వామి ఫోటో ఎదుట తాము ఉంచిన సీల్డు చాక్లెట్ల కవరు సహితం విభూతితో నిండిపోయినట్లు ప్రత్యక్షంగా వీక్షించిన ప్రొ॥ మూర్తిగారు వివరించారు.

త్రేతలో రామునిగా, ద్వాపరంలో కృష్ణునిగా, కలిలో షిర్డీ సాయిగా, నిన్న మొన్నటిదాకా పర్తిసాయిగా ఆశ్రితుల కల్పతరువుగా, భక్తుల కొంగుబంగారంగా, 'మన మాత పితా గురు దైవము మరి అంతయు తానెయై...' మనలనలరించిన స్వామి కనుమరుగయ్యారనేది జీర్ణించుకోలేని కఠోర వాస్తవం. అయితే, కనుమరుగైనంతమాత్రాన ఇక కనిపించరనీ, స్వామి లేరని అనుకునేంతటి అజ్ఞానులం, అమాయకులం కాదు, సాయి భక్తులం.

'స్వామి దేహం కాదు, దేహి' అన్నది మనందరికీ అనుభవంలో ఉన్న ప్రత్యక్షర సత్యం. వారు దేహం వీడినా 'దేహి'గా సదా మన ఇంట, వెంట, జంట ఉంటూనే ఉన్నారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే, మన దేహంలోనే కాదు, మన గేహం (గృహం)లో కూడా వారు కొలువుదీరి ఉన్నారనడానికి ప్రత్యక్ష నిదర్శనాలే ఈ 'విజిటింగ్ కార్డులు.'

'ఇందు గలడందు లేదని సందేహము వలదు' అన్న బాలప్రహ్లాదునివంటి అచంచల భక్తి విశ్వాసాలతో

మనం స్వామి అవతారోద్యమంలో ముందడుగు వేసినప్పుడు **'సాయి సర్వోపగతుండు, ఎందెందు వెదకి చూచిన అందందే గలడు'** అని స్వామి నిదర్శన పూర్వకంగా నిరూపిస్తూ మనలననుగ్రహించడమే కాక 'కలియుగ హిరణ్యకశిపులకు' కనువిప్పు కలిగిస్తారనడంలో ఏమాత్రం సందేహం లేదు.

భగవాన్ బాబావారి జయంతి సందర్భంగా వారికి అక్షర నీరాజనంగా వెలువడుతున్న ఈ ప్రత్యేక సంచికలో భగవాన్ జన్మదినోత్సవ సందేశాలలోని కొన్ని అంశాలతోపాటు భగవానుని చిరకాల భక్తులు, పదసేవానురక్తులు అయిన పలువురు ప్రముఖుల అనుభవాలను అందిస్తున్నాము.

ప్రొ॥ కె. అనిల్ కుమార్‌గారి దివ్యానుభవాలను, సాయి సంస్థతో వారికి గల అనుబంధమును ఎంతో హృద్యంగా వర్ణించే 'జ్ఞాపకాల పందిరి' ధారావాహికం ఈ సంచికనుండి ప్రారంభమవుతున్నది.

శ్రీరాముని పాదస్పర్శతో రాతి నాతిగా మారితే, నేడు సాయిరాముని దివ్యప్రేమతో రాతిగుండెలు ప్రేమమందిరాలవుతున్నాయి. ఇందుకు దృష్టాంతం ఆధునిక పోకడలు కలిగిన ఒక పాశ్చాత్య వైద్యునిలో స్వామి గొనివచ్చిన అద్భుత పరివర్తన. గత ఎనిమిది మాసాలుగా ధారావాహికంగా వెలువడుతూ భక్తుల నుత్తేజపరుస్తున్న 'మహామహిమాన్విత ప్రేమావతారి'లో ఈ సంఘటన తాలూకు వివరాలను తెలుసుకుంటారు.

స్వామి సంకల్పిస్తే మూగవాడు మాట్లాడగలడు, కుంటివాడు పరుగుతీయగలడు. ఇటువంటి అద్భుత సంఘటనలు స్వామి దివ్య జీవిత చరిత్రలో కోకొల్లలు. పక్షవాతానికి గురియైన ఒక పసికందుకు తన కళ్ళ ఎదురుగా స్వామి సంపూర్ణంగా స్వస్థత చేకూర్చిన వైనాన్ని వివరిస్తూ శ్రీమతి అంజలీ దేవి వ్రాసిన వ్యాసం స్వామి దివ్య సంకల్పశక్తికి దర్పణం పడుతుంది.

ఈరీతిగా, స్వామి సర్వాంతర్యామిత్వాన్ని, సర్వజ్ఞత్వాన్ని, సర్వశక్తిమత్వాన్ని ప్రతిబింబించే స్వీయానుభవాలను, సంఘటనలను, వాటి వెనుకగల స్వామి సందేశాన్ని వివరిస్తూ భక్తులు వ్రాసిన వ్యాసములతో రూపుదిద్దుకున్న ఈ ప్రత్యేక సంచికను భగవాన్ దివ్య పాదపద్మములచెంత పూజాపుష్పంగా సమర్పిస్తున్నాము.

– సం॥

సాటి మనిషిలో దైవాన్ని దర్శించండి

దైవాన్ని ఏ దేవాలయమునందో, క్షేత్రమునందో, ధ్యానమునందో చూస్తామనుకోవడం కేవలము భ్రమ. సజీవమైన మానవునియందే దైవత్వాన్ని చూడలేనివారు నిర్జీవమైన రాళ్ళయందు ఏరీతిగా చూడగలరు? మానవునియందు దైవత్వాన్ని ప్రేమపూర్వకంగా దర్శించినప్పుడే మానవత్వము ఆకర్షణీయంగా రూపొందుతుంది. కనుక, మంచిచెడ్డలకు పొంగక, క్రుంగక నలుగురిలో ఉండే దైవత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నం చేసినప్పుడే సాయిసంస్థలయందు చేరినందుకు మీ జన్మ సార్థకమవుతుంది. సాయి ఆశయాలను అనుసరిస్తూ, సాయి నిబంధనలను శిరసావహించి, సాయి అడుగుజాడలయందు జీవితాన్ని గడపడానికి ప్రయత్నించిన మీరు తప్పక ధన్యులవుతారు.

- బాబా (1980 నవంబరు 23)

నేను భక్తులకు భక్తుణ్ని

ఏ గుణంబు గణించి యేతెంచెనో నాడు / ప్రహ్లాదు పాలింప పరమ పురుషు
దే గుణంబు గణించి యేతెంచెనో నాడు / కరిని గాచెడి తరి కమల నయను
దే గుణంబు గణించి యేతెంచెనో నాడు / పేద కుచేలుని బ్రోవ వేదచరితు
దే గుణంబు గణించి యేతెంచెనో నాడు / ధ్రువకుమారుని సాక వైకుంఠవాసి
ఆ గుణంబె గణించి ఆ అమరవంద్యు / దార్త జనుల పాలించ నవతరించె
అనాథనాథ శ్రీనాథ లోకనాథ / సచ్చిదానందమూర్తి పుట్టపర్తి సత్యసాయి

యోగశక్తి, క్రియాశక్తి, ఆత్మశక్తి ఇవి మూడూ సమ్మిళితమైనదే అవతార తత్త్వము. అవతరణ మనిన పైస్థానమునుంచి క్రింది స్థానమునకు రావడమని కాదు అర్థము. గుణస్వరూపుడైన మానవుని ఉద్ధరించుటకు భగవంతుడు గుణస్వరూపుడుగానే రావాలి. దీనివలన భగవత్తత్త్వమునకు కించిత్వమును ఏమాత్రము ఆరోపించకూడదు. చంటిబిడ్డ ఏడ్చినప్పుడు తల్లి చేతిలోనికి ఎగురుట దానికి సాధ్యము కాదు. 'నేను పెద్దదాన్ని' అని తల్లి వంగుతుంది. వంగినంత మాత్రమున లొంగినట్లు కాదు. మానవుడు పైకి ఎగురుట సాధ్యం కానప్పుడు సాయిమాత వంగి ఎత్తుకొని సంతోషము నందిస్తుంది. ఏరోప్లేను ఇతర వాహనాదులవలె నేలపైన సంచరించదు. అయితే, అక్కడక్కడ దానిలో ప్రయాణించుటకు అర్హత సంపాదించినవారిని ఎక్కించుకొని తిరిగి పైకి వెళ్ళును. భగవంతుడు గుణాతీతుడు. తనను పొందే అర్హత కలిగినవారందరికీ ఆనందము నిచ్చే నిమిత్తమై తాను భక్తసులభునిగా ఉంటాడు.

(1978 నవంబరు 23)

ధర్మోద్ధరణలో నాలుగు సోపానములు

దైవము దేశ, కాల పరిస్థితులను పురస్కరించుకొని విభూతులను చాటవలసి ఉన్నది. నా దివ్యవిభూతులు సాధించినవి కావు, మధ్యలో చేర్చినవి కావు. వాటికి అద్భుత కార్యములు,

చమత్కారములు, 'మిరకిల్స్' అని చెబుతూ వస్తుంటారు. అయితే, అవి చమత్కారమొక్కటి మాత్రమే కావు. **చమత్కారము తరువాత రెండవది సంస్కారము, మూడవది పరోపకారము, నాల్గవది సాక్షాత్కారము. ఈ నాలుగు సోపానములున్నాయి భక్తరక్షణలో, ధర్మస్థాపనలో.** చమత్కారమనగా ఆకర్షించడము అని చెప్ప వచ్చును. 'రమయతి ఇతి రామః', రాముడుకూడా ఆకర్షించినాడు. 'కర్షతి ఇతి కృష్ణః', కృష్ణుడు కూడా చమత్కారములవలన ఆకర్షించినాడు. ఆకర్షించేది దైవత్వముయొక్క ప్రధానమైన లక్షణము. దేనికోసం? ప్రజలను మోసగించుటకా? కాదు, కాదు. వారిని సంస్కరింపజేయుటకే. సంస్కారముయొక్క లక్ష్యమేమి? వారిని పరోపకారులుగా తయారుచేయుటయే. పరోపకార దీక్షతో వారు స్వార్థమును మరచి, అందరిలోనున్న ఏకత్వమును గుర్తించి సాక్షాత్కారమును పొందుటయే పరమ లక్ష్యము. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః'; త్యాగమువలననే, పరోపకారమువలననే అమృతత్వమనే మోక్షస్థితిని పొందుటకు సాధ్యమగును. సంస్కారమువలన మానవులు త్యాగబుద్ధిని అభివృద్ధి చేసుకొందురు. "యావత్ప్రపంచమునందలి మానవజాతిపై విశాలమైన తన ప్రేమతత్త్వమును వెదజల్లే దీక్షయే స్వామిది" అని గుర్తించడం అత్యవసరము. ఈ నాలుగు సోపానములలోనూ అంతర్వాహినిగా ప్రవహించేది అట్టి ప్రేమతత్త్వమే. **(1976)**

ప్రదర్శనములు కావు, నిదర్శనములు

ఈనాడిక్కడ ఇన్ని వేలమంది చేరారు. వారికి ఆహ్వానాలు ఏమైనా అందించామా? రమ్మని జాబులు వ్రాశామా? ఏ పత్రికలోనైనా ప్రకటనలు వేశామా? లేదే! అసలు ప్రేమయొక్క ఆకర్షణే ఇది. ప్రేమ అనే చింతామణి ఇక్కడ ఉండడంవలననే ఇంతమంది ఇక్కడ చేరడానికి వీలైంది....ప్రేమపాశమే వీరిని ఇక్కడ కట్టివేస్తున్నది. అదే దైవశక్తి.

"సాయిబాబా ఈ శక్తులు, ఆ శక్తులు ప్రదర్శిస్తున్నాడ"ని మీరు భావించవచ్చు. మీ దృష్టిలో ఇవి ప్రదర్శనములు. కాని, నా దృష్టిలో ఇవి నిదర్శనములు. మీ దృష్టికి ప్రదర్శనమైతే నా దృష్టికి అది సహజము. ఇదే సహజమైన దివ్యప్రేమ. ఇది అందరికీ సాధ్యమయ్యేది కాదు. వేదములు, శాస్త్రములు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు సాధించి, శోధించి అందుకోండి, చూద్దాం. ఏనాటికీ సాధ్యం కాదు. ప్రేమను ఆధారం చేసుకున్నవారికి మాత్రమే ఇది అర్థం అవుతుంది. ప్రేమకు పైసా ఖర్చు లేదు. ప్రేమ మీలో సహజంగానే ఉంటుంది. అనుభవించడానికి ప్రయత్నం చేస్తే లభ్యం అవుతుంది. **(1987)**

నా దృష్టిలో శత్రువులు ఎవ్వరూ లేరు. నాకు అందరూ ప్రియులే. నాకున్న సంపద, ఐశ్వర్యము లోకములో మరెవ్వరికీ లేదు. నాకున్నంత సంపద ప్రపంచబ్యాంకులో కూడా లేదు. చక్రవర్తులకు, మహారాజులకుకూడా లేదు. ఏమిటా సంపద? ఏమిటా ఐశ్వర్యము? నిస్వార్థమైన, నిర్మలమైన ప్రేమ. నిస్వార్థ, నిర్మల ప్రేమతో జీవితము గడపడంచేతనే నా శరీరముకూడా ఎంతో తేజోమయముగా ఉంటున్నది. ... సంకల్పించినంతనే సిద్ధించడం సాయితత్త్వం... సిద్ధి జరిగేరీతిగా ఉంటేనే సాయికి సంకల్పము కలుగుతుంది. .... **(1985)**

స్వామి సంకల్పము, క్రియ రెండూ ఒకేసారి జరుగుతాయి

స్వామి సంకల్పమును ఎవరూ అర్థము చేసుకోలేరు. స్వామికి సంబంధించినంతవరకు సంకల్పము, క్రియ రెండూ ఒకే పర్యాయము జరుగుతాయి. ఇది ఎటువంటిదంటే, తుపాకీతో

కొట్టినప్పుడు శబ్దము, వేటు రెండూ ఒకేసారి జరుగుతాయి.... ఒక్క 50 సంవత్సరములలోపల ఇంత అభివృద్ధి గాంచిన సంస్థను మీరు ఎక్కడైనా చూసినారా? ఏ అవతారమునందైనప్పటికీ ఆ అవతారము ముగిసిన తరువాతనే అభివృద్ధులు జరుగుతూ వచ్చాయి. జీవిత కాలమునందే ఒక యూనివర్సిటీ, ఒక హాస్పిటల్, ఒక విమానాశ్రయము ఇన్ని స్థాపించి, పల్లెలవారికి సరియైన అనుకూలములు చేయడము ఎక్కడా జరగలేదు. ఇది మాత్రమే కాదు. ఇంకా ముమ్ముందు మీరు చూడబోతారు. అయితే, అనేకమందికి ఇది ఎలా జరుగుతోందని సందేహము. స్వామికి అరవై అయిదవ సంవత్సరము ప్రారంభమైనది. ఇంతవరకు ఎప్పుడూ ఎక్కడా ఎవరిముందూ నా చేయి జాపలేదు. నేను ఎవరినీ ఏదీ అడుగలేదు, అడుగను, అడుగబోను. అయితే, ఈ పనులన్నీ ఎలా జరుగుతున్నాయి? మంచి కార్యమునకు భారతదేశమునందు ఏమాత్రము ఆటంకము లేదు. హృదయపూర్వకముగా మంచి చేయాలనుకుంటే కనకవర్షం కురుస్తుంది ... నేను మీనుండి దేనినీ ఆశించడం లేదు, అడుగడం లేదు. కేవలము 'ప్రేమతత్త్వమును పెంచుకోండి' అని చెబుతున్నాను. **(1990)**

ప్రతి ఒక్కరియందున్న 'నేను' అనే బ్రహ్మతత్త్వమే సాయి

చాలామంది సాయితత్త్వమును అర్థము చేసికొనలేకపోతున్నారు. ఈ సాయి ఎవరు? అనేది ఎవరూ అర్థం చేసుకోలేరు. **నేను సన్యాసిని కాదు, యోగిని కాదు, భోగిని కాదు, త్యాగిని కాదు. నేను నేనే.** ఈ 'నేను' అనే పదమే ఆత్మకు మొదటి పేరు. సన్యాసికిగాని, యోగికిగాని కొన్ని కొన్ని పరిమితులుంటాయి. కాని, నాకు ఎట్టి పరిమితులూ లేవు. అపరిమితమైన ఆనందమే నాది. నా పేరు 'నేనే'. ప్రతి ఒక్కనియందు 'నేను' అనేది నిండియుంటున్నది. అదే 'అహం బ్రహ్మాస్మి'. కనుక, 'నేను' అనేదే బ్రహ్మతత్త్వం. **(1992)**

ప్రేమస్వరూపులారా! ఈనాడు మీరు చేయవలసినది ఒక్కటే. నాకు ఇవ్వవలసినదికూడా ఒక్కటే. అన్ని దేశములూ, అందరు మానవులూ సుఖశాంతులు అనుభవించాలని కోరండి. "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు". ఇంతటి విశాలమైన ప్రేమను పెంచుకోవాలి. నిజంగా మీరు నమ్మినా, నమ్మకపోయినా నాలో అలాంటి విశాల హృదయం ఉండడంచేతనే నేను ఇన్నివిధములుగా జగత్తును ఆకర్షించగలుగుతున్నాను. ప్రతి మానవుడు 'P P P' అనే మూడింటిని సంరక్షించుకుంటే అందరూ స్వామి స్వరూపాన్ని ధరిస్తారు. ఈ మూడూ నాయందున్నవని నిస్సందేహంగా చెప్పగలను. ఏమిటవి? P - Purity (పవిత్రత), P - Patience (సహనము), P - Perseverance (పట్టుదల) – ఈ మూడే నన్ను అన్నివిధాలుగా చూసుకుంటున్నవి. ఈ మూడూ ఉన్నవానికి ఎక్కడికి పోయినా, ఎక్కడ ఉండి ఏమి చేసినా ఏమాత్రము భయముండదు. **(1993)**

ఒకరు పొగిడారని నేను పొంగను, ఒకరు తెగిడారని క్రుంగను. పొంగని, క్రుంగని సమత్వం నాయందున్నది. దూషణ, భూషణ, తిరస్కారములకు నేను ఏమాత్రము మార్పుచెందను. దూషణకూ ఆనందమే, భూషణకూ ఆనందమే! ప్రాకృతమైన ప్రేమ పుచ్చుకునేదేగాని, ఇచ్చుకునేది కాదు. నా ప్రేమ ఇచ్చుకునేదేగాని, పుచ్చుకునేది కాదు. ఇట్టి ప్రేమను మీరుకూడా పెంచుకోండి. **(1998)**

నా జీవితమే నా సందేశం. నన్ను మీరు అనుసరించండి. నన్ను ఎవరు దూషించినప్పటికీ, ఎవరు విమర్శించినప్పటికీ నేను ఎవరినీ ద్వేషించను, విమర్శించను. మీరు ఇట్టి ఆదర్శాన్ని అనుసరించినప్పుడు

మీరుకూడా సాయిబాబాతో సమానమైన తత్త్వాన్ని పొందుతారు. ఈనాడు నాకు ఇంతటి కీర్తి లభించిందంటే నా ప్రేమతత్త్వమే దీనికి కారణం. ఇదే నా నిజమైన ఆస్తి. లోకంలో కొంతమంది తమ అమ్మానాన్నల ప్రేమకే పాత్రులు కాలేరు. నేనింతమంది ప్రేమకు పాత్రుడనయ్యానంటే, ఇదే దైవత్వానికి చిహ్నం. లోకమంతా నన్ను ప్రేమిస్తోంది. ఈనాడు ఇక్కడకు వచ్చినవారు మాత్రమే కాదు, రాలేనివారు ఎన్ని కోట్లమందో ఉంటున్నారు. ఇంతమంది ప్రేమకు పాత్రుడను కావడమే దైవత్వానికి నిదర్శనం. పిల్లలు మొదలుకొని పెద్దలవరకు అందరికీ స్వామిపట్ల ప్రేమయే. ఏనాడు ఏ తపస్సులు చేశారో మీరు, ఏ యాగములు ఆచరించారో మీరు, ఎన్ని విధములైన సాధనలు చేశారో మీరు – ఈనాడు ఇటువంటి ఆనందమును అనుభవించడానికి మీకు అవకాశం చిక్కింది. **(2001)**

రాగద్వేషాలను దూరం చేసుకుంటే మీరు నావారు, నేను మీవాడను

ప్రేమస్వరూపులారా! "దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్పదెప్పుడున్". కనుక, ఈ దేహమునుండి వచ్చిన ప్రేమతత్త్వాన్ని ఆధారంగా తీసుకోండి. నా జీవితమంతా ప్రేమమయమే. నా ప్రేమయే అందరి హృదయాలను ప్రేమమయంగా మార్చుతుంది... ఈనాడు ఈ దేహానికి 71వ పుట్టినరోజు. ఇప్పటికీ ఈ దేహము ఈవిధంగా ఉండడానికి ఏది కారణము? నా కాలిగోరు మొదలుకొని తలవెంట్రుకవరకు అంతా ప్రేమయే! ఈ ప్రేమచేతనే స్వామి తత్త్వము జగత్తంతా వ్యాప్తి అవుతున్నది. ప్రేమ అనే అయస్కాంతమే అందరినీ ఆకర్షిస్తుంది. అయితే, కొంతమంది "ఇనుప ముక్కలను" ఆకర్షించకపోవడంవలన వారు అనుకుంటారు, "నిజంగా ఈ అయస్కాంతములో శక్తి ఉంటే, నన్నెందుకు దగ్గరకు లాగలేదు?" అని. ఇది చాలా పొరపాటు. ఈ ప్రేమాయస్కాంతములో చాలా శక్తి ఉంది. కాని, కొన్ని 'ఇనుపముక్కల్లో' 'రస్టు, డస్టు' చేరడంవల్ల వాటిని ఆకర్షించడం లేదు. అవే రాగద్వేషములు. అవే విషయవాసనలు. వాటిని తొలగించుకుంటే, ఈ అయస్కాంతము తప్పక ఆకర్షిస్తుంది. అసూయా భావములు, రాగద్వేషములు మున్నగు దుర్గుణాలనన్నిటినీ దూరం చేస్తే, ఎక్కడున్నా మీరు నావారే! నేను మీవాడనే! **(1996)**

అడవులందున్న ఆకసముననున్న
పట్టణముననున్న పల్లెనున్న
గుట్టమీద నున్న నట్టేట పడియున్న
మరువబోడు సాయి మిమ్ము మదిని ఎపుడు

నేను భక్తులకు భక్తుణ్ణి

ముఖ్యంగా ఈ ఐదు సూత్రాలను మీరు పాటించండి.

1. Don't waste money. Misuse of money is evil. ధనాన్ని వ్యర్థం చేయకండి. అనవసరంగా ఫోటోలు కొని ధనాన్ని దుర్వినియోగం చేయకండి. కావాలంటే ఒక్క ఫోటో పెట్టుకోండి, చాలు.

2. Don't waste food. Food is God. ఆహారం భగవత్స్వరూపం. కనుక, ఆహారాన్ని వ్యర్థం చేయకండి.

3. Don't waste time. Time is God. కాలము భగవత్స్వరూపము. కనుక, కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితాన్నే వ్యర్థం చేసినట్లవుతుంది.

4. Don't waste energy. మీ చూపులను, తలంపులను, వినికిడిని, మాటలను, కర్మలను ఏమాత్రము వ్యర్థం చేయకండి. వీటిని వ్యర్థం చేస్తే, మీ ఎనర్జీ (శక్తి)ని వ్యర్థం చేసుకున్నవారవుతారు.

5. దైవాన్ని క్షణమైనా మరువకండి.

మీరందరూ ఈ ప్రశాంతి నిలయానికి వచ్చినందుకు, సత్యసాయి భక్తులమనుకున్నందుకు ఆదర్శజీవులుగా రూపొందండి. "సత్యసాయి భక్తులు, సత్యసాయి విద్యార్థులు ఎంతో పవిత్రంగా, ప్రశాంతంగా జీవితాన్ని గడుపుతారు" అనే పేరు తెచ్చుకోండి. ఆ పేరు మీకేగాని, నాకు కాదు. 'మేము సత్యసాయి భక్తులము' అని మీరు చెప్పుకుంటున్నారు. కాని, నాకు ఎవరూ భక్తులు లేరు. నేనే ఒక భక్తుణ్ణి. ఎవరికి? భక్తులకి భక్తుణ్ణి. భక్తుల కోరికలు నెరవేర్చడమే నా కర్తవ్యం. అందరూ నావారే! నేను అందరివాడనే! **(1997)**

ఈ దివ్యశక్తికి చావు లేదు, పుట్టుక లేదు

నా ప్రేమయే నాకు పెద్ద ప్రోపర్టీ! అందువల్లనే, నేను అప్పుడప్పుడు చెబుతుంటాను –

Love is My form (ప్రేమయే నా స్వరూపం)
Truth is My breath (సత్యమే నా శ్వాస)
Bliss is My food (ఆనందమే నా ఆహారం)
My life is My message (నా జీవితమే నా సందేశం)
Expansion is My life (వ్యాపకత్వమే నా జీవితం)
No reason for love (ప్రేమ కారణానికి అతీతం)
No season for love (ప్రేమ కాలానికి అతీతం)
No birth, no death (ప్రేమకు చావు లేదు, పుట్టుక లేదు)

ఈ దివ్యశక్తికి చావు లేదు, పుట్టుక లేదు. ఈ దేహములు రావచ్చును, పోవచ్చునుగాని, ఆత్మతత్త్వానికి రాకపోకలు లేవు; ఒక రీజన్ లేదు, సీజన్ లేదు. **(1998)**

ప్రతి మనిషియందు ఉన్న ఆత్మతత్త్వాన్ని గౌరవించాలి. ఆత్మవిశ్వాసమే నిజమైన విశ్వాసము. విగ్రహాలపై ఉండే విశ్వాసము తాత్కాలికమైనది. తిరుపతికి పోయినప్పుడు దైవాన్ని వేంకటేశ్వరస్వామి రూపంలో పూజిస్తారు. 'వేంకటేశ్వర స్వామి నా కులదైవము', అని కీర్తిస్తారు. బృందావనం వెళ్ళినప్పుడు కృష్ణుని పేరుతో భగవంతుణ్ణి పూజిస్తుంటారు. 'కృష్ణుడు మా దైవం' అంటారు. మరి అయోధ్యకు వెళ్ళినప్పుడు 'రాముడు మా దైవం' అంటారు. దేశ, కాల పరిస్థితులను బట్టి అక్కడ ఆయా పేర్లు పుట్టినాయిగాని, భగవంతునికి భేదములు ఏమాత్రము లేవు. ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు. రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు, సాయిబాబా అంతా ఒక్కటే. రూపములో ఉన్న వ్యత్యాసమును చూసి భ్రమించకూడదు. రూపము శాశ్వతము కాదు. కనుక, శాశ్వతమైన ఆత్మతత్త్వాన్ని విశ్వసించాలి. **(2005)**

స్వామికి ఇవ్వవలసిన కానుక

ఈ బర్త్‌డేనాడు స్వామికి ఇవ్వవలసిన కానుక గురించి మీరు ఆలోచించాలి. తోటి మానవులను ప్రేమించి, వారి బాధలలో భాగం వహించి వారికి తగిన సేవలను ఆచరించినప్పుడే స్వామికి సరియైన

2

కానుకను ఇచ్చినట్లుగా ఉంటుంది. స్వామి కోరే కానుక అదొక్కటే. నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన ప్రేమను పరమాత్మునికి ప్రెజెంటుగా అందించాలి.... **(1982).**

ప్రేమస్వరూపులారా! ఈనాడు నా పుట్టిన పండుగను జరుపుకుంటూ మీరానందమును అనుభవిస్తున్నారు. నిజానికి నాకు పుట్టిన పండుగ అన్నదే లేదు. మీ ఆనందము నిమిత్తమై, మీ ఆశల నిమిత్తమై నేను ఏవో కొన్ని కార్యక్రమములు జరుపుతూ పోతుంటాను కాని, నాకు రెండూ లేవు. పుట్టుక ఉంటే కదా చావు; చావుంటే కదా పుట్టుక. నాకు చావు, పుట్టుకలు రెండూ లేవు. **(1980)**

భారతదేశము పుణ్యభూమి, యోగభూమి, త్యాగభూమి. అందు చేతనే, మేక్స్ ముల్లర్‌వంటి విదేశీయులు భారతదేశములో పుట్టాలని, భారత దేశములోనే మరణించాలని ఆశించారు. ఇంతటి పవిత్రమైన భారత భూమిలో పుట్టిన మీకు ఎందుకు త్యాగము రావడం లేదు? మీరు భారత పుత్రులు. కనుక, భారతీయులుగా జీవించి ఇతరులకు ఆదర్శాన్ని నిరూపించండి. ఆనందాన్ని అందించండి. “లోకాస్సమస్తా స్సుఖినో భవంతు”. అందరూ మంచిగా ఉండాలి; క్షేమంగా ఉండాలి; హెల్దీగా, హేపీగా ఉండాలి. అదే నాకు నిజమైన ‘బర్త్‌డే’. మీరందరూ ఆనందముగా ఉన్న దినమే నా ‘బర్త్‌డే’. **(1998)**

ప్రేమస్వరూపులారా! ఇది ఈ దేహముయొక్క పుట్టినరోజేగాని, నాకు పుట్టినరోజు లేదు. నేడు స్వామి మీకు అందించే సందేశ మేమిటంటే, ‘స్వామియే మీరు, మీరే స్వామి’. స్వామి మీకంటే ప్రత్యేకంగా లేదు. I am always ready. నేనెప్పుడూ సిద్ధంగానే ఉన్నాను, తీసికొనిపొండి. ఎవరు హృదయ పూర్వకంగా ప్రేమిస్తారో, వారి సొత్తునే నేను. నాకు కావలసింది ప్రేమ ఒక్కటే. కనుక, ప్రేమతో జీవితాన్ని గడపండి. ప్రేమలో మీ జీవితాన్ని లీనం చేయండి. ఇదే మీరు స్వామికి ఇవ్వవలసిన కానుక. **(1999)**

శ్రీ పుట్టపర్తి నిలయుడు కాపాడును నిన్ను ఎపుడు కరుణాకరుడై....

ప్రతి మహనీయునియొక్క ఉన్నతికి తల్లియే మూలకారణం. ఈశ్వరమ్మయొక్క సద్గుణముల వల్లనే ఈ పుట్టపర్తి ఇంత గొప్ప పేరుప్రఖ్యాతులు పొందినది. ఈశ్వరమ్మకు ఆనాడు ప్రమాణం చేయటంవలన నేను ఈనాటి వరకు పుట్టపర్తిని వదలలేదు. ఎవరైనా ఇక్కడకు రావలసిందేకాని, నేను ఇంకెక్కడా స్థిర నివాసము చేసేది లేదు. ఈనాడు అనేకమంది తాము పుట్టిన స్థానమును వదలిపెడుతున్నారు. పుట్టిన స్థానమును వదలకూడదు. అది ఈ అవతారముయొక్క తత్త్వము. ఇక్కడ ఉన్న చెట్టును పెరికి ఇంకొకచోట నాటితే అది ఎంతకాలం బ్రతుకుతుంది? ‘సాయిబాబా’ అనే ఈ మహావృక్షము ఎక్కడ పుట్టిందో అక్కడే పెరగాలి. ఈ పుట్టపర్తిని వదలకుండా నేను యిక్కడే ఉండటమువలన ఈ గ్రామము ఒక పెద్ద పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది.

శ్రీ పుట్టపర్తి నిలయుడు
కాపాడును నిన్ను నెపుడు కరుణాకరుడై
చేపట్టి నిన్ను బ్రోచును
ఏ పట్టున మరువకుండ ఏలును నిన్నున్.

ప్రేమస్వరూపులారా! మీరు నిజంగా పుణ్యాత్ములు, చాలా అదృష్టవంతులు. స్వామితో ఆడుతూ, పాడుతూ ఆనందంగా కాలం గడుపుకుంటూ వచ్చారు. మీతో సాయి, సాయితో మీరు. కనుకనే, I and you are one (మీరు, నేను ఒక్కటే) అని చెబుతూ వచ్చాను. **(2003)** ❈

మాయలలో పడకుండా ఉత్సాహం నిల్పుకోవాలి

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య

"ప్రతి మనిషీ సమాజాన్ని మార్చాలనుకుంటాడు కానీ, తాను మారాలని అనుకోడు!" (భగవాన్ బాబా) లోకంలో తరతరాలుగా, యుగయుగాలుగా ఉన్న రోగం ఇదే. అన్ని కాలాలలోనూ ప్రపంచంలోని అన్ని దురవస్థలకూ ఇదే కారణం. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు వచ్చింది ఈ కుహనా సంస్కర్తలను సంస్కరించి నిజమైన మార్పుని లోకంలో కల్గించ డానికే. ధర్మ సంస్థాపనకోసం ఆయా యుగాలలో తాను అవతరిస్తానని శ్రీకృష్ణ పరమాత్ముడు నికరంగా చెప్పారు. ధర్మచ్యుతి మనిషివల్లనే జరుగుతుంది. ఒక జంతువు ఎప్పుడూ తన సహజ గుణాన్ని వదలదు. సహజ ప్రేరణకు (ఇన్‌స్టింక్ట్) వ్యతిరేకంగా ప్రవర్తించదు. అందుకే జంతువులకు సంఘాలు, సమాజాలు ఉండవు. కాని, మనిషి సంగతి వేరు. అతను తన నిజమైన వ్యక్తిత్వాన్ని వదలుకొని పశుత్వానికి దిగజారిపోతున్నప్పుడల్లా సమాజం అతణ్ని హెచ్చరించి తిరిగి సరయిన దారిలో పెడుతుంది. మొత్తం సమాజమే తన సువ్యక్తిత్వాన్ని కోల్పోయి దిగజారి భ్రష్టమైపోతున్నప్పుడు భగవంతుడే సమాజంలోకి దిగి రాక తప్పదు. రెండు ప్రపంచ యుద్ధాల నడిమి కాలంలో అట్లా "దిగి" వచ్చిన అవతారమే భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు. వారు ఏ విశ్వాసాన్నైనాకాని, పెకలించివేసి దాన్ని నిర్మూలించడానికి రాలేదు. "ఎవరి విశ్వాసంలో వారిని స్థిరపరచడానికి వచ్చాను" అని వారు అనడం అందరికీ తెలిసిన సత్యమే.

తల్లిదండ్రులను గౌరవించడం పశువులకు తెలియకపోవచ్చును. కాని, అది మనుష్యులకు కూడా తెలియకపోవడం అధర్మం, అమానుషం అవుతుంది. ఒకసారి భగవాన్ బాబావారు ఒక కుటుంబానికి (తల్లీ తండ్రీ కుమారులకు) ఇంటర్వ్యూ ప్రసాదించారు. ఇంటర్వ్యూ గదిలో తల్లీ తండ్రీ వంగి స్వామి పాదాలకు నమస్కరించారు. ఆ తర్వాత కొడుకు కూడా నమస్కరించబోగా, "వద్దు, వద్దు. నువ్వు ముట్టవద్దు" అని కఠినంగా బాబా తమ పాదాలను వెనక్కి తీసికొంటూ అన్నారు. అతని తల్లి భయపడ్తూ ఎందుకని స్వామిని అడగ్గా సంభాషణ ఇట్లా సాగింది –

స్వామి: తల్లిదండ్రులను గౌరవించకుండా, వారు చెప్పిన మాట వినకుండా ఉండేవాళ్ళంటే నాకు ఇష్టం ఉండదు. అలాంటివాడు నమస్కారం చేసేందుకు అర్హుడు కాదు.

తండ్రి: స్వామీ, దయచేసి మీరు వీణ్ని క్షమించి ఉద్ధరించాలి. వీడికి సద్బుద్ధినిచ్చి కాపాడాలి.

కుమారుడు: స్వామీ, ఇకమీదట నేను అటువంటి తప్పు చేయను. నా తల్లిదండ్రులకు విధేయునిగా ఉంటాను. నా అపరాధాన్ని మన్నించండి. దయచేసి మీ పాదాలకు నమస్కారం చేసికొనే అవకాశం ఇవ్వండి.

స్వామి: అట్లా అయితే, ఇకముందు సరిగా నడుచుకొంటావా? సరే, ముందర వీళ్ళ కాళ్ళమీద పడి క్షమించమని వేడుకో. తరువాత మిగతాది.

చాలా చిన్న విషయమే కావచ్చు. కాని, ఆ చిన్నవాడిలో మార్పుకి కారణమయ్యారు బాబా. ఒక తరానికి తరం ఇలా మార్పుకి లోనయ్యేటట్లు చేశారు స్వామి. బాలవికాస్‌ని ప్రపంచవ్యాప్తంగా భగవాన్ వ్యవస్థాపింపజేయడం ఇందుకే. లక్ష ఉపన్యాసాలు చేయలేని పనిని భగవాన్ తమ సంస్థలద్వారా, తమ ప్రభావంతో సాధ్యపడేట్లుగా చేశారు – చేస్తున్నారు.

ఒక చిన్న వయస్సులోని సన్యాసి స్వామివద్దకు వచ్చి ఇంటర్వ్యూలో స్వామితో తనను సాధనలో

పురోగమింపజేయమని కోరగా స్వామి అతనితో, “నాయనా, నీవు చేసిన సాధనలు చాలు. ఊరికి పోయి ఏదో ఒక ఉద్యోగంలో చేరి మీ అమ్మను కాపాడు” అని అన్నారు.

సన్న్యాసి: అదేమిటి స్వామీ? అట్లా ఎక్కడైనా ఉంటుందా? సన్న్యాసి మళ్ళీ సంసారి అవుతాడా? నా సాధన అంతా మట్టిపాలయిపోతుంది కదా?

స్వామి: నువ్వు చేసిన సాధనలో ఏమి మిగిలింది? అంతా మీ అమ్మ కన్నీటిలో కొట్టుకుపోయింది.

(పై రెండు ఘటనలూ “శ్రీ సత్యసాయి ఆనందదాయి”లోనివి)

కారుణ్యానికి ఇంతకన్నా గొప్ప ఉదాహరణ వేరే దొరకదు. సన్న్యాసిత్వం, ఆధ్యాత్మికత్వాలకు సరైన భాష్యం భగవాన్ ఇట్లా చేశారు. ఎంత గొప్ప మార్గంలోకి ప్రవేశించామని మనం అనుకొంటున్నప్పటికీ, దాని పునాదిలో అమానుషత్వం, క్రౌర్యం, నిర్దయ ఉండకూడదు. భగవాన్ బాబావారు ఈ తన అవతార కాలంలో వ్యవస్థాపించి నిలిపిందీ, నిలుపుతున్నదీ మానవతా విలువలనే. వారి సర్వ సంకల్పాలలోనూ, సర్వ కార్యాలలోనూ ఈ మానవతా విలువలే ప్రధానంగా అంతర్లీనంగా ఉంటాయి. వ్యక్తీ, కుటుంబ స్థాయిలనుంచి, మతమూ సమాజ స్థాయుల వరకు భేద భావాలనూ, సంఘర్షణలనూ లేకుండా చేయడానికే వారు అనుక్షణమూ పూనుకొన్నది.

ఐతే, ఒక రాజకీయ నాయకునిలాగానో, సామాజిక సంస్కర్తలాగానో ఆధ్యాత్మికత లేని కేవల లౌకిక లక్ష్యంతో భగవాన్ బాబావారు ఉద్యమించ లేదు. సౌష్ఠవమయిన సమాజానికి ఆధ్యాత్మికవాసన లేని మానవ సమూహాలు వ్యర్థం. అందుకే వారు ఆధ్యాత్మికతను ఎనిమిది అంశాలుగా వివరించి, మానవ సమాజాలను సరయిన మార్గంలో పెట్టారు. “జ్ఞాన జ్ఞేయ జ్ఞాతృ రహితమ్ పరమార్థ తత్త్వమ్’ అని శంకరులు అన్నంత స్పష్టంగానే “మానవ జీవితమునకు పరమార్థము ఆత్మ” అని సత్యసాయి వాహినిలో మొట్టమొదటి వాక్యంగా సువర్ణాక్షరాలతో రాశారు. మానవునిలో మార్పు మార్పుకోసం మాత్రమే కాదు. ఆ మార్పుకి పరమ లక్ష్యం ఉన్నదనీ, అది ‘ఆత్మసిద్ధి’ అనీ భగవాన్ స్పష్టీకరిస్తున్నారు.

“అర్థం ధర్మం అధీనంలో ఉండాలి. కామం మోక్షం అధీనంలో ఉండాలి.” (1961-62 ఉపన్యాసాలలో) అని చతుర్విధ పురుషార్థాల పరమార్థాన్ని సువ్యక్తం చేశారు స్వామి. **“ఆత్మతత్త్వాన్ని జ్ఞప్తియందు ఉంచుకొనుటే ఆధ్యాత్మికం.”** (1990 ఉపన్యాసాలు) అని మనిషిలో నిజమయిన మార్పుకి అతను నిరంతరం ఏ ధ్యాసతో ఉండాలో భగవాన్ మార్గ నిర్దేశం చేశారు. తాను సగుణ సరూప బ్రహ్మముగా అవతరిస్తూనే తన సహజ స్థితియైన నిర్గుణ బ్రహ్మ స్థితిని ఏ క్షణమూ వదలకుండా భక్తి మార్గంలోంచి జ్ఞానమార్గం త్రోవవేసి, ఆ త్రోవలోకి సహస్ర సహస్ర సాధకులను ప్రవేశపెట్టినారు భగవాన్.

ఇవేళ భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు సదేహులయి “లేరు.” లేరన్నది ఎవ్వరూ నమ్మలేని విషయం! వారి సంకల్పం ఉంది. వారి మహిమ ఉంది. వారి వైభవం ఉంది. వారి పాండిత్యం “పంచాదశ వాహినులు”గా ప్రవహిస్తున్నది. మండనమిశ్రుని బ్రహ్మసిద్ధి, సురేశ్వరుని నైష్కర్మ్య సిద్ధి, విముక్తాత్ముని ఇష్టసిద్ధి, మధుసూదన సరస్వతియొక్క అద్వైత సిద్ధి మొదలయిన అద్వైత తత్త్వ గ్రంథాలు, శంకరుని ప్రస్థాన త్రయ భాష్యములూ భగవాన్ బాబావారి మొదటి ఐదు వాహినీ గ్రంథాలలో సులభరీతిలో పునర్ వ్యక్తమయి సాధకులకు కొంగుబంగారమయ్యాయి. సాధకుడు భక్తుని స్థాయినుంచి జ్ఞాని స్థాయికి ఎదుగటానికి కావలసిన తత్త్వ గ్రంథమంతా భగవానుడు ఇచ్చే స్థూల దేహాన్ని వదిలివేశారు. వారి ‘జీవత్’ కాలంలోనూ పనిచేసిన మహాశక్తి స్థూలానిది అని అనుకోవడం అపరిపక్వతే. వారి శక్తి దేహ పరిమితమైంది కాదు. వారి దేహం ఉపస్థితిలో లేకుండానే లక్షలాది భక్తుల గృహాలలో వారి దివ్య లీలలు జరిగాయి. అవి ఇప్పుడూ జరుగుతూనే ఉన్నాయి.

ఈ విశ్వగురువుని ఆశ్రయించుకొన్నవారు మరెక్కడికీ మారాల్సిన అవసరం లేదు. 1970లలో

తమిళనాడులోని ఒక ఊరిలో ఉన్న ఒక యోగి సమాధి దగ్గర పూజ చేస్తే, ప్రార్థిస్తే జబ్బులు పోతాయనీ, ఏ సమస్య అయినా పరిష్కారమవుతుందనీ ఒక తమిళ పత్రికలో పడింది. అది చూసి సతీశ్ అన్న కన్నమ్మ గారి నాల్గవవాడికి కాలి బాధ నివారణకోసం వెళ్ళి రమ్మని తల్లి చెప్పగా అతనక్కడికి వెళ్ళే ప్రయత్నంలో ఉండిపోయాడు. ఆ రాత్రి స్వామి అతనికి కలలో అగుపించి, "ఎక్కడికిరా బయలుదేరుతున్నావు?" అని గద్దించారు. అతనూ సిగ్గుతో ప్రయాణం మానుకున్నాడు! కాలిబాధకూడా నివారణ అయింది! ఇక్కడికి వచ్చినవాళ్ళు మరెక్కడికీ మారాల్సిన అవసరం లేదు. "మీరున్నచోటే నన్ను దర్శించేటట్లు కావాలి. "ఇంటర్‌వ్యూ" కాదు, "ఇన్నర్‌వ్యూ", అంతర్ దృష్టిని పొందండి" అని అనేకమార్లు అన్నారు భగవాన్. నిర్గుణ నిరాకార బ్రహ్మముయొక్క సకల శక్తులను తీసికొని వచ్చానని చెప్పిన సత్యసాయి, ఇవేళ మనలో మార్పుని తెస్తూ, మహాసమాధిగతుడయి, అక్కణ్నించే తన మహిమను, శక్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. కోరుకున్నవారికి కోరుకున్నంత! కోరికే లేనివాడికి సర్వమూ ఇస్తారీ స్వామి!

86 వేల జన్మల నెత్తుతూ వచ్చిన మనకు మళ్ళీ జన్మ లేకుండా చేయడంకోసమే వారు జన్మనెత్తినా రన్నది సత్యం. దేహాన్ని వదిలేసినా ఈ సత్కార్యాన్ని వారు చేస్తూనే ఉన్నారు. దీనికిగాను మనం వారిచ్చిన జ్ఞానాన్ని మననం చేస్తూ దానికి కట్టుబడి ఉంటూ మాటల్లో కాక చేతల్లో పరమార్థ సాధనకు పూనుకోవాలి. సాయి దేవుడిచ్చిన మహాశక్తి ఉత్సాహం. విశ్వమంతా వ్యాపించి ఉన్న సాయీశ్వరుణ్ని మన గుండెలలో ఆవిష్కరింపజేసేది ఈ ఉత్సాహంతో చేసే పుణ్యకార్యాలే. సాయి 'లేకుండా' జరుగుతున్న మొదటి జన్మదినం ఇది. కృష్ణుడు పోయాడా? రాముడు పోయాడా? బుద్ధుడు పోయాడా? అందరూ ఉన్నారు. సాయి కూడా **ఉన్నారు** – మన చేతల్లో, ఆలోచనల్లో, హృదయాలలో, శ్వాసల్లో.

ఉత్సాహం దివ్యగుణం. ఏ క్షణమూ ఆ దివ్య గుణాన్ని పోగొట్టుకొనవద్దు. జపతపాలు చేసినా, ఆటలాడినా, పాట పాడినా, సేవలు చేసినా మరొకటి చేసినా ఈ దివ్యలక్షణాన్ని కలిగి ఉంటే భగవంతుడు మనలోనుంచి ఆవిష్కారమవుతారు. కొత్త దేవుళ్ళకీ, కొత్త గురువులకూ దూరంగా ఉంటూ, మార్గం విడువకుండా, పట్టు వదలకుండా, ఏ మార్గంలో ఏ విశ్వాసంలో ఉన్నామో, అందులోనే ఉంటూ, సత్యసాయి వాహినిలో, జ్ఞానవాహినిలో ప్రశాంతి సముద్రానికి చేరుకుందాము. అక్కడ శేష శయనుడైన సాయి పద్మనాభుడు వేచి ఉన్నాడు. మనకోసం కాచుకొన్నాడు. కావలసిందల్లా ఉత్సాహం నీరు కాకుండా చూసికోవడం, పట్టుదలతో ముందుకు వెళ్ళడం, కొత్తకొత్త మాయలలో పడకపోవడం! అంతే!

Sri Sathya Sai General Hospital

Prasanthi Nilayam -515134

Email: hrmgh@sssihms.org.in, Phone 08555-287256,

Applications are invited for the following posts

Consultant / Senior Resident in the Department of OBGY

Qualification : M.B.B.S + MD/ D.G.O+ relevant experience in the Department of OBGY

Consultant in the Department of General Medicine

Qualification : M.B.B.S + MD (General Medicine) + relevant experience in the Department of General Medicine.

Apply to the Medical Superintendent, Sri Sathya Sai General Hospital, Prasanthi Nilayam, with full Bio-data and a photograph immediately.

జ్ఞాపకాల పందిరి

(ధారావాహికం)

ప్రొ॥ కామరాజు అనిల్ కుమార్

"ఎందుకలా అనుకుంటున్నావు? స్వామికి అన్నీ తెలుసు. నీగురించి చాలాసార్లు అడిగినారు." "అనిల్‌కుమార్‌ని ఎక్కడ చూచావు? మాట్లాడటం విన్నావా?" అని అంటూ బాబా విచారించారయ్యా! ఏమీ బాధపడవద్దు" అన్న కస్తూరిగారి మాటలు నాకు చెవులలో స్పష్టంగా రింగుమంటూనే ఉన్నాయి.

"సార్! నాకోసం మీరు కబురుపంపినారటకదా! సేవాదళ్‌వారు వెతికినారట. ఈరోజు సాయంకాలం పూర్ణచంద్రసభామంటపంలో ప్రసంగించే అవకాశం భగవాన్ అనుగ్రహింపనున్నారట. నేను కనబడక పోవటంతో అదృష్టం జారిపోయింది సార్! క్షమించండి. How can you back an unlucky horse? ఒక దురదృష్టవంతుడిని ఎలా సమర్థించ గలరు? నాకు అర్హత లేదేమో" అని గద్గదిక కంఠంతో 1977వ సంవత్సరం, దసరాల రెండవరోజున సాయంకాలం, సౌత్ ప్రశాంతిలో ఉంటున్న కస్తూరి గారితో, నేను అన్న మాటలివి.

"స్వామికి ఎవరు అర్హులో కారో తెలియ దనుకుంటున్నావా? ఏది ఎప్పుడు ఎలా చేయాలో సర్వం స్వామికి తెలుసు. బాధ పడవద్దు, వారి దృష్టిలో పడ్డావు, సంతోషించు. అది చాలదా ఏమి? అన్నారు" కస్తూరిగారు. ఇంతకీ జరిగిందేమిటనుకుంటున్నారు? ఆరోజున స్వామి నాగురించి కస్తూరిగారిని విచారించ మన్నారట. ఈ పెద్దాయన అందరితో ప్రశాంతి నిలయం అంతా వెతికించారు నేను కనబడలేదు. ఫలితంగా ఆ దసరాలలో ప్రసంగించే అవకాశం జారవిడుచుకున్నాను. మరి విచారం ఉండదా చెప్పండి? ఏనాడూ ఒక పలకరింపుకాని, చిరునవ్వుకాని, పాదనమస్కారంకాని, చివరకు మొదటి వరుసలో సీటుకూడా లభించలేదు. మన జాతకం ఏలినాటి శని ప్రభావం అలా ఉంది. ఎప్పుడయినా ముందు వరుసలో కూర్చుంటే ఆవైపు బాబా రాకపోవటంకాని, లేదా నాప్రక్క కూర్చున్నవారిని పలకరించి తరలిపోవటంకాని జరిగేది. నా స్థూలకాయం వారికి కనబడలేదు కాబోలు అని అనిపించేది. అందువల్ల ఏడు సంవత్సరాల తరువాత స్వామి నాకోసం కబురంపితే మొట్టమొదటిసారిగా వారిని సన్నిహితంగా చూసే అవకాశం, వారిముందు ఉపన్యసించే అదృష్టం జారిపోతే దుఃఖం రాదా చెప్పండి? "స్వామి నాపేరు ఉచ్చరించారా? నన్ను ప్రసంగింపమన్నారా? నేను లేకుండా పోయానా? ఏడు సంవత్సరాల నిరీక్షణ వృథా అయిందా?" అన్న భావాలు మనసులో కదిలాయి. "పోనీలే. సాయం కాలం సమావేశం ముందుగా వచ్చి, ముందువరుసలో కూర్చో. స్వామి నిన్ను నీ అదృష్టంకొద్దీ చూస్తే సరిపోతుంది" అన్నారు కస్తూరిగారు.

సరిగ్గా సాయంకాలం, 4.50 నిమిషాలకు బాబా విచ్చేసి అన్ని వరుసలలో సంచారం చేసి, భక్తులను పలకరిస్తూ ఆశీర్వదిస్తూ మెల్లగా నాముందు నిల్చారు. **"ఏమి? ఎక్కడకు పోయుంటివి? నీకోసం క్యాంటీన్‌కు, రూముకు కబురంపినాను. లేరన్నారు. ఈపొద్దు మాట్లాడిద్దామనుకున్నాను"** అన్నారు స్వామి. గజగజా వణికిపోయింది నా శరీరం. మాట పెగల్లేదు. చివరకు ధైర్యం కూడదీసుకుని అన్నాను, "స్వామీ! క్షమించండి బైట అమ్మన్నశాస్త్రిగారింట్లో ఉన్నాను. పొదిలి విశ్వనాథ శర్మగారు, పురిఘళ్ళ అప్పారావుగారు, మంచిరాజు సూర్యనారాయణమూర్తిగార్లతో కాలం గడిపాను. 'షిర్డీ వైభవం, పర్తి ప్రాభవం' గురించి విశ్వనాథ శర్మగారు

చెప్తుంటే ఒళ్ళు గగుర్పొడిచింది. సమయం మరిచి పోయాను. కనుక నేను రూంలో లేను. దయచేసి క్షమించండి" అని అన్నాను ప్రాధేయపూర్వకంగా. **"తప్పేమి? ఏమీ బాధపడవద్దు. మంచిది, నమస్కారం చేసుకో"** అన్నారు. లేడిపిల్లలా ఎగిరి గంతేసి వారి పాదాల మీద పడ్డాను. "స్వామీ! నేను లేనప్పుడే మీరు పిలవాలా? మీరు పిలిచినప్పుడే నేను లేకుండా పోవాలా? సర్వాంతర్యామి, సర్వజ్ఞులైన మీకు తెలియనిదేముంది?!" అని మనసులో తలపోయ నారంభించాను.

1978వ సంవత్సరం (సంవత్సరం గడిచాక) దసరాలలో మహద్భాగ్యం కలిగింది. ఆరోజున మామూలుగానే కస్తూరిగారు తెలిపినట్లుగా వేదికపై కూర్చున్నాను. స్వామి రాగానే నుంచున్నాను. నమస్కారం చేసుకున్నాను. వేదికపైన స్వామి సింహాసనం వెనుక కారుణ్యానందస్వామి, ఒకప్రక్కన కస్తూరిగారు, భగవంతంగారు కూర్చొని ఉన్నారు. నన్ను మాట్లడమన్నట్లుగా స్వామి సైగచేసేసరికి వారిని సమీపించి, "స్వామీ! ఇంగ్లీషులోనా, తెలుగులోనా?" అని అడిగాను. **"ఇంగ్లీషులో చెప్పు"** అన్నారు. వారి దయ! అదే సంవత్సరం దసరాలలో రెండవ అవకాశం ప్రసాదించారు. దుర్గాష్టమినాడు ఇంగ్లీషులోను, విజయదశమినాడు తెలుగులోను ఉపన్యసించాను. ఇది నా ఆరంగేట్రం ప్రశాంతినిలయంలో.

1980 సంవత్సరంలో నాకు టెలిగ్రాం అందింది. స్వామి నన్ను ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర రాయలసీమల శ్రీ సత్యసాయి సేవాసంస్థల జోనల్ కన్వీనర్‌గా నియమించినట్లు ఆదేశాలందాయి. వెంటనే పర్తికి వచ్చి "స్వామీ! వరల్డ్ కౌన్సిల్ ఛైర్మన్‌గారు పంపిన ఆర్డర్ చేరింది. చాలా కృతజ్ఞుణ్ని, ఆశీర్వదించండి" అన్నాను. **"ఆర్డరు వేరెవరిదోకాదు. నిన్ను నేనే నియమించాను"** అన్నారు. ఒళ్ళు పులకరించిపోయింది. అంతా స్వామి సంకల్పం, నిర్ణయం ప్రకారం జరుగుతాయని తెలిసింది.

కాలం గడిచింది. హిల్‌వ్యూ స్టేడియంలో బాబావారి జన్మదినోత్సవం 1985లో అంగరంగ వైభోగంగా జరుగుతోంది. స్టేట్ ప్రెసిడెంట్స్ పేర్లు, కొత్త నియామకాలు వేదికపైన శ్రీ ఇందులాల్ షా (ఆనాటి వరల్డ్ కౌన్సిల్ ఛైర్మన్‌గారు) చదవ నారంభించారు. ఆంధ్రప్రదేశ్ వచ్చేసరికి నా పేరు చెప్పారు. "నేనేనా? ఇంకెవరైనా నాపేరు గలవారు ఉన్నారా?" అని అనుకుంటూ అన్నిప్రక్కలా చూడటం నావంతు అయింది.

ఆ సాయంకాలం సాంస్కృతిక కార్యక్రమం జరుగుతుండగా స్వామి నన్ను దగ్గరకు రమ్మని పిలిచారు. **"ఏమి! స్టేట్ ప్రెసిడెంట్, అంగీకరించావా?"** అన్నారు. "అదేమి స్వామీ! మీ ఆజ్ఞ, తప్పక పాటిస్తాను" అన్నాను. భగవాన్ రెండు చేతులు చాచి దగ్గరకు చేర్చి అన్నారు, **"చూడు. ఇనుపసంకెళ్ళకంటె గట్టిగా నిన్ను కాపాడుతాను. అందరి సహకార ముంటుంది. భయపడకు. దిగ్విజయంగా కార్యక్రమాలు జరుపుతావు"** అన్నారు.

ఆ మాటే శ్రీరామరక్ష, జగద్రక్ష అయింది. అంతా వారే జరిపించారు. నాకు సైకిలు తప్ప వేరే వాహనం లేదు. ఆనాటికి టెలిఫోన్ కూడా లేదు. వృత్తిరీత్యా సామాన్య లెక్చరర్‌ని మాత్రమే. రాష్ట్రం అంతటా సుదీర్ఘ ప్రయాణం చెయ్యగలనా? వ్యయప్రయాసలు భరించ గలనా? అన్న సందేహాన్ని నా భార్యతో అన్నాను. "మనకు మరొక పిల్లవాడు కలిగితే పెంచి చదువు చెప్పిస్తాం కదా. అట్లే మన సంస్థలుకూడా భగవంతు డిచ్చిన బిడ్డగా భావించి అదే ప్రేమతో, శ్రద్ధతో చూసుకోండి" అన్నది.

బాబా తనతో ఇలా పలికించారనుకున్నాను. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో నేను వెళ్ళని గ్రామంకాని, టౌన్‌కాని, పట్టణంకాని ఆంధ్రదేశంలో లేదు. బాబా అన్నిరకాల ప్రయాణాలూ చేయించారు. కాలినడకన కొన్ని గ్రామాలు చేరాను. లారీలలో కొన్ని సందర్భాలలో ప్రయాణం చేసిన రోజులున్నాయి. బస్సులలో నిలబడి, రైళ్ళలో ఒంటికాలిపై, ట్రాక్టర్లు ... ఏమని చెప్పను?! అన్ని అనుభవాలు రుచిచూచాను. 1979 నుండి ప్రతి సంవత్సరం మూడు నాలుగు పర్యాయాలు స్వామి సమక్షంలో ప్రసంగించాను.

కర్నూలులో సత్యసాయి సేవా సంస్థల కార్యక్రమం జరిగింది. నన్ను ఆహ్వానించారు. ఆ రాత్రి ప్రయాణ మవ్వాలి. ఒకప్రక్క కుండపోత వర్షం. బస్సుస్టాండు అంతా జలమయం. బస్సులు రద్దు చేశారు. నేను వెంటనే నా అశక్తతను, నిస్సహాయతను తెలియపరుస్తూ వారికి టెలిగ్రాం పంపేను.

తెల్లవారిన తరువాత **"బయలుదేరు, వెళ్ళు"** అన్న అంతర్వాణి ప్రబలమైంది. "నేను చేరేసరికి సాయంత్ర మవుతుంది. సభ పూర్తవుతుంది. ఏం లాభం?" అని అనుకున్నాను. **"కాదు, కూడదు, వెళ్ళు, వెళ్ళు"** అంటున్న బాబా హెచ్చరిక అంతరాత్మ ప్రబోధంలో హోరెత్తిపోయింది.

బయలుదేరాను. కర్నూలు చేరేను. మంగళహారతి పూర్తి అయి ఇంటికి తరలివెళ్తున్నవారు నన్ను చూసి ఆశ్చర్యపోయారు. "రాలేనని టెలిగ్రాం ఇచ్చినాడు కదా! ఈయన ఇక్కడికి ఎలా వచ్చాడు? ఈయనేనా, బాబా ఈ రూపంలో వచ్చినారా?" అన్న సందేహం వారికి కలక్కపోలేదు. మొత్తానికి అందరూ సభామంటపానికి చేరుకున్నారు. నేను చెప్పదల్చుకున్న నాలుగు ముక్కలు చెప్పేసి, తిరుగు ప్రయాణంలో పర్తికి చేరుకున్నాను.

ఆరోజుల్లో ఉదయం 11 గంటలకు భజన ఉండేది. ఏలూరుకి చెందిన మాజేటి (ఇంటిపేరువరకు జ్ఞాపకముంది) నన్ను సరాసరి తీసికెళ్ళి వరండాలో కూర్చోబెట్టారు. స్వామి అందర్నీ పలకరించుకుంటూ వచ్చి నాముందు నిలబడ్డారు. **"ఏమి అనిల్! కర్నూలు మీటింగు ఎగవేద్దామనుకున్నావు. చూశావా! ఎలా లాగేనో! స్వామి కార్యక్రమాలు తప్పక జరిగి తీరుతాయి. ఎవరూ తప్పించుకోలేరు"** అన్నారు. నేను ఆశ్చర్యపోయాను.

పైగా మరోమాట అన్నారు, **"కర్నూలులో డా॥ కృష్ణారావు ఉన్నాడు. అతనే ఫస్టు సేవాదళ్. టార్చి పట్టుకుని నిలయంలో పహారా కాసేవాడు. పాపం! డిసప్పాయింటు కాదా?"**

స్వామికి తమ కార్యక్రమాలపైన ఉన్న పట్టుదల, కార్యకర్తలపై వారికి గల ప్రేమ కొంతవరకు నాకు అర్థమయింది.

ప్రకాశం జిల్లాలో గిద్దలూరు ఉన్నది. అప్పుడు డా॥ పి.సి.రంగారెడ్డిగారు జిల్లా అధ్యక్షులు. ఆ ఊళ్ళో ఒక కాలేజి, వివేకానంద కాలేజి అనుకుంటాను, సువిశాల స్థలంలో సమావేశం ఏర్పాటు చేశారు. సరే! నన్ను ఆహ్వానించారు. సరిగ్గా ఆరోజునే బస్సులు, రైళ్ళు బంద్ పాటించాయి. నాటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావును చట్టవిరుద్ధంగా తొలగించిన గవర్నరు నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. మరి నా ప్రయాణమెలా అనుకున్నాను.

ఆరోజు ఉదయం మా ఇంటికి గిద్దలూరు నుండి ఒక కార్యకర్త నన్ను వెంటబెట్టుకుని తీసుకెళ్ళటానికి వచ్చారు. స్వామి కార్యక్రమాలకు ఏనాడూ అడ్డుచెప్పని ఇంట్లోవారందరూ వెళ్ళవద్దని బ్రతిమాలారు. రైళ్ళు, బస్సులు రద్దయి అంత గందరగోళంగా ఉన్న పరిస్థితులలో ఎలా వెళ్తావు అని ప్రశ్నించారు. నన్ను తనతో తీసికెళ్ళటానికి వచ్చినాయన రెడీగా ఉన్నారు. "ఎలా వస్తాను సార్? ఏ రవాణా సదుపాయమూ లేదుకదా! నన్నొదిలేయండి" అన్నాను. అప్పుడాయన నాకు చేసిన ఆధ్యాత్మిక బెదిరింపు నేను మర్చిపోలేను. "స్వామి కార్యక్రమాలు కేన్సిల్ కావడానికి వీల్లేదు. మీరు నాతో వస్తున్నారు. మనం వెళ్తున్నాం, అంతే" అన్నారు. త్వరగా చిన్నసూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుని, ఇంట్లోవాళ్ళకి సర్దిచెప్పుకుని ఆయన్ని అనుసరించాను.

రైల్లో కూర్చున్నామేకాని అది ఎప్పుడు బయల్దేరుతుందో, అసలు గిద్దలూరు చేరుతుందో లేదో అంతా దైవాధీనంలాగా ఉంది. నత్తనడకలాగా సాగుతోంది రైలు. నాతో వచ్చిన సత్యంగారు ప్రతి స్టేషన్‌లో దిగి సమాచారం ఆరా తీస్తూ గిద్దలూరు వారికి తెలియచేస్తున్నారు. నాకేమో అంతా గందరగోళంగానే ఉంది. వినుకొండ చేరాం. స్టేషన్‌లో ప్రకటన వెలువడింది, సమ్మె విరమించారని. ఇంకేం! రైలు జోరు అందుకుంది. గిద్దలూరు చేరుకుంది. స్టేషన్‌కు పెద్దలు, భక్తులు చాలామంది వచ్చారు. ప్రకటించినట్లే సువిశాల ప్రాంగణంలో సభ జరిగింది.

అక్కడినుంచి పుట్టపర్తికి చేరేను. బాబావారు అన్నారు: **"సభ బాగా జరిగిందా? ఇన్విటేషన్‌లో పేరు**

వేశాక వెళ్ళకపోతే అక్కడ భక్తులు నిరాశపడిపోరా? మనవి ఆధ్యాత్మిక కార్యక్రమాలు. సమయానికి ఠంచన్‌గా జరగాల్సిందే. మన సంస్థలు ఆదర్శంగా ఉండాలి.” ఆశ్చర్యపోవడం నావంతయింది.

గిద్దలూరు అనేసరికి చాలాకాలం క్రితం జరిగిన సంఘటన జ్ఞాపకమొస్తోంది. ఆరోజుల్లో మచిలీపట్నం – పుట్టపర్తి బస్సు మాత్రమే ఉండేది. గుంటూరునుంచి పర్తి చేరటానికి సుమారు 17–19 గంటలు పట్టేది. మధ్యలో యథావిధిగా టైరు బరస్టు కావల్సిందే కదా! గిద్దలూరులో భోజన విరామం. బస్సు దిగి హడావుడిగా అటూ ఇటూ చూస్తూ ఒక హోటల్‌లో కూర్చుని సర్వర్‌ని అడిగాను, “ఏముంది? త్వరగా ఏం తెస్తావు” సర్వరు జవాబిచ్చాడు, “కోడిపలావు, బిర్యాని, ఆమ్లెట్.” “బాబోయ్! చచ్చాన్రా” అనుకున్నాను. కొద్దిగా ఊళ్ళోకి చేరి, ఎవరో ఇంట్లో పాతకాలం పూటకూళ్ళ పద్ధతిలో అన్నం పెడితే తిని బైటపడ్డాను. బస్సులో కూర్చున్నాక కిటికీలోంచి చూస్తే మొదట నేను వెళ్ళిన హోటలు బోర్డుపైన “మిలిటరీ హోటల్” అని రాసి ఉంది. నేను గమనించలేదన్నమాట.

దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. పూర్ణచంద్ర సభామండపంలో బాబావారి ప్రసంగ సమయానికి చేరుకుని కూర్చున్నాను. స్వామి ఒకమాట అన్నారు, **“అనిత్య అశాశ్వత ప్రాపంచిక జగత్తులో నీకు ఆనందం ఎక్కడ లభిస్తుంది? లోకంపైన ఒక బోర్డు రాసి ఉంది. దాన్ని నువ్వు గమనించడం లేదు. ‘అనిత్యం అసుఖం లోకమిమం ప్రాప్య భజస్వమాం.’ ఇక్కడ సుఖం లేదని స్పష్టంగా రాసి ఉన్నా ప్రవేశించాక సుఖం ఆశిస్తే ఏం ప్రయోజనం? మిలిటరీ హోటలు అన్న బోర్డు చూడకుండా లోపలికి వెళ్ళి ‘ఇడ్లీ, సాంబారు, ఉప్మా’ అంటే ఏం ప్రయోజనం?”**

అదీ సర్వాంతర్యామి సాయి అంటే!

విశాఖపట్నంలో ఏ.వి.యన్. కాలేజి ఉన్నది. దాంట్లో జి.వి. సుబ్రహ్మణ్యశర్మగారు సంస్కృత శాఖాధ్యక్షులుగా ఉండేవారు. సత్యసాయి సంస్థలలో చాలా చురుకుగా, ఉత్సాహంగా పాల్గొనేవారు.
3 భాగవతంపై వారి ప్రసంగాలు విని తీరవలసిందే. బాబావారిని శ్రీకృష్ణునితో పోలుస్తూ వారు పద్యాలు, శ్లోకాలు వివరిస్తుంటే చాలా ఆసక్తిజనకంగా ఉండేవి. వారు సాక్షాత్తు ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారి శిష్యులు, అంతేవాసి. నాకు ఆప్తమిత్రులు. ఒకసారి మరువరాని సంఘటన ఒకటి జరిగింది. ఇద్దరం కరీమ్‌నగర్ జిల్లాలోని సిరిసిల్ల సత్యసాయి సేవాసమితి కార్యక్రమంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఖాజీపేట రైలు స్టేషనుకు చేరి అక్కడినుంచి నర్సాపురం ఎక్స్‌ప్రెస్‌కాని, గోదావరి ఎక్స్‌ప్రెస్‌కాని పట్టుకుని ఎవరి దారిన వారు పోదామనుకున్నాము. మర్నాడు కాలేజికి వెళ్ళాలి కదా! ఖాజీపేటకు చేరుకున్నాం. ఈలోగా స్టేషను సూపరింటెండెంట్‌గారు బయటకు వచ్చి “అనిల్‌గారూ! మీ ప్రసంగానికి రాలేకపోయాను. డ్యూటీలో ఉన్నాను. కాస్త మాట్లాడుకుందాం రండి. కాఫీ తాగి పోదురుగాని” అన్నారు.

స్వామినిగురించి ముచ్చటిస్తుంటే మనకు టైమ్ సంగతే పట్టదుకదా! హుషారుగా కబుర్లు చెప్పుకున్నాం. ఈలోగా సూపరింటెండెంట్‌గారు, “బయల్దేరుదాం, రైలు వచ్చే టైమయింద”న్నారు. తీరా బైటికి వచ్చాక తేలిందేమంటే రైలు రావటమూ అయింది, పోవటమూ అయింది. సుబ్రహ్మణ్యశర్మగారు చాలా ఖంగారు పడిపోయారు. తెల్లవారితే కాలేజికి వెళ్ళాలి. ఎలా? ఇద్దరం మథనపడుతున్నాం. ఇంతలో సిగ్నల్ దాటిన రైలు వెనక్కి రావటం ప్రారంభించి ప్లాట్‌ఫామ్ చేరింది. ఇంకేం! త్వరత్వరగా రైలెక్కి మా ఊళ్ళకి ప్రయాణమయ్యాం. పండక్కి పుట్టపర్తి వెళ్తే బాబావారు, **“బుద్ధిలేదు నీకు. టైమ్‌కు ప్లాట్‌ఫామ్‌కి రావాలని తెలియదా? ఆరోజు రైలు మిస్సు అయ్యేవాడివి కదా”** అంటూ నవ్వేసారు. స్వామికి తెలియనిదేముంది?! స్వామి చేయలేనిదేమీ లేదని తెలిసింది బాగా.

ఒకసారి భలే అనుభవం ఎదురైంది. కరీమ్‌నగర్ మీటింగుకు వెళ్తే ఆదిలాబాద్ జిల్లావారు రామకృష్ణా పురానికి కూడా రమ్మన్నారు. అదేమోకాని కారు ప్రయాణానికి దారిపొడుగునా ఆటంకాలే! బాగా పొద్దుపోయింది. ఏవో కొన్ని అసాంఘిక శక్తులు

ఉన్నాయన్న సమాచారంవల్ల పోలీసువారు తనిఖీలు చేపట్టి ఆపటం, కార్లో మమ్మల్ని బాబావారి ఫోటో చూసి పంపటం జరిగింది. కాస్తంత భయపడ్డా. ఇంటికి చేరుకున్నా. పుట్టపర్తికి కొన్నాళ్ళ తరువాత చేరుకున్నాక బాబావారన్నారు, **"అర్ధరాత్రి ప్రయాణాలు వద్దన్నానుగా. చూడు ఎన్ని ఆటంకాలు ఎదురయ్యాయో."** స్వామికి నమస్కరించుకుని రక్షించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నాను.

శ్రీ సత్యసాయి సంస్థ రజతోత్సవాలు జరుపుకున్న రోజులవి. గుంటూరుజిల్లా అధ్యక్షులు శ్రీ కోవెలమూడి నారాయణరావుగారు ఏర్పాటుచేసిన వ్యానులో వారితోపాటు మా బృందం ప్రయాణం. ఇరుప్రక్కలా లౌడ్స్పీకర్లు, వ్యాను కిరుప్రక్కలా స్వామి సూక్తులు, హంగామాగా ఉంది. ఎన్ని ఊళ్ళు తిరిగామో లెక్కలేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు కార్యక్రమానికి వెళ్ళవలసి ఉన్నది. అదేమి ఖర్మమోకాని ఆరోజు బంద్. అన్ని రవాణాలూ నిలిపివేశారు. మనది సొంత వాహనం కనుక మొదటి మజిలీ బెజవాడ చేరుకున్నాం. ఇంక ఎవరూ ముందుకు కదలనివ్వటం లేదు.

వ్యానులో భజన క్యాసెట్లు వింటున్నాం. ఇవాళ బంద్ అని తెలిసి ప్రయాణమయ్యారెందుకని కొందరు ప్రశ్నించినవారున్నారు. బెజవాడ బెంజ్ సర్కిల్ దగ్గర ఆగవలసి వచ్చింది. జెండాలు పట్టుకున్న కార్యకర్తలు చుట్టుముట్టారు. ఒక్క అడుగుకూడా ముందుకు కదలనివ్వలేదు. మరికొంతమంది వీరకార్యకర్తలు భజనలు కూడా ఆపమన్నట్లు మాట్లాడారు. ఏం చేస్తాం? లోపల భజన చేస్తూ కూర్చున్నాం. ఈలోగా ఒక స్థూలకాయుడు పెద్ద మోటారు సైకిలుపై చాలా పెద్ద జెండా దానికి కట్టి మావైపు వచ్చాడు. కాస్త గట్టిగానే మాట్లాడాడు. అతను వీరందరికీ లీడర్ అని అర్థమయింది. ఆయన వ్యానులోకి తొంగి చూసి బాబావారి ఫోటో చూసి అన్నారు, "మీరు వెళ్ళవచ్చు. మిమ్మల్ని ఎవరూ ఆపరు. నేను ఇక్కడే ఉంటాను. వ్యాను స్టార్టు చేయండి" అని. సాఫీగా సాగింది ప్రయాణం.

ఆటంకాలవల్ల ఆలస్యంగా పాలకొల్లు చేరాం. ఇంటిముఖం పట్టినవారు వ్యాను చూసి భజనలు విని మా రాకను గమనించి తిరిగి సభామండపానికి చేరేరు. ఏరకమైన అల్పాహారాలూ సేవించకుండా నేరుగా వేదికనెక్కి ప్రసంగించాను. మధ్యలో ఎవరో ఒక చీటీ పంపించారు, "అయ్యా! ఈ రాత్రికి ఇక్కడే పెళ్ళి జరుపుకోవాలి. మీరు దయయుంచి సమాప్తం చేస్తే మంచిది." నేను ఆ చీటీలో వాక్యాల్ని పెద్దగా మైకులో చదివాను. భక్తుల్లో ఒకరు లేచి గోదావరి యాసలో "ఏటండీ! ఆపేదేటి! పెళ్ళి బాగా జరగాలంటే బాబా గారి ఆశీస్సులుండాలి కదండీ! మీరు చెప్పండి. ఏర్పాట్లు చేసుకోవచ్చు. దాంట్లో ఏముందీ" అన్నారు. నాకు ఆశ్చర్యమేసింది, నవ్వొచ్చింది. వారి భక్తికి మనసులో నమస్కరించాను. గోదావరి సమానమే ఆ జిల్లాలవారి భక్తి, సందేహం లేదనిపించింది. ప్రయాణం సాగినట్లు ఉపన్యాసం నిరాటంకంగా కొనసాగింది.

ప్రతి శని, ఆదివారాలు, సెలవు దినాలు నా ప్రయాణాలతో 20 సం॥ల పాటు నిండిపోయాయి. **ఒకప్రక్క కాలేజి, ట్యుటోరియల్ కాలేజిలో పాఠాలు చెప్పటం, వేరొకప్రక్క ప్రయాణాల ప్రణాళికలు, ఉపన్యాసాల కసరత్తులు సమాంతరంగా సాగాయి. స్వామి తల్చుకుంటే ఎలాంటివాడిచేతనైనా ఎలాంటి పనైనా చేయించగలరనటానికి ఇదే సాక్ష్యం.**

ఈ నేపథ్యంలో ఒకసారి వింతైన సంఘటన జరిగింది. తెలంగాణా ప్రాంతంలో పర్యటించి సభలలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ట్రైను మిస్ అయ్యాను. కాలేజికి బాగా ఆలస్యమౌతుంది, తప్పదు. చెయ్యగలిగే దేమీలేదు. స్టేషనునుండి సరాసరి కాలేజికి భయం భయంగా వెళ్ళేను. అందులో ఫస్టు పీరియడ్ నా క్లాసు. తీరా వెళ్ళేసరికి కాలేజీ గేటు వేసి ఉంది. వాచ్మన్ను అడిగాను, "ఎందుకు అంతా ఖాళీగా ఉంద"ని. "సార్! ఈరోజు మన కాలేజి పిల్లలు అంతర్ కళాశాల క్రికెట్ పోటీలో ఫస్టు వచ్చారండీ, అందుకని సెలవు ఇచ్చారు" అన్నాడాయన. బ్రతుకు జీవుడా అనుకున్నాను. ఇలాగే అన్ని పోటీల్లో గెలుస్తూ నా కార్యక్రమాలకు అడ్డు

రాకుండా ఉండాలని మనసారా స్వామిని ప్రార్థించాను. ఇలాగే మరోసారి ఒక లెక్చరర్ వివాహ సందర్భంగా ఇచ్చిన సెలవు కారణంగా ఆలస్యంగా చేరిన నాకు ఉద్యోగం నిలబడింది. బ్రహ్మచారులు ఒకరి తరువాత మరొకరు పెళ్ళిళ్ళు చేసుకుంటూ సెలవులిప్పిస్తే నా కార్యక్రమాలు ఎంచక్కా బాగుంటాయే అనిపించింది.

మనం ఒక్కొక్కసారి అమాయకత్వంవల్లనో, మాయ కమ్మటంవల్లనో అంతా మనమే చేస్తున్నాం అనుకుంటాం. మనం చేసేది ఇంకెవరివలనకూడా సాధ్యం కాదనుకుంటాం. మన తెలివితేటలకి మనమే పొంగిపోతుంటాము. మానవమాత్రులం సామాన్యులం కదా. సహజమే మరి! పైగా మనం లేనిదే ఏదీ జరగదనుకుంటాం. ఇది అజ్ఞానానికి పరాకాష్ఠ. నిజానికి మనం లేకపోతేనే ఇంకా బాగా జరుగుతాయి ఏవైనా. మనం ఎవరినీ రానీయకనో, అడ్డుగా నిలవటంచేతనో అందరికీ అవకాశాలు అందటంలేదు. సంగతి సందర్భం వస్తే ఎవరైనా ఏదైనా చెయ్యగలరు. బాబావారు సంకల్పిస్తే పూచికపుల్లకూడా సమర్థవంతంగా కార్యాన్ని నెరవేర్చగలదు.

ఒకసారి ఏమైందంటే పొన్నకల్లు అనే గ్రామంలో శ్రీ సత్యసాయి సేవాసమితి వార్షికోత్సవానికి నన్ను ఆహ్వానించారు. సరేనన్నాను. కానీ అదే రోజున ప్రశాంతి నిలయంలో రాష్ట్ర అధ్యక్షుల మీటింగుకు వెళ్ళవలసివచ్చింది. పొన్నకల్లువారు ఏమనుకుంటారో అని బాధపడుతూనే ఉన్నాను. తీరా తిరిగి వచ్చాక తెలిసింది. ఆహ్వాన పత్రికలో పేర్లు లేకపోయినా, ఆంధ్రదేశంలో హేమాహేమీలైన ముగ్గురు మహా పండితులు ఆ సభలో పాల్గొన్నారట – వారే కరుణశ్రీ, మాధవరామశర్మగారు, అమరేంద్రగారు.

స్వామి కార్యక్రమం ఏదీ ఆగదు. అదృష్టాన్ని అవకాశాన్ని మనం జారవిడుచుకోవటం తప్పించి ఎక్కడా లోపం ఉండదు. మనకంటే సమర్థులు, మన తాతలవంటి ఉద్దండులు స్వామి సేవకై సిద్ధంగా ఉన్నారన్నది మనం మరువకూడని సత్యం.

ఇదే పొన్నకల్లులో మరో విశేషం జరిగింది. చాలా కాలం క్రితం వార్షికోత్సవానికి వెళ్ళాను. గ్రామాలలో సమావేశాలు సాయంత్రం 7 గం॥ దాటాక ఉంటాయి. పొలం పనులు పూర్తిచేసుకుని రావాలికదా! ప్రసంగం మధ్యలో ఒక మోతుబరి రైతు, స్థూలకాయుడు, లేచి నిలబడి, "బాబా ప్రచారానికి వచ్చావా?" అన్నాడు. "అవునండీ. మా సాయిభక్తులం జరుపుకుంటున్న వార్షికోత్సవం. మీరు కోప్పడితే ఎలా?" అన్నాను. ఆనాటి సభాధ్యక్షులు గుంటూరుజిల్లా సాయి సంస్థల అధ్యక్షులు శ్రీ బొలిశెట్టి సీతారామయ్యగారు. వింతయేమంటే తరువాతి సంవత్సరాలలో మంచి కార్యక్రమాలు జరుపుకొనే సంస్థగా రూపొందింది. మరీ ఒక సంవత్సరమైతే కార్యకర్తలు గ్రూపు ఫోటో తీయించుకుంటే అందులో బాబావారు సింహాసనంపై కూర్చున్నట్లుకూడా పడింది. ఈరోజు అక్కడ చక్కని మందిరంకూడా ఉంది.

'దోనెపూడి' అని మరో గ్రామముంది. ప్రసంగం ముగిసేసరికి కాలాతీతమైంది. లాస్టు బస్సు కూడా వెళ్ళిపోయిందన్నారు. గుళ్ళో పడుకుని తెల్లవారి ఫస్టు బస్సులో బయలుదేరి గుంటూరు చేరాను. "తుళ్ళూరు" గ్రామ సభ అనంతరం రాత్రి బస్సులు లేవన్నారు. ఏదో ట్రాక్టరు వెళ్తుంటే దాన్ని పట్టుకుని గుంటూరు చేరేను.

చాలాకాలం క్రిందట రాజమండ్రిలో బాలవికాస్ సమావేశాలకు వెళ్ళేను. అర్ధరాత్రికాని రైళ్ళు లేవన్నారు. ఒక లారీ పట్టుకుని ఏలూరు దాకా వచ్చి అక్కడ్నించి మరో లారీలో బెజవాడ చేరి అక్కడ్నించి ఆర్టీసీ బస్సులో గుంటూరు చేరేను. స్వామి కార్యానికి అన్ని వాహనాలూ ఉపయోగపడినవి. స్వామి మాట నెరవేర్చాలి కదా! 1980 దసరాలలో ప్రసంగం అనంతరం మందిరం మేడమీదకి పిలిచి పట్టువస్త్రాలు, సఫారీ సూటు, శాలువా ఇచ్చి వారి రెండు చేతులూ నా శిరస్సుపై నుంచి, **"దీర్ఘాయుష్మంతుడవై గుణవంతుడవై ఆంధ్రదేశమంతటా స్వామి సందేశం ప్రచారం చేయి"** అన్న ఆశీర్వచనం వృథా అవుతుందా! శ్రమ తెలుస్తుందా! విసుగు, విరామం ఉంటాయా! సాయి శక్తి అజేయం, నిరుపమానం, అనితర సాధ్యం.

(సశేషం)

శ్రీ సత్యసాయి గేయ సుధ

డా॥ రాళ్లపల్లి వసంత లక్ష్మి

స్వామి సందేశం సత్య శివ సుందరాత్మకం. స్వామి స్వీయ గేయ రచనలలోని సంగీత సాహిత్య సందేశముల సమ్యగ్ మేళన సంవిధానములో ఈ త్రిమూర్త్యాత్మక తత్త్వం శ్రోతలకు అనుభవైక వేద్యం. నాదబ్రహ్మమయులైన శ్రీ సాయి సారస్వత సుధా స్రవంతిలో ప్రతి గేయం ఒక జ్ఞాన సుధా తరంగం, ప్రతి బోధ ఒక రసమయ రాజీవం. ఈ లఘు వ్యాసము సందేశ గేయావళి రేఖామాత్ర పరిచయానికే పరిమితం.

శ్రీ సాయి సంగీత ఝురిలో జానపద, లలిత, శాస్త్రీయ సంగీత రీతులు, సమయానికి తగు మాటలాడు చందముగా, తత్త్వములు, గీతములు, కీర్తనలు మొదలైన విధముగా ప్రక్రియా వైవిధ్యముతో జనబాహుళ్య హితముగా, విశ్వశ్రేయోదాయకముగా శోభిల్లుచున్నవి.

స్వామి తమ మృదుమధురమైన కంఠముతో, శ్రావ్యముగా ఆలపిస్తుంటే, ఆనంద పారవశ్యములో ఓలలాడే శ్రోతలకు అది ఒక దివ్యానందానుభూతి.

సంగీతం సందేశాత్మకంగా ఉండాలి. సంగీతం ఆధ్యాత్మిక మేళవింపుతో పరిమళించాలి. సాయి సారస్వత ఆశుగేయధార పండిత, పామరులను పునీతులను గావించే పవిత్ర గంగా తరంగ. జగన్నాటక సూత్రధారి 'బాలసత్యం'గా దివ్య లీలాకాండకు పుట్టపర్తి గ్రామాన్ని రంగస్థలముగా ఎంచుకున్నారు. పల్లె ప్రజలతో కలసిమెలసి మసలుతూ, వారితో సన్నిహితంగా మెలగుతూ, వారి భావాలలో, నడవడిలో పరివర్తనకొరకు పూనుకున్నారు. తదనుగుణంగా తన పాత్రను రూప కల్పన చేసుకొని, అందరినీ ఆకట్టుకునే విధముగా గేయ ప్రక్రియను సంస్కరణాసాధనముగా స్వీకరించారు. మాటకంటె పాట సూటిగా మనస్సులో నాటుకుంటుంది. సంగీతం, సాహిత్యంయొక్క సాహచర్యమువలన సాయి గేయ ప్రక్రియ ఒక మహత్తరమైన శక్తిగల ప్రబోధ మాధ్యమంగా ఆబాల గోపాలమును ప్రభావితం చేయగలగడం జగమెరిగిన సత్యం. ఇటు జీవిత సత్యాలను బోధించాలన్నా, అటు పారమార్థిక అంశాలను ఆవిష్కరించాలన్నా, స్వామి ఉపన్యాస ధోరణిని మాత్రమే అనుసరించక సరళమైన సంగీతపు కూర్పుతో, సామాన్య జనులకు సులభ గ్రాహ్యమయ్యే పదజాలముతో గేయరూపముగా అందించారు. లాలిత్యం, ఆర్ద్రత, తాదాత్మ్యత ముప్పేటగా భక్తులను మైమరపించి మననానందాన్ని, మహదానందాన్ని అందించిన సాయి సందేశ గేయావళి సారాంశం ఒక దివ్య రసాయనం.

'రామ నన్ను బ్రోవరా!' అంటూ వచనముగా ప్రార్థించడంకంటే హరికాంభోజి రాగములో, రూపక తాళములో లయాత్మకంగా త్యాగరాజ కృతిని గానం చేస్తే భక్తిభావం ద్విగుణీకృతమవుతుంది.

చిన్నారి పాపకు జిలిబిలి జాబిల్లి పాటలతో గోరు ముద్దలను తినిపించే మాతృమూర్తివలె సాయిమాత తన బిడ్డలకు సాధనా విధానాలను, మానవ జీవిత పరమార్థమునూ, సాయి అవతార తత్త్వమునూ తేటతేట పదాలతో పాటల రూపంగా అందించి, సంస్కరించి, సన్మార్గములో ప్రవేశింపజేసి మురిసిపోయింది.

స్వామి గేయములు కొన్ని తత్త్వముల బాణిలో గానము చేయదగినవి, మరికొన్ని జానపద సంగీత రీతులలో పాడదగినవి, లలిత సంగీత మాధుర్యమును సంతరించుకొనినవి కొన్ని, శాస్త్రీయ సంగీత సంప్రదాయమునకే వన్నెబెట్టునవి కొన్ని.

వైవిధ్యోపేతమైన సాయి సంగీత వైభవము విస్మయావహము. తరచి, తరచి ఆస్వాదించుకొలది చవులూరు మధుమయ భాండము.

మానవునిలోని మానవీయ గుణములను జాగృతం గావించే ప్రబోధ:

"సత్య ధర్మము శాంతి ప్రేమలతో
నీ నిత్యజీవన యాత్ర సాగించు..."

ఈ గేయం తత్త్వముల బాణిలో స్వామి అందించారు. 'మానవ జీవిత పరమార్థం - బ్రహ్మానందానుభవం' అని ఈ గేయ సారం.

భగవదనుగ్రహముచేతనే జన్మ ధన్యము కాగలదనే సత్యాన్ని ప్రకటించే గేయం, 'దయచేత ధన్యులు కావలెరా.' సామూహికంగా గానం చేయదగిన సరళమైన సంగీత కూర్పుతో బాబా అందించారు. భావపుష్టి, గానతుష్టి కలిగి భక్తిని పటిష్ఠపరచే గేయమిది.

'సాయి సాయి సాయిరామ' అనే గేయములో -

'పుణ్యకార్యములు చేయకున్ననూ
పాపములను తలపెట్టకండీ
పాపములన్నింటికంటె మించినది
పరులను నిందించేదండీ'

అంటూ బోధించారు. కాలాంతరమున దీనినే చక్కని ఆంగ్లసూక్తిగా - 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' - అందించారు.

నామ మహిమను పల్లెవాసులకు తగిన సంప్రదాయ బాణిలో అందించారు.

ఎంత మంచి తీపి, మీరంతా సేవింపుడీ
రాతిని బల్పుప్రీతిని ధర నాతిగను చేసిన
సీతాధినాథుడైన శ్రీరామచంద్రు నామ
॥మెంత॥

మరియు

రామ నామమను ప్రసాదమిదిగో,
రండి భక్తులారా!
భూమిలో దొరికే మిఠాయిలు కొని తిని
పామరులై చెడిపోవకురండీ
॥రామ॥

....

దూరము పోయీ కొన పనిలేదిక
పుట్టపర్తి పురములో కొల్లగ దొరకును
॥రామ॥

ఈవిధముగా 'సాయి' గేయ ప్రక్రియ సాధనంగా బోధన గావించారు.

సాయి సునాద నందనోద్యానమున విరిసిన గేయ పరిమళ పుష్పాలెన్నో! భృంగములమై ఆ ప్రబోధ మకరందమును ఆస్వాదింతుముగాక! ❋

నామస్మరణ త్రికరణ శుద్ధితో గావించాలి

నామతత్త్వము చాలా పవిత్రమైనది, దివ్యమైనది. భగవన్నామంతో విషము కూడా అమృతముగా మారిపోతుంది. ఇందుకు ప్రత్యక్షసాక్షి మీరా! విషమయమైన పాలు త్రాగుతూ "కృష్ణా!" అని నామమును స్మరించింది. ఆ పాలు అమృతమయంగా మారిపోయాయి! నామస్మరణ త్రికరణశుద్ధితో గావించాలి. మనసుతో చింతించి మాటతో ఉచ్చరించి చేతులతో లయబద్ధంగా తాళం వేయాలి. మనస్సు, వాక్కు, కాయం - ఈ మూడింటి ఏకత్వమే త్రికరణశుద్ధి. కేవలం భావరాగ తాళములను చూసుకోవటం మాత్రమే కాకుండా హృదయమందు భగవత్తత్త్వాన్ని గురించి విచారించాలి. గాయకుడు నారద తుంబురుల వంటివాడైనా నాదశుద్ధిలేక గానంలో మాధుర్యమేర్పడదు. మాధుర్యం అందించటమే కాదు, గానం మానవత్వాన్ని దైవత్వంగా మార్చగలగాలి.

- బాబా

“నేను దేహమును కాను, దేహిని”

గరిమెళ్ళ కృష్ణమూర్తి

అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు తమ నిజతత్త్వమునుగురించి ఎఱుక పరుస్తూ తాను భౌతికమైన ‘దేహము’ కాదని, అంతరాత్మయైన ‘దేహి’నని పలుమార్లు ఉద్ఘాటించారు. అంతేకాకుండా తమవలె మనమందరముకూడా కేవలం భౌతికస్వరూపులము మాత్రమే కాక, సాక్షాత్తు ‘దివ్యాత్మస్వరూపులమ’ని తెలుసుకోవాలని ఉద్బోధించారు. సుమారు అర్ధ శతాబ్దమునకుపైగా సాగిన ఈ దివ్యోపన్యాస పరంపరలో ఇంచుమించుగా ప్రతి ఒక్క దివ్యోపన్యాసములోనూ ఈవిషయమును ప్రస్తావిస్తూ మనలను ‘దివ్యాత్మస్వరూపులారా’ అని సంబోధిస్తూ వచ్చారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య జీవితము మరియు బోధలను మనము నిశితంగా గమనిస్తే స్వామి ఈవిధంగా తమ నిజ తత్త్వమును వెల్లడించడమే కాకుండా, మనందరి గురించిన ఈ దివ్య సత్యమును మనము గ్రహించాలని తరచు మనల్ని ఉద్బోధించారు. క్షణ భంగురమైన మానవుని జీవితంలో భౌతిక దేహము ప్రతి క్షణము మార్పుచెందుతూ, క్షీణిస్తూ, చివరకు నశించిపోయే విషయంగురించి అత్యంత సహజ సుందర శైలిలో చక్కటి తెలుగు భాషలో పద్యరూపంగా వర్ణించారు. భగవాన్ బాబా తమ దివ్యోపన్యాసాలలో తరచుగా చెప్పే రెండు పద్యాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం సమంజసంగా ఉంటుంది:

దేహము పాంచభౌతికము
దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు, గణుతింపగ
దేహికి చావు పుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు
నిజంబు చూడ యా
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ
ఆత్మరూపుడౌ!

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు
సేవక గంప జాత సం
చలనము పొందు దుంప భవసాగర
మీదగలేని కంప అం
బుల పొదిలెమ్ము చూడ మనమెచ్చు
దలంప దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా!
హరిపాదము లాశ్రయింపవే!

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అవతార చరిత్రలో ముఖ్యంగా 2003వ సంవత్సరం విశేషమైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను సంతరించుకున్నది. ఆ సంవత్సరంలో ప్రత్యేకంగా స్వామి తాను ‘దేహి’ని, ‘దేహము’ కాదన్న విషయాన్ని గురించి తమ దివ్యోపన్యాసములలో విశేషంగా ప్రస్తావించడమే కాకుండా అందుకు గొప్ప నిదర్శనమునుకూడా చూపారు. ఆ సంవత్సరం వేసవిలో బృందావనంలో వారు తుంటి ఎముక విరిగి భరించలేని శారీరక వేదనను అనుభవించారు. ఆ ఎముక మూడు ముక్కలుగా విరిగిపోయింది. డాక్టర్లు పెద్ద శస్త్ర చికిత్స చేశారు. అంతేకాక, ఆ ఎముకను కలిపి ఉంచే ‘బాల్’ కూడా రెండు ముక్కలైపోయింది. సుమారు రెండు గంటలకుపైగా కొనసాగిన ఈ శస్త్ర చికిత్సలో స్వామి తనకేమీ కానట్లుగాను, అదంతా ఎవరికో జరుగుతున్నట్లుగాను ప్రేక్షక పాత్ర వహించారు.

ఆపరేషన్ అయిన తరువాత కూడా తమను సందర్శించ వచ్చే భక్తులకు దర్శనం ప్రసాదిస్తూ,

విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, ఆశ్రమంలోనూ బయటా నిర్వర్తింపవలసిన కార్యక్రమాల గురించి తగు సూచనలిస్తూ యథావిధిగా తమ దైనందిన కార్యక్రమాలను నిర్వహించారు. ఒక్కసారికూడా తాము అనుభవిస్తున్న భయంకరమైన శారీరక వేదనను సూచనామాత్రంగానైనా బయటకు వ్యక్తము చేయలేదు. అంతేకాక, కొద్ది రోజుల తరువాత జరిగిన ఒక వైద్య సదస్సులో పాల్గొని తమ దివ్యోపన్యాసం చేశారు. ఆ దివ్యోపన్యాసంలో ఈ సంఘటనద్వారా తాము మానవజాతికి చూపించ దలచుకున్న ఆదర్శమును, అందించదలచుకున్న ఆధ్యాత్మిక సందేశమును వివరించారు. ఈసందర్భంలోనూ, ఆ తరువాత స్వామి తమ దివ్యోపన్యాసములలో వెల్లడించిన 'దేహి - దేహ' తత్త్వములనుగురించి కొంత వివరంగా తెలుసుకో వలసిన అవసరం ఉన్నది:

వాతపిత్తశ్లేష్మాదులను సరియైన స్థితిలో ఉంచుకొని, ఆత్మాభిమానమును పోషించు కున్నప్పుడే మానవుడు ఆరోగ్యవంతునిగా రూపొందగలడు. కాని, మానవుడు ఆత్మ తత్త్వమును విస్మరించి దేహాభిమానమును పెంచుకుంటున్నాడు. నిరంతరము దేహమును గురించే ఆలోచిస్తున్నాడు. అందువల్లనే, అనారోగ్యమునకు గురి అవుతున్నాడు.

మీకు తెలుసు - స్వామియొక్క 'హిప్' (తుంటి) మూడు తుండ్లైపోయింది. 'హిప్' దగ్గర ఉండే 'బాల్' కూడా రెండు తుండ్లైపోయింది. దీనివలన కలిగే బాధ ఎంత తీవ్రమైనదో వర్ణించడానికి వీలుకాదు. కదలడానికి, మెదలడానికి వీలుకాదు. ఒక 'షాకు' మాదిరి కొడుతుంటాది. కాని, నేను లెక్కచేయలేదు. 'దేహాభిమానమును దూరము చేసుకొని ఆత్మాభిమానమును అభివృద్ధి పరచుకోండి,' అని మీకు బోధించే నిమిత్తమై నేనిన్ని అవస్థలకు గురి అయ్యాను. ***ఈ దేహము నేను కాదు.*** *మీరు కూడా దేహాభిమానమును దూరం చేసుకున్నప్పుడు నిరంతరము సుఖశాంతులను అనుభవించ గలరు.*

దేహాభిమానమును అరికట్టుకోవడమే ఆధ్యాత్మిక సాధనలో ప్రథమ సోపానము. ఆత్మాభిమానమును పెంచుకున్నప్పుడు దేహాభిమానము సహజంగానే తరిగిపోతుంది. ఎవరైనా సరే, దేహమును ధరించిన తరువాత కొన్ని బాధలను అనుభవించక తప్పదు. దేహం క్షణంలో పుడుతుంది, క్షణంలో పోతుంది. కనుక, క్రమక్రమేణ దేహాభిమానమును తగ్గించుకోవాలి.

(దివ్యోపన్యాసములు 5.7.2003 మరియు 13.7.2003 నుండి)

మీరు దేహాన్ని ధరించారేగాని, దేహ తత్త్వమును మీరు ఏమాత్రము అర్థం చేసుకోవడం లేదు. గుణములతోకూడిన పాంచభౌతికమైన దేహము మీరు కాదు. 'ఇది నా శిరస్సు, ఇది నా హస్తము, ఇది నా గుండె', అని అంటుంటారు కదా! మరి 'నేనెవరు?' అని ప్రశ్నించుకోండి. ఈ ప్రశ్న వేసుకుంటే శిరస్సు, హస్తము, గుండె మొదలైన అంగములన్నీ మీకంటే వేరుగా ఉన్నాయని స్పష్టమౌతుంది. అంగములతో కూడినది దేహము. మీరు దేహస్వరూపులు కారు. దేహములోని ప్రతి అంగములోను భగవంతుడు రసస్వరూపుడై సంచరిస్తున్నాడు. కనుకనే, భగవంతుణ్ణి 'అంగీరసాయ నమః' అని స్తుతిస్తున్నారు. రసస్వరూపుడైన పరమాత్మను ఒక ఆకారానికి పరిమితం చేయడం అజ్ఞానం. భౌతికమైన ఆకారము మార్పుచెందునటువంటిదే! కానీ, నీలోని ఆత్మతత్త్వం ఏనాటికీ మార్పు చెందదు.

మీరు దైవాన్ని ఆత్మస్వరూపునిగా భావించండిగాని, ఆకారస్వరూపునిగా భావించకండి. దేహాభిమానమును ప్రక్కకు నెట్టండి. ఆత్మస్థాయిని మీరు విశ్వసించండి. ఆధ్యాత్మికతను అభివృద్ధిపరచుకున్నప్పుడే మీకు ఆత్మస్వరూపము అర్థమవుతుంది.

మీరు దేహము కాదు. మీరు నేనే! ఆ నిజమైన 'నేను'ను ఆధారం చేసుకోండి. ఆకారము మార్పు చెందుతుందికానీ, 'నేను' మార్పు చెందదు.

(దివ్యోపన్యాసము 5.10.2003)

ఆత్మతత్త్వమనగా ఏమిటి? మన శరీరములోని అంగములన్నీ పనిచేయటానికి ఏది ఆధారమో అదే ఆత్మతత్త్వము.

నీవు దేహాన్ని దృష్టిలో పెట్టుకొని 'నేను' అనే పదాన్ని ఉచ్చరిస్తున్నావు. కానీ, నిజానికి దేహము 'నేను' కాదు. అనంతమైన ఆత్మ తత్త్వమే 'నేను'. అదియే నీయందున్న చైతన్యము. ఆ చైతన్యమే లేక నీవు లేవు. అట్టి చైతన్యమును గుర్తించడమే ఎఱుక (అవేర్‌నెస్).

మారనటువంటి ఆత్మతత్త్వాన్ని మీరు కోరుకోవాలి. మార్పుచెందే రూపాన్ని కోరుకుంటే మోసమైపోతుంది. ఆత్మకు చావు, పుట్టుకలు లేవు. అట్టి నిత్య సత్యమైన ఆత్మ తత్త్వాన్ని మనం కోరుకోవాలి.

(దివ్యోపన్యాసము 28.10.2003)

భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు. సర్వులూ భగవత్స్వరూపులే! భగవంతునికి ఆది లేదు, అంత్యమూ లేదు. అయితే, పామరులైన మానవులలో విశ్వాసమును పెంపొందించే నిమిత్తం తాను దేహమును ధరిస్తుంటాడు. పుట్టుట ఉంటే గిట్టుట కూడా ఉంటుంది కదా! భగవంతునికి పుట్టుట, గిట్టుట రెండూ లేవు. కాని, భక్తులు దేహమును మాత్రమే దృష్టిలో పెట్టుకొని వేర్వేరు పేర్లతో భగవంతుని వర్ణిస్తూ ఆరాధన చేస్తున్నారు.

దేహము కనిపించడమే జననం, కనిపించకుండా పోవడమే మరణం. రెండూ భగవత్సంకల్పములే!

భగవంతుడున్నాడని కొందరు, లేడని కొందరు వాదోపవాదములలో ప్రవేశించి కాలహరణం గావిస్తున్నారు. భగవంతుడు **ఉన్నాడు**. ఎప్పటికీ ఉన్నాడు. పోవడం, రావడం అనేది లేదు. మానవుడు జననమరణములనుండి విముక్తి పొందవలె నంటే దేహాభిమానమును త్యజించి దైవానికి తన హృదయమును అర్పితం గావించాలి.

సాధన అనగా జప, తప, ధ్యానాదులను ఆచరించడం కాదు. దేహమే నేనను భావమును వదలిపెట్టాలి. అది చాలా సులభం. జనన మరణములకు మీ భ్రాంతులే మూలకారణం. కాబట్టి, ఈ భ్రాంతులను వదలుకోవడానికి ప్రయత్నించండి.

'నేనే దైవం' అని దృఢంగా విశ్వసించండి. మీరే దైవమైపోతారు. ఈ దేహము మీరు కాదు, ఇది మీరు ధరించిన వస్త్రము. దీనిని ఏనాడైనా విడిచిపెట్టక తప్పదు.

ఈనాటి మానవుడు తనయందే ఉన్న దివ్యత్వముకోసం బయట వెతుకుతున్నాడు. తన యందే ఉన్నాడు భగవంతుడు. తానే భగవంతుడై ఉన్నాడు. కాని, మానవుడు తనలోపల వెతకటం లేదు; బయట వెతుకుతున్నాడు. భగవంతునికోసం బయట వెతికితే ప్రయోజనం లేదు. మీ దృష్టిని అంతర్ముఖం చేసుకోండి.

(దివ్యోపన్యాసము 25.12.2003)

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది భక్తులు, సాయి సేవకులు 'భగవాన్' మరియు 'స్వామి' అని భక్తి, ప్రేమ, వినయపూర్వకంగా పిలుచుకునే భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ దివ్య సంకల్పముచే తామే స్వయంగా నడిపిన దివ్య లీలానాటకమునకు అనుగుణంగా ఈ సంవత్సరం మార్చి – ఏప్రిల్ నెలల్లో సుమారు ఒక నెలపాటు పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 'చికిత్స' కొరకు చేరి, చివరగా, 24.4.2011వ తేదీన తమ అవతార పరిసమాప్తికి సూచనగా భౌతిక కాయమును విడిచి పెట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రకటన చేస్తూ వస్తున్నట్లుగా తాము 'దేహి' అని, 'దేహము'ను కాదని మరొక్కమారు నిరూపణ చేశారు.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నేడు భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ మానవాళికి వారు అందించిన ఆధ్యాత్మిక సంపద మరియు వారి అవతార కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటుంది, ఉండాలికూడా! వారి మహాభినిష్క్రమణం తరువాతకూడా సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలద్వారా మానవజాతియొక్క సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక ఉద్ధరణ అనే కార్యక్రమం కొనసాగుతుంది. అంతేకాక, వారి అవతార కార్యక్రమంలో చక్కని పనిముట్లయిన భక్తులు, సాయి సేవకులకు తమ దివ్యస్ఫూర్తిని, మార్గదర్శకత్వమును అందజేస్తూనే ఉంటారు. 'మానవసేవయే మాధవసేవ' అనే భగవాన్ బాబావారి ఆదర్శమును వారి భక్తులు, సేవకులు తరతరాలకు తమ జీవిత లక్ష్యంగా పెట్టుకుంటారు. దీనిని ఏవిధంగా ఒక ప్రేమపూర్వక సాధనగా చేపట్టి నిర్వహించాలనే విషయముపై భగవాన్ తామే స్వయంగా కొన్ని సందర్భాలలో వివరించారు:

మీలో ప్రతి ఒక్కరూ ఈ అవతార కార్యక్రమంలో పాలుపంచుకునే సమయం ఆసన్నమైంది. మీ జీవిత లక్ష్యం కూడా నెరవేరే సమయం వచ్చింది.

మానవజాతి మొత్తం ప్రేమ, సామరస్యములతో జీవించే సమయం తొందరలోనే రాబోతున్నది. అందుకొరకు మీరందరూ సర్వసన్నద్ధంగా ఉండాలి. మీలో ప్రతి ఒక్కరూ మీ మౌన సాధన కొనసాగిస్తూ మీమీ కర్తవ్యములను నెరవేరుస్తున్నప్పుడు మిమ్మల్ని దగ్గరకు తీసికొని నా హృదయానికి హత్తుకుంటాను. ఈవిధంగా మీరు చేయటంవల్ల మీ ఆత్మోద్ధరణ జరిగి మీలో అంతర్యామిగా ఉన్న నా రూపము మీ నేత్రములలో ప్రతిఫలిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది సాయి భక్తులలో ప్రతి ఒక్కరూ తమ తమ గృహములు మరియు సమాజములో ఎదురయ్యే అనేక సందర్భములలో స్వామి చూపిన వెలుగుబాటలో పయనిస్తూ ఆదర్శవంతమైన జీవితమును గడపాలి. ఇది స్వామి ప్రపంచానికి అందించిన శంఖారావము. భగవాన్ బాబావారి అవతార కార్యక్రమాన్ని ముందుకు తీసికొని పోవటానికి మనలో ప్రతి ఒక్కరం మనవంతు కృషి చేద్దాం! మన జీవితాలను తద్వారా ధన్యము చేసుకుందాం. భావితరాలవారికి స్వామియొక్క ఆధ్యాత్మిక సంపదను మనద్వారా అందజేద్దాం. కదలి రండి! భగవాన్ అవతార కార్యక్రమంలో పాలుపంచుకోండి!

ఒకప్పుడు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ దివ్య జీవితముద్వారా మానవాళికి "నా జీవితమే నా సందేశము" అని సందేశమునిచ్చారు. ఈనాడు మనందరము భగవాన్ దివ్య జీవితము మరియు బోధల కనుగుణముగా నడుచుకుంటూ ఇతరులకు ఆదర్శప్రాయంగా జీవిస్తూ వారి అవతార కార్యక్రమాన్ని వ్యాప్తిగావించే కృషిలో పాలుపంచుకుంటూ "మన జీవితాలే స్వామి సందేశము" అని ప్రపంచానికి నిరూపించుదాం!

జైసాయిరాం! ❊

4

మహోన్నత 'మానవ' ఆదర్శం

"సాయిదాసు"

శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీసత్యసాయి భగవానులు ఈ భువిపై అవతరించి, ఆదర్శ "మానవులు"గా మనుగడ సాగించి, **"పరిపూర్ణ మానవుడు"** అంటే ఎలా ఉండాలో తమ జీవితాలద్వారా ప్రపంచానికి ఉత్తమాదర్శములను నెలకొల్పిన మహావతారులు!

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ అవతార ఆవిర్భావకాలమునుండి వారు భౌతిక ఉపాధితో ఉన్నంత కాలము – వారి వ్యక్తిత్వంలో **మహోన్నత మానవత్వము, పరమోన్నత ప్రేమతత్త్వము, పరిపూర్ణ దివ్యత్వము** అనే మూడు మూర్తిత్వములు కలగలసి ఒకదానితో మరొకటి విడదీయరానంతగా పెనవేసుకొనిపోయి ఉండినవి. అయితే, భగవాన్ బాబావారు "ఉత్తమ మానవుడు"గా తమ జీవితంద్వారా మానవాళికి అందించిన ఆదర్శ మానవీయ విలువలు, గుణశీలములు, మాననీయములు, సదా స్మరణీయములు. భగవానుల జీవితచరిత్రనుండి గుబాళించిన అట్టి "మానవత్వపు" సుమసౌరభాలు కొన్నింటిని ప్రస్తుతము మనము ఆఘ్రాణించి, ఆనందించుదముగాక!

❋ ❋ అన్నవస్త్రాదులకై అలమటిస్తూ, ఇల్లిల్లూ తిరుగుతూ యాచించే నిస్సహాయ నిరుపేద భిక్షకులు – తమ ఇంటి వాకిట్లో నిలచి ఆర్తితో పిలువగానే, తన వంతు అన్నవస్త్రాలను వారికందించి ఆనందించటం – తడబడు అడుగుల బుడిబుడి నడకల చిరుప్రాయంనుండే బాల 'సత్య'కు బహు సహజ నైజం! **దిక్కులేనివారగు దీనులపట్ల జాలి, కరుణ, ఆదరణ, నిర్వ్యాజమైన ప్రేమ** – ఆ చిన్నారి ప్రేమమూర్తికి అతి సహజమైన **'మానవత్వ' స్వభావాలు!**

❋ ❋ పక్షులు, జంతువులను చంపి 'మాంస భక్షణ' చేయటంవలన అటు 'జీవహింస', ఇటు తమ శరీరాల్లో జంతు స్వభావాన్ని పెంచిపోషించుకోవటం అనే రెండు 'అమానవీయ' చర్యలకు పాల్పడినట్లవుతుందనీ; భగవంతుడు ఇతర జీవులను మీకు ఆహారంగా కావటం కోసం సృష్టించలేదనీ; తన కుటుంబ సభ్యులకు, పరిసర గ్రామాల ప్రజలకు ఏకకాలంలో ఎరుకపరచేవారు – చిన్నారి 'సత్య'! **'జీవహింస'ను నిరసించి, ప్రతిఘటించి**, కోడి పందాలు, ఎడ్ల పందాలు పేరిట జీవులను హింసించే అమానుష ప్రవృత్తిని విడనాడునట్లు ఆ చిన్ననాడే తన బోధలద్వారా తోటి మిత్రులను, వారి తల్లిదండ్రులను సంస్కరించారు సాక్షాత్ **"అహింస, జీవకారుణ్యము"**లు రూపుదాల్చిన బాల 'సత్య'.

❋ ❋ కుటుంబంలో ఇతర సభ్యులందరూ ఎంపిక చేసుకోగా మిగిలిన వస్త్రాలనూ, వస్తువులనూ తీసుకొని, సంతృప్తి చెందే స్వభావంద్వారా **కోరికలకు, ఇష్టానిష్టములకు అతీతమైన "విరాగిత్వము"**ను తన ప్రవర్తనద్వారా ప్రకటితము గావించిన అపురూప బాలుడు, 'సత్య'!

❋ ❋ తోటి పిల్లలకు భజనలు, ప్రార్థనలు, శ్లోకాలు నేర్పి, వారితో **"పండరీ భజన మండలి"** నేర్పరచి, వారిచే పుట్టపర్తి, మరియు, చుట్టుప్రక్కల గ్రామాలలో సామూహిక భజనలు నిర్వహింపచేయటంద్వారా బాలలలో, పెద్దలలో **"దైవ ప్రీతి"**ని పెంపొందించిన **"బిడ్డల గురువు"**, 'సత్య'!

❋ ❋ సంఘంలో దుర్నీతి, దురభ్యాసాలతో, విలాసాల్లో మునిగితేలుతున్నవారు – కరణం నారాయణరావువంటి పెద్దవారైనాసరే – వారికి తన పదకవితలద్వారా బుద్ధిచెప్పి, కనువిప్పు కలిగించి, సంస్కరించి, వారిలో **"పాపభీతి"**ని పెంపొందించిన **"బాల సంఘ సంస్కర్త"** 'సత్య'!

❋ ❋ పైకి నీతులు చెప్తూ, నిజ జీవితాలలో అందుకు విరుద్ధంగా ప్రవర్తించే పెద్దలకు కనువిప్పు కలిగిస్తూ, తాను

వ్రాసిన **"చెప్పినట్లు చేస్తారా?"** వంటి నాటికలద్వారా **"సంఘనీతి"** విలువను సమాజంలోని జనబాహుళ్యానికి చాటిచెప్పిన బాల **"నాటక ప్రయోక్త"** 'సత్య'!

❁ ❁ ఋష్యేంద్రమణికి బదులుగా స్త్రీ రూపంలో నృత్యం చేసిన 'రాజు'ను ప్రశంసిస్తూ భుజం తట్టబోయిన ఆంగ్లేయ ప్రభుత్వాధికారికి– స్త్రీమూర్తిని (నట పాత్రగానైనా సరే) పరాయి పురుషుడు తాకరాదన్న భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని చాటిచెప్పిన ఆదర్శ **"భారత రత్న"** బాల'సత్య'!

❁ ❁ ఉరవకొండలో అన్నగారి పిల్లలు ఉప్పుకషాయం వంటి బావినీటిని త్రాగటం చూచి భరించలేక, అన్న కుటుంబంతోపాటుగా, పొరుగునున్న మరి రెండు కుటుంబాలవారి దాహార్తిని తీర్చటంకోసం, 2 కి.మీ దూరంలోని మంచినీటి బావినుండి రోజూ 6సార్లు కావిడితో నీళ్ళు మోసి, మోసి, భుజాలు కాయలు కాచినా లెక్కచేయని కరుణామూర్తి బాల'సత్య'! ఆ కారుణ్యమే తరువాతి కాలంలో అనంతపురం, మెదక్, మహబూబ్ నగర్, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలకూ, చెన్నై నగరానికీ త్రాగునీటినందించి, కోట్లాది జనుల దాహార్తి తీర్చిన **"అపార కారుణ్య జలపాతము"**గా ఎగసి పడింది.

❁ ❁ పాఠశాలలో సహాధ్యాయులు, ఊరిలో తన సమకాలికులు, అగు బాల్య స్నేహితుల చదువు సంధ్యలను సంస్కరించి, చక్కదిద్దిన **"బాల బ్రహ్మజ్ఞాని"** 'సత్య'. అట్టి బాల్యస్నేహితులలో అనేకులను జీవితాంతం ఆదరించి, వారి కుటుంబాల యోగక్షేమాలు కనిపెట్టుకొని, కంటికి రెప్పలా కాపాడి, వారి కుటుంబాలలో వివాహాలు, వైద్య చికిత్సలు, ఇత్యాది బాధ్యతలను స్వయంగా నిర్వర్తించిన **ఆదర్శ స్నేహితుడు, ఆప్తమిత్రుడు** సత్యనారాయణ 'రాజు'!

❁ ❁ **"అణకువ, వినయ విధేయతలు గల విద్యార్థి"**గా చదువులలో ప్రథముడిగావుండే సత్యనారాయణ 'రాజు', తనను గౌరవంతో అభిమానించిన అధ్యాపకులను; అకారణంగా శిక్షించిన ఉపాధ్యాయులను, సర్వులనూ సమదృష్టితో గౌరవించిన **"ఆదర్శ విద్యార్థి"**!

❁ ❁ క్లాస్‌లీడర్‌గా ('మానిటర్') తరగతిలో తప్పులు చేసిన తోటి విద్యార్థులను దండించటానికి సంకోచించే 'రాజు'యొక్క సున్నిత మనస్సునకు కోపించిన ఉపాధ్యాయుడు, ఆ దండనను మరింత కఠినంగా 'రాజు'కే విధించగా, సంతోషంగా భరించిన **"సహనశీలి"** 'రాజు'!

❁ ❁ అన్నింటా **"ఆదర్శ విద్యార్థి"**గా అధ్యాపకుల అభిమానానికి పాత్రుడౌతున్నాడన్న అసూయతో సాటి విద్యార్థులు కొందరు తన చొక్కాచింపి, తనను చిత్రావతి ఇసుకలో పడేసి, బట్టలు మాసిపోయేలా ఈడ్చుకువెళ్ళినా, కించిత్తయినా కోపగించక, నోరువిప్పి ఎవ్వరికీ చెప్పక, ఎవ్వరికీ ఫిర్యాదుచేయక మౌనంగా భరించిన 'రాజు' **మంచితనం, ఓర్పు, క్షమాగుణం**, అనుపమానం.

❁ ❁ జిల్లా అధికారియైన 'తెల్లదొర' తన వినోదం కోసం ఒక పులిని వేటాడి, తుపాకితో 'షూట్'చేసి చంపి, దాని కళేబరాన్ని తీసుకొనివెళ్తున్న జీపు చిత్రావతిలో ఆగిపోగా, సహాయంకోసం వచ్చిన ఆ అధికారిని **"జీవహింస మహాపాపం"** అనీ; 'షూట్' చేయదలిస్తే కెమేరాతో 'షూట్'చేసి (ఫోటో తీసి) ఆనందించాలే తప్ప, తుపాకితో మాత్రం 'షూట్' చేయవద్దనీ మందలించి, ఆతని మనస్సును మార్చిన బాల శ్రీ సత్యసాయిబాబా సాక్షాత్తు మూర్తీభవించిన **"జీవకారుణ్యం"**! తల్లిలేక అల్లాడుతున్న ఆ పులి పిల్లలను జంతు సంరక్షణాలయానికి అప్పగింపజేసిన బాల సత్యసాయి **కారుణ్య, వాత్సల్యాలు** సాటిలేనివి.

స్వయంగా అనేక కుక్కలను, జింకలను, పక్షులను పెంచి, పోషించి, ప్రేమించిన **"జీవకారుణ్య మూర్తి"** భగవాన్! జాక్ అండ్ జిల్, 'కుట్టాన్' వంటి శునకములు బాబావారి అపార ప్రేమకు పాత్రములై, స్వామి పాదాలవద్దనే ప్రాణాలు వదలి, శాశ్వతంగా పరమాత్మలో లీనమైపోయిన ధన్య 'జీవులు'!

నెలల పిల్లగా స్వామి సన్నిధిచేరి, వారి వాత్సల్యం తనవితీరా అనుభవించి, చివరకు స్వామి సన్నిధిలోనే తనువు చాలించిన 'గజ కుమారి' ''సాయిగీత''తో సాయిమాత ప్రేమానుబంధం అపురూపమైనది.

❁ ❁ అంటరానివారిగా 'సమాజం' దూరంగా పెట్టిన హరిజనుల వాడలకు, వారి ఇండ్లకు వెళ్ళి, సర్వమానవ సమానత్వ భావముతో వారిని ఆదరించి, ఉద్ధరించిన ఆదర్శ ప్రగతిశీల **"ఆధ్యాత్మిక సామ్యవాది"** 'బాబా'! మడీ

ఆచారాలు పాటించే కరణం సుబ్బమ్మగారు సైతం తన ఆచారాలన్నీ ప్రక్కనపెట్టి, భగవానులతోపాటే తానుకూడా 'గంగప్ప' అనే హరిజనుని ఇంటికివెళ్ళి, స్వామితోపాటుగా భోజనం చేయునట్లు ఆమెను ప్రభావితురాలిని చేసి, ఆమెలో **"కులమతాలకతీతమైన సమత్వభావన"**ను కలిగించిన **"ప్రేమమూర్తి"** బాల 'సత్యసాయి'!

❀ ❀ తన జీవితాంతం అహోరాత్రాలు స్వామి సేవలకే అంకితమై, స్వామి సేవలలోనే జీవితం చాలించిన 'అభినవ యశోద' 'కరణం సుబ్బమ్మ' స్మృత్యర్థం 'కరణం సుబ్బమ్మ నగర్' పేరిట 60 ఇండ్లతో ఒక కాలనీ కట్టించి, పేదలు, సమాజంలో వెనుకబడిన వర్గాలవారికి బహూకరించిన **"నిండు కృతజ్ఞత"**కు నిలువెత్తు దర్పణం భగవాన్!

❀ ❀ తనకు దేహాన్నిచ్చిన తల్లిదండ్రుల (గృహం అమ్మాయి-గృహం అబ్బాయిల) స్మృతిచిహ్నాలుగా ఈశ్వరమ్మ పాఠశాల, పెద్ద వెంకమరాజు కళ్యాణ మండపాలను నిర్మింపజేసి **"మాతాపితరులకు శాశ్వత గౌరవం"** కల్పించిన **"ఆదర్శ పుత్రులు"** భగవాన్ బాబా! మాతృమూర్తి ఈశ్వరాంబకు పిల్లలపైగల ప్రేమకు గుర్తుగా ఆమె పుణ్యవర్ధంతి దినమైన మే 6వ తేదీన ప్రతి సంవత్సరం ఈశ్వరాంబా సంస్మరణోత్సవంగా జరుపుతూ, బాలవికాస్ పిల్లల ఉత్సవ దినంగా ఆమె స్మృతిని శాశ్వతం గావించారు ఈశ్వరాంబా సుతులు! గ్రామీణ మహిళలకు అనేక స్వయం ఉపాధి పథకాలు నిర్వహించి, వారిని శక్తిమంతురాండ్రను గావించు లక్ష్యముతో సాయీశ్వరులు నెలకొల్పిన మహిళా సంక్షేమ ట్రస్టుకుకూడా **'ఈశ్వరమ్మ విమెన్స్ వెల్ఫేర్ ట్రస్ట్'**గా నామకరణంచేశారు భగవాన్!

❀ ❀ బాబావారు తమ **"మాతృమూర్తికి ఒసగిన మూడు వరాలు"** - బహుళార్థ సాధకములగు **ఆదర్శ విద్య, వైద్య, జల స్రవంతుల బృహత్ పథకాలు**గా ప్రపంచమే ఆశ్చర్యపడేలా పరిణమింపజేసి, లక్షలాది ప్రజలకు లబ్ధి చేకూర్చిన **అనర్ఘ పుత్రరత్నం** - రత్నాకర కులతిలకులు!

❀ ❀ **"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ"** అని రామావతారంలో తాము నిరూపించిన ఆదర్శాన్నే ప్రస్తుత అవతారంలోకూడా నిరూపిస్తూ, మాతృమూర్తి కోరికను మన్నించి, జన్మభూమిని వీడక, తాము పుట్టినగడ్డయైన 'పుట్టపర్తి'నే తమ అవతారోద్యమానికి శాశ్వత క్షేత్రముగా చేసుకొని, ఆ పుణ్యస్థలిని ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా, శక్తిస్థలిగా అనుగ్రహించిన ఆదర్శ **"భూమి పుత్రులు" (సన్ ఆఫ్ ది సాయిల్)** ఈశ్వరాంబాసుత శ్రీ పుట్టపర్తీశులు!

❀ ❀ **"సేవకులకు సత్కార, కృతజ్ఞతా ప్రకటనలు"** తమకు, తమ సంస్థలకు, తమ పేరిట సంఘానికీ, సేవలు అందిస్తున్న వివిధ వ్యక్తులకు అభినందనాపూర్వక ఆత్మీయ సత్కారములు జరిపించటంద్వారా భగవాన్ బాబావారు **"కృతజ్ఞత కనీస మానవ ధర్మము"** అను ఆదర్శమును ప్రపంచానికి చాటారు. అట్టి వ్యక్తులు, ప్రశాంతినిలయంలో వివిధ సంస్థలలో పనిచేసే సామాన్య కర్మచారులగు పనివారలు, సేవకులు కావచ్చు; యూనివర్సిటీ వైస్-ఛాన్సెలర్లు కావచ్చు; సాయిసంస్థల పెద్దలు కావచ్చు; సాయి పథకాల నిర్మాణ పర్యవేక్షకులు కావచ్చు; నిర్మాణ పనుల్లో పాల్గొన్న మేస్త్రీలు కావచ్చు; చిరకాల భక్తులు కావచ్చు; అందరూ స్వామి ఆనంద సత్కారాలకు అర్హులే! 2005లో భీమరథశాంతి మహోత్సవాలు జరిపి 70 ఏళ్ళుపైబడ్డ భక్తసేవక దంపతుల జంటలను ఆశీర్వదించారు భగవాన్!

❀ ❀ దిక్కులేని దీనులగు 60 మందికి పైగా అనాథ పిల్లలను చేరదీసి, **"దీనజనోద్ధరణ"** అనే పథకం క్రింద వారి ఆరోగ్య, సంక్షేమ, విద్యాబుద్ధుల బాధ్యతలను పూర్తిగా వహిస్తూ, వారి ఒక్కొక్కరి పేరిట ఒక లక్ష రూపాయలను బ్యాంకులో డిపాజిట్చేసి, వారి జీవితాలకు వెలుగుదారి చూపి, వారిని ఆదర్శ బాలలుగా తీర్చిదిద్దారు భగవాన్!

❀ ❀ ఐదారు తరాలుగా వేలాది భక్త కుటుంబాలకు తామే పెద్ద దిక్కై, వారిని ఆధ్యాత్మ, సేవా సాధనలలో ప్రోత్సహిస్తూ, విశాలమైన విశ్వకుటుంబాన్ని నెలకొల్పారు, భగవాన్! వ్యక్తిస్థాయిలో మానవ హృదయాల్లోనూ, ప్రపంచ స్థాయిలో దేశదేశాల ప్రజాపాలకుల హృదయాలలోనూ, **"దైవ పితృత్వము - మానవ సహోదరత్వము"** అనే ఆదర్శమును, **"వసుధైక కుటుంబకము"** అను విశాల భావననూ, ఆవిష్కరించిన మహోన్నత ఆదర్శ **"మానవతామూర్తి", "విశ్వరూపి"**, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు! ❊

స్వామి సంకల్ప మాహాత్మ్యం

శ్రీమతి అంజలీదేవి

ఒక్క సంవత్సరం ఇంకా గడవలేదు. కానీ, యుగాలు గడిచిన అనుభూతి. స్వామి మనదగ్గరే, మనతోటే, మన కంటా ఇంటా వెంటా ఉన్నారని తెలుసు. జనన మరణాలకి అతీతులు స్వామి. నాక్షత్రమానం ప్రకారం వారు చెప్పిన మాట తు.చ. తప్పకుండా నిలబెట్టుకున్నారు స్వామి. మనని ఇంగ్లీషు కేలండర్ మాయలో ముంచి 'అంతిమవార్తకి' సిద్ధం చేసి మరీ శరీరాన్ని త్యజించారు. ఆ సమ్మోహన రూపం ఇక కనబడదు అనుకున్న క్షణాన్నే మహా దుఃఖపు కెరటం ఉవ్వెత్తున మనసులో లేచి సమూలంగా నన్ను ముంచివేసింది.

కానీ, 'మిమ్మల్ని ఒంటరిగా ఎలా వదలిపెడతాను బంగారూ?' అన్న పలుకులు ఆ మనసులోంచే వినిపించాయి. దాదాపు ఐదు దశాబ్దాలపాటు వారిని మనసా వాచా కర్మణా సేవించుకునే అవకాశం నాకు ఇచ్చారు. ఒక్కసారి వెనుదిరిగి చూసుకుంటే, ఎన్నెన్ని లీలలు! ఎన్నెన్ని మహిమలు! ఎన్నెన్ని అపూర్వమైన అనుభూతులు! నిన్నో మొన్నో జరిగినంత తాజాగా ఉన్నాయి. స్వామి కళ్ళముందు కదులుతున్నట్లే ఉన్నారు.

నేను చాలా క్లిష్ట సమస్యలతో మనశ్శాంతి కోల్పోయిన క్షణాల్లో నాగయ్యగారు అంటే చిత్తూరు నాగయ్యగారు నన్నూ మావారు శ్రీ ఆది నారాయణరావుగార్నీ స్వామి సన్నిధికి తీసుకు వెళ్ళి పరిచయం చేశారు. "నేనున్నాగా" అని స్వామి మాకు అభయం ఇచ్చారు. పెనుగాలికి మబ్బులన్నీ తొలగిపోయినట్లు మా కష్టాలన్నీ స్వామి దయతో తొలగిపోయాయి. 'పోయిన' వనుకున్నవన్నీ స్వామి కటాక్షంతో పోయినచోటే దొరికాయి.

"స్వామి మనకి ఇంత ఉపకారం చేశారు కదా! మరి మనం స్వామికి ఎలా కృతజ్ఞతలు చూపించాలి?" అని నేనూ మావారూ తపనపడి, మా ఇంటి ప్రక్కనే ఉన్న మందిరాన్ని స్వామికి సమర్పిద్దామనే నిర్ణయానికి వచ్చాము.

స్వామి ఎప్పుడు మద్రాసు వచ్చినా వారు విశ్రాంతిగా భక్తులతో గడపగలిగేంత విశాలమైన చోటు అప్పటికి లేదు. మా ఇంటి ప్రక్కన కట్టించిన మందిరం అయితే ఆ లోటు తీర్చగలదని మాకు అనిపించింది.

వెంటనే స్వామి దగ్గరకు వెళ్ళి మా కోర్కెని విన్నవించాం. "మీకు చేసినదానికి ప్రతిఫలంగా ఇస్తున్నారా?" అంటూ స్వామి మా ప్రార్థనని తిరస్కరించారు. ఎనిమిది నెలలపాటు ఇలా తిరస్కరిస్తూనే ఉన్నారు.

మళ్ళీ ఓసారి స్వామి మద్రాసుకు వచ్చారని తెలిసి, వారు బస చేసినచోటుకు వెళ్ళి 'మా ఇంటికి వచ్చి మమ్మల్ని అనుగ్రహించ'మని ప్రార్థించాం. స్వామి రాగానే, మా ఇంటి ప్రక్కన కట్టిన మందిరాన్ని స్వామికి చూపించి, 'స్వామీ, ఈ మందిరాన్ని స్వీకరించండి' అంటూ నేనూ మావారూ స్వామి పాదాలపై పడ్డాం.

అప్పుడు స్వామి మమ్మల్ని లేవనెత్తి, "సరే బంగారూ, మీ ఆనందమే నా ఆనందం. బొంబాయిలో సత్యం, హైదరాబాదులో శివం, ఇది సుందరం" అని చిరునవ్వుతో నామకరణం చేశారు.

కుల్వంత్‌హాలుగానీ, పూర్ణచంద్ర ఆడిటోరియం గానీ, ప్రైమరీ స్కూలు భవనంగానీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌గానీ అన్నిటికీ ఎవరైతే కట్టించారో వారి పేర్లే పెట్టి, వారి ఛాయాచిత్రాల్ని అక్కడ పెట్టారేగానీ స్వామి

ఏనాడూ తన పేరు పెట్టలేదు. అంటే స్వామి దేనినీ తన స్వంత ఆస్తిగా భావించలేదు. “ఇవి అందరివీ బంగారూ” అనేవారు స్వామి. ఎవరినించీ స్వామి ఏదీ ఆశించలేదు, ఒక్క నిస్వార్థ ప్రేమను తప్ప. “మీ ఆనందమే నా ఆహారం” అంటూ అపారమైన తమ ప్రేమను జీవితాంతం ప్రజలకు పంచుతూనే ఉన్నారు.

ఈ మధ్య వస్తున్న నీలాపనిందల్ని వింటుంటే నాకు బాధ కలుగుతోంది. స్వామికి తెలిసింది ఒక్కటే, తనదైన సమస్తమూ ప్రజలకు ఇవ్వడం.

ఈరోజు చెన్నైలో ప్రజలు కడుపారా దాహం తీర్చుకుంటున్నారంటే, అది స్వామి చలవే. నీరు ఇచ్చింది స్వామే. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా లక్షలాది ప్రజల దాహార్తి తీర్చారు.

ఏ ప్రభుత్వం ప్రజలకు ఇంత సేవ చేసింది? స్వామి తప్ప ప్రజల గోడు పట్టించుకున్న నాథుడెవరు? విద్య, వైద్యం, మంచినీరూ సర్వం ఉచితమే!

అదీ ప్రచారం లేకుండా! పది రూపాయలు దానం చేసి పాతిక పేపర్లలోనూ, ఛానల్స్‌లోనూ ప్రచారం చేసుకునేవాళ్ళున్న ఈ కాలంలో ప్రచారానికి దూరంగా, ప్రజలకి దగ్గరగా ఉన్న మన స్వామి సాక్షాత్తు భగవంతుడు కాదా?!

లోకంలో ఎన్నో మతాలూ, ఎన్నెన్నో కులాలూ మరెన్నో ఆధ్యాత్మిక సిద్ధాంతాలూ ఉన్నాయి. ఏ మతంయొక్క విధివిధానాలు ఆ మతానివే. ఏ దేశపు సంస్కారమూ సంస్కృతీ ఆ దేశానిదే.

కానీ, ఒక్క విషయం చెప్పి తీరాలి. నదులన్నీ సముద్రంలో కలిసినట్లుగా, ఒక్క పుట్టపర్తి సాయినాథుని సమక్షంలోనే అన్ని మతాలూ ఒకే గొడుగు కింద, ఒకే స్వామి ముందు మోకరిల్లాయి.

మన మిత్రదేశాలవారే కాక శత్రుదేశాల ప్రజలూ స్వామిని కలియుగ అవతారమూర్తిగా కొలుస్తున్నా రన్నది కాదనలేని వాస్తవం. ‘నడిచే దేవుడు’గా మన స్వామిని తమ గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నారన్నది పరమ సత్యం.

‘నా జీవితమే నా సందేశం’ అన్న స్వామి చేతల్లో చూపించబట్టే ఈ అద్భుతం జరిగిందిగానీ, ప్రచారాల వల్ల కాదు. ఈ రోజు బాబావారు ప్రవేశపెట్టిన విద్యావిధానం నూట ఇరవై ఆరు దేశాల్లో అమలు చేస్తున్నారంటే స్వామియొక్క అనంతత్వం అవగత మవుతుంది. స్వామి విశాలతత్త్వం అర్థమవుతుంది.

సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ అనే నాలుగు స్థంబాలతో స్వామి విశ్వమానవ భవనం నిర్మించారు. ఆచంద్రతారార్కమూ ఆ అహింసామూర్తియొక్క నిర్మాణం నిలిచే ఉంటుంది. నిలబెట్టడానికి స్వామి విద్యార్థులూ, భక్తులూ ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారు, ఉంటారు.

స్వామివారి మహిమల్ని గురించి చెప్పాలంటే ఒక జీవిత కాలం చాలదు. ఒకే ఒక్క వ్యక్తి – ఇంతటి వ్యవస్థని నెలకొల్పడం ఆయన మహిమకి ప్రత్యక్ష తార్కాణం.

బెంగళూరులో నివాసముంటున్న జితేంద్ర, కుసుమ నాకూ నా కుటుంబానికీ చిరపరిచితులు. ఇద్దరూ స్వామి భక్తులే. వారికి ఒక పాప పుట్టింది. ఆ పాప ఎంతో అందంగా ఉన్నా నెల తిరగకముందే అనారోగ్యం పాలైంది. మద్రాసు అపోలో హాస్పిటల్స్‌లో ఆ పాపకి రెండు మూడు నెలలు వైద్యం చేయించారు. కానీ, ఏమాత్రం స్వస్థత చేకూరలేదు. శరీరంలో ఎడమవైపు ఉన్న అవయవాలన్నీ చచ్చుపడిపోయినై. ఆ పాప హాస్పిటల్లో ఉండగా నేనూ రెండు మూడు సార్లు వెళ్ళి చూసి వచ్చాను.

డాక్టర్లు తమ నిస్సహాయతని వ్యక్తం చేశారు. అప్పుడు జితేంద్ర, కుసుమా ఇద్దరూ నావద్దకు వచ్చి, “అమ్మా, మానవ ప్రయత్నం అయిపోయినట్టే. ఒక్క దేవుడు మాత్రమే రక్షించగలడు. దయచేసి స్వామికి మా విషయం మీరు విన్నవించగలరా?” అని కోరారు.

పుట్టపర్తిలో కనుక్కుంటే స్వామి బెంగళూరు వైట్‌ఫీల్డులో ఉన్నట్లు తెలిసింది. వారిని, అంటే జితేంద్ర కుసుమ దంపతుల్ని వెంట తీసుకుని వైట్‌ఫీల్డుకి వెళ్ళాను.

స్వామికి పాప పరిస్థితి వివరిస్తే శివరాత్రికి ఆ పాపని పర్తికి తీసుకురమ్మని చెప్పారు. మేం వెళ్ళింది ఫిబ్రవరిలో. శివరాత్రి మార్చి నెలలో వస్తుంది.

ఎడమచెయ్యి, కాలూ ఏమాత్రం కదపలేని ఆ మూడు నెలల పాపని ఎలా తీసుకెళ్ళడం అని ఆ దంపతులు మథనపడుతూ నాతో చెబితే, “స్వామి తీసుకు రమ్మన్నారు గనుక, పాపకి ఏ ప్రమాదమూ జరుగదు. తప్పక శక్తి వస్తుంది” అని వారికి ధైర్యం చెప్పాను.

శివరాత్రి రోజు ఉదయం పాపని ఒళ్ళో పెట్టుకొని కుసుమ కూర్చుని ఉంది. స్వామి కుల్వంత్ హాలుకి వచ్చారు. సరాసరి పాప దగ్గరికి వచ్చి ఆశీర్వాద మిస్తున్నట్లు చేయి ఎత్తారు. ఆ పవిత్ర హస్తం నుంచి విభూతి వర్షం కురిసినట్లు జలజలా పాప ఒంటిమీద రాలుతూనే ఉంది. ఒళ్ళంతా విభూతితో నిండిపోయింది. ఈ సంఘటన నా కళ్ళముందే జరిగింది. అంతేగాదు, కొన్ని లక్షలమంది సమక్షంలో జరిగింది. తల్చుకుంటే ఇప్పటికీ నా ఒళ్ళు గగుర్పొడుస్తుంది. పాప ఒంటిమీద విభూతి వర్షింపజేసి, ఆశీర్వాదమిచ్చి పాప ఒంటిని స్పృశించి స్వామి దర్శన కార్యక్రమం ముగించి వెళ్లిపోయారు.

ప్రసాదాలు తీసుకుని అందరూ బయలుదేరినట్లే కుసుమ కూడా పాపని ఎత్తుకుని నిలబడింది. పాపని భుజాన వేసుకోగానే పాప ఎడం చెయ్యిలో కదలిక... ఒక్క రోజులో మొత్తం శరీరం ఆరోగ్యకరంగా మారి, ఎడమవైపు అవయవాలన్నీ సక్రమంగా పనిచేయడం మొదలుపెట్టాయి. ఈ మహిమకి నేను ప్రత్యక్ష సాక్షిని. ఆ పాపకి ఇప్పుడు పదేళ్ళు. పేరు సృష్టి. గలగలా మాట్లాడుతూ ఉంటుంది. స్పష్టమైన స్వరంతో బాబా భజనలూ, కీర్తనలూ పాడుతుంటుంది.

స్వామి 2006లో మద్రాసు వచ్చినప్పుడు జితేంద్ర, కుసుమ ఆ పాపని స్వామిదగ్గరికి తీసుకు వస్తే స్వామి ఆ పాపని పలుకరించి, దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యాల్ని ప్రసాదించారు. ఇలా ఎన్నెన్నో మహిమలు నా కళ్ళ ఎదురుగా చూశాను.

స్వామి కేన్సర్‌ని కేన్సిల్ చేసిన ఇద్దరు వ్యక్తులు నాకు వ్యక్తిగతంగా తెలుసు. నా జీవితంలోనే ఎన్నో ఘట్టాలు! స్వామి అనంతశక్తి స్వరూపులు. అందుకే అన్ని మతాలవారికీ ఆరాధ్యులయ్యారు. విశ్వానికే పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. స్వామి సంకల్ప శక్తి అమోఘమూ, అపూర్వమూ. అందుకే వారు సంకల్పించిన సేవాకార్యక్రమాలు నిరంతరంగా సాగేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు.

ఒక్క మనవి... స్వామి భక్తులకూ, పాఠకులకీ కూడా. జీవితమంతా మనకోసమే వెచ్చించి, మన సౌభాగ్యాన్నే కోరి, మనని సవ్యమార్గంలో నడిపించిన స్వామి ‘ఇక లేరు’ అని మాత్రం ఏనాడూ భావించవద్దు.

స్వామి ఉన్నారు. అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ మనలోనే ఉన్నారు, మనతోనే ఉంటారు.

స్వామి నెలకొల్పిన సేవాదళం తరతరాలూ లోక సౌభాగ్యాన్ని కోరి సేవలు అందిస్తూనే ఉంటుంది.

మనందరం మరింత అప్రమత్తులమై, మరింత శ్రద్ధతో, భక్తితో స్వామి సంకల్పించిన విశ్వశాంతి, విశ్వప్రేమల కొరకై అవిశ్రాంతంగా కృషి చెయ్యాలనీ, స్వామి బోధనలనీ, స్వామి లక్ష్యాలనీ రాబోయే తరాలవారికి సంపూర్ణంగా అందించాలనీ, స్వామి అమృతవాక్కులను మనందరం అనునిత్యం స్మరణలో ఉంచుకొని దేశ ప్రగతికై పాటుపడాలనీ, ఆ మార్గంలో స్వామి మనని నడిపించాలనీ మనఃస్ఫూర్తిగా స్వామిని కోరుకుందాం.

మరో మనవి. వదంతులనీ, దుష్ప్రచారాలనీ నమ్మకండి. ఏ చెట్టూ తను కాసిన పళ్ళని తానే తినదు. ఏ నదీ తన నీటితో దాహాన్ని తీర్చుకోదు. స్వామికూడా అలాంటివారే. సమస్త లోకాస్సుఖినో భవంతు అంటూ ఓ విశ్వవృక్షంలా, ఓ మహావృక్షంలా సత్య, ధర్మ, శాంతి, ప్రేమ ఫలాల్ని స్వామి మనకి అందిస్తున్నారు. సజీవ నదియై ప్రజల ఆర్తినీ, దాహార్తినీకూడా తీరుస్తున్నారు.

పుట్టపర్తి అనే అణువుగా ఉన్న ఓ కుగ్రామం, ఇవాళ ప్రపంచానికే ప్రేమ, శాంతి సందేశాలనిచ్చే స్థాయికి ఎదిగిందంటే, అది స్వామి సంకల్ప మాహాత్మ్యమే.

సంపూర్ణమైన విశ్వాసంతో స్వామి సేవలో తరిద్దాం. అనుక్షణం స్వామి నామమే స్మరిద్దాం.

జైసాయిరాం. ❊

ప్రార్థన ప్రభావం

బి.వి. సత్యమూర్తి

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మానసిక శాస్త్రవేత్త డా॥ శామ్యూల్ శాండ్విస్ అమెరికాలో కేన్సర్ వ్యాధితో మృత్యుముఖంలో దుఃఖిస్తున్న లిలియా అనుభవం ఈవిధంగా వర్ణించేరు:

ఆమె స్నేహితురాలు సాయి భక్తురాలు ఆమెకి ధైర్యం చెప్పి, "నిర్మల హృదయంతో నీవు బాబాని ప్రార్థించు. నిన్ను బాబా తప్పక రక్షిస్తార"ని అంటుంది.

"బాబా! నన్ను వైద్యులు రక్షించలేరు. ఇక నువ్వే నాకు దిక్కు. నన్ను రక్షించి నీ దివ్యత్వాన్ని ఋజువు చేయి" అని త్రికరణశుద్ధిగా ప్రార్థించింది.

తర్వాత రక్త పరీక్ష జరిపిన డాక్టర్లు ఆమె రక్తంలో కేన్సర్ కణములు అదృశ్యమగుట చూసి నివ్వెరపోయారు. ఆమె భర్త హోమర్‌కూడా ఆశ్చర్యపోయేడు. ఆమె ఎంతో ఆనందంతో స్వామికి కృతజ్ఞతాభివందనం చేసింది.

“మనం ఇండియా వెళ్ళి బాబాని దర్శించుకుందాం” అన్న లిలియాతో ఆమె భర్త హోమర్, “నాకు రావాలనే ఉంది. కానీ గత 5 సంవత్సరాలుగా నేను కనిపెట్టిన యంత్రాల పేటెంటులకు పరిశ్రమలు ముందుకు రావటం లేదు. మన ఆర్థిక పరిస్థితి క్షీణించింది. నేనుకూడా బాబాని ప్రార్థిస్తున్నాను” అంటాడు.

హోమర్ దంపతుల ప్రార్థన ప్రభావంవల్ల ఆశ్చర్యంగా అప్పటినుండి పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం అనూహ్యంగా పెరిగిపోయింది. ఆ దంపతుల ఆర్థిక పరిస్థితి అద్భుతంగా మెరుగుపడింది.

హోమర్ దంపతులకు బాబావారి దివ్యత్వం పట్ల దృఢ విశ్వాసం ఏర్పడింది. “బాబా దయవల్ల మన అదృష్టం బాగుంది. ఇక డబ్బుకు లోటులేదు. త్వరలోనే భారతదేశం వెళ్ళి భగవాన్ బాబావారిని దర్శించుకుని మన కృతజ్ఞతాభివందనములు అర్పిద్దాం” అని నిర్ణయించుకొన్నారు.

లిలియా, హోమర్ దంపతులు పుట్టపర్తి వచ్చి బాబాని దర్శించి వారి అనుగ్రహానికి కృతజ్ఞతలర్పించి వారి దివ్యాశీస్సులను పొంది ఆనందంతో అమెరికా తిరిగి వెళ్ళేరు.

5

పర్తిపురీశుని చూడరమ్మో!

ఎమ్.ఎస్. ప్రకాశరావు

సర్వజగద్రక్షకుడు శ్రీ సత్యసాయి. ఎందుకంటే, కేవలం తనని నమ్మి కొలిచిన భక్తులనే కాక తనను నమ్మనివారినీ, అసలు తానెవరో ఎఱుగనివారినికూడా ప్రేమతో ఆదుకొని, కరుణతో కాపాడిన వైనాలు వారి దివ్య జీవిత చరిత్రలో మనకు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. ఇటీవల చీరాలలో అటువంటి అపురూప సంఘటన ఒకటి జరిగింది.

సెప్టెంబరు 24, 25 తేదీలలో ప్రకాశం జిల్లా వారు తలపెట్టిన పర్తియాత్ర సందర్భంగా వారు 'సేవారాధన' అనే సంగీత నృత్య నాటకం ప్రదర్శించాలని నిర్ణయించుకున్నారు. నృత్యాలకోసం ఒంగోలు, చీరాల నుండి బాలవికాస్ బాలుర్ని ఎంపిక చేశారు. చీరాలలో బాలురకు 'పర్తిపురీశుని చూడరమ్మో పరమాత్ముడొచ్చాడు పాడరమ్మో' అన్న పల్లకీ పాటకు నృత్యంలో శిక్షణ ఇవ్వడానికి అదే ఊర్లో 'నబీ' అనే నృత్య శిక్షకుడు దొరికాడు.

నబీ ఇరవై మూడేండ్ల ముస్లిం యువకుడు. చదువు పెద్దగా అబ్బలేదు. తల్లిదండ్రులకీ, అప్పచెల్లెళ్ళకీ అతనే ఆధారం. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ సమస్యలతో సమమతమవుతున్న నబీ సరియైన ఉద్యోగం దొరకక, ప్రార్థనలు ఫలించక నిరాశా నిస్పృహలతో దైవాన్ని తలుచుకోవడం మానేశాడు. తనకు అభిమాన విద్య అయిన భరతనాట్యం నేర్చుకుని నటరాజ్ నృత్య పాఠశాలను ప్రారంభించాడు. అయినా ఆశించిన ఆదాయం లభించక కష్టాల కడలిలో ఎదురీదుతున్న నబీని శ్రీ సత్యసాయి సేవాసంస్థల కార్యకర్తలు కలుసుకొని బాలవికాస్ పిల్లలకు నృత్యంలో శిక్షణ ఇవ్వమని కోరారు.

అదే సమయంలో నబీ ఇంటికి అతని సోదరి బాజీని ప్రసవంకోసం తీసుకు వచ్చారు. నబీని ఈ భారం మరింత ఆందోళనకు గురిచేసింది. ఎందుకంటే, బాజీని పరీక్షించిన డాక్టరు కాన్పు కష్టమవుతుందనీ, ఆపరేషన్ అనివార్యమని చెప్పారు. కృంగిపోయాడు నబీ. అయినా బాలవికాస్ పిల్లలకి ఇస్తున్న నృత్య శిక్షణను శ్రద్ధగా కొనసాగించాడు. ఇక అతనికి కలిగిన దివ్యానుభవాన్ని అతని మాటల్లోనే తెలుసుకుందాం:

"ఆరోజు సెప్టెంబరు 16వ తేదీ. మా ఇంట్లో ప్రసవానికి సిద్ధంగా ఉన్న నా సోదరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మరొకప్రక్క ఆర్థిక ఇబ్బందులు. ఏ క్షణంలో ఏమవుతుందో తెలియని పరిస్థితి. ఆ రాత్రి నాకు బాగా నచ్చిన పల్లకీ పాటను పాడుకుంటూ, 'బాల ప్రహ్లాదుని బ్రోచినవాడు, హాలాహలము మ్రింగి కాచిన వాడు' అని వ్రాశారు. ఆ దేవుడే ఈ బాబానా?" అనుకుంటూ నడుం వాల్చాను. అర్ధరాత్రి రెండున్నర గంటల సమయం. హఠాత్తుగా నేను నిద్రపోతున్న గది వెలుగుతో నిండి పోయింది. ఒక చిన్న జ్యోతి క్రమక్రమంగా పెద్దదవుతూ దగ్గరగా వచ్చింది. పరీక్షగా చూస్తే, అది జ్యోతి కాదు, సాయిబాబా రూపం! ఆశ్చర్యపోయాను. "బాబాకి 85 ఏండ్ల వయస్సుంటారే! మరి ఇంత అందంగా ఉన్నారేమిటి" అనుకుంటూ బాబానే చూస్తున్నాను. ***"ఏమిటాలోచిస్తున్నావు?"*** *అని అడిగారు బాబా. నాకు నోట మాట రాలేదు.* ***"మీ కుటుంబం కష్టాల్లో ఉంది. అందుకే నిన్ను నా సేవకి పిలిపించుకున్నాను. నువ్వు వేసే ప్రతి అడుగులోనూ నీ ఇంటా వెంటా జంటా కంటా ఉంటాను. నీ కష్టాలు దూరమవుతాయి"***

అని చెప్పారు బాబా. సెప్టెంబరు 18వ తేదీన నా సోదరి బాజీని ప్రసవంకోసం ఆస్పత్రిలో చేర్చాము. ఆపరేషన్ చేసి తీరాలన్నాడు డాక్టర్. డబ్బు కావాలి, డాక్టర్‌కు కట్టాలి, బాజీని క్షేమంగా ఇంటికి తీసుకురావాలి. మా ఇంట్లో అందరూ ఆందోళనగా ఉన్నారు. నేను మాత్రం బాబా కలలో చెప్పిన మాటల్ని తలుచుకుంటూ మందిరంలో పిల్లలకి నృత్యం నేర్పిస్తున్నాను. మధ్యాహ్నం 12 గంటలకి, నమాజ్ సమయంలో, మావాళ్లు మందిరానికి వచ్చి, 'బాజీకి ఆపరేషన్ అవసరం లేకుండా సుఖ ప్రసవమైంది' అన్న సంతోష వార్త చెప్పారు."

సత్యసాయి మందిరంలో భక్తులందరూ 'కర్పూర హోమం' నిర్వహిస్తున్న సమయంలో నబీ తనకు తానుగా వచ్చి, అనుమతి తీసికొని ఆనందబాష్పాలతో తన అనుభవాన్ని చెప్పాడు.

మా అభ్యర్థనమేరకు, పైగా తనకు ఆ పాట నచ్చింది కాబట్టి, పిల్లలకు శిక్షణ ఇవ్వడానికి అంగీకరించాడేకానీ, బాబాగురించి తెలుసుకోవడానికి ఏమాత్రం ఆసక్తి చూపని నబీ **'నీ ఇంటా వెంటా జంటా కంటా ఉంటాను..'** అని బాబా చెప్పినట్లుగా మాకు తన అనుభవాన్ని వివరిస్తుంటే, ఆశ్చర్యపోవడం మావంతైంది.

"బాబా దయామయుడు. కోరకుండానే అభయ మిచ్చి మా కుటుంబాన్ని ఆదుకున్నాడు. ఇకపై నాకు మంచి రోజులొస్తాయన్న నమ్మకం ఉంది. త్వరలో ప్రశాంతి నిలయానికి వచ్చి భగవాన్ బాబావారి దివ్యసమాధి దర్శనం చేసుకుంటాను" అని అన్నాడు.

"పర్తి పురీశుని చూడరమ్మో!
పరమాత్ముడొచ్చాడు పాడరమ్మో!
పల్లకినెక్కి పరమాత్ముడొచ్చాడు
ప్రేమ పంచి పాపాలు తొలగించ
పర్తి పురీశుని చూడరమ్మో!..."

అని నబీ మనస్సు పాడుకుంటోంది. ❊

సకల దేవతాతీతస్వరూపా!

- వింజమూరి శేషఫణి శర్మ

శివుడ వగుట తెలిపె శివలింగములు నీదు
ఉదరమందు పెక్కులుద్భవించి
కరమునుండి కురిసె కైలాస భస్మంబు
సకల సౌఖ్యదాయి! సత్యసాయి

నీలిరంగు మేన నెమలీక శిరమున
కరమునందు మురళి గలిగి సాయి!
కనుల విందొనర్చి కన్నయ్య రూపాన
కృష్ణ భక్తుల మురిపించినావు

కనియె యాత్ర కేగి కస్తూరి సాయీశ!
తిరుమలేశు చరణ సరసిజముల
రంగనాథు చరణ రాజీవములయందు
నీదు మృదుల చరణ నీరజములె

సాయీశ! వాసిష్ఠ గృహాంతరస్థ
పురుషోత్తమానంద మహర్షయేత్వమ్
జ్యోతిః ప్రకాశాంతర పద్మనాభ
రూపేణ సాయుజ్య మదాః కృపాళో

బెంగుళూరుర్నాగరత్నమ్మకుం గుమార
కృష్ణ యాచేంద్ర భూపతి కీశ్వరాంబ
కున్, మరెందరో రామ భక్తులకు రామ
చంద్ర రూపంబు జూపితి సాయిరామ!

క్రైస్తవ మహమ్మదీయాది గ్రంథములను
ప్రభువు రాకను దెల్పెడు వర్ణనములు
పొందుగా సరిపోయె నీయందు స్వామి
నీవిపుడు జెహోవావో అల్లావో చెపుమ

పోలరాయిడు క్యామెరా ఫోటోయందు
మూడు శిరముల శ్రీ దత్తమూర్తి వగుచు
నీవు నిజతత్వమున్ చూపినావు స్వామి
భక్తులైన జోగారావు ప్రభృతులకును

విద్యావంతులు కావాలి, విద్యోన్మాదులు కాదు

డా॥ బి.వి. పట్టాభిరామ్

నేటి విద్య తెలివితేటలనే పెంచు
కొంచెమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
అట్టి విద్యకన్న మట్టి మిన్న

- బాబా

నేటి కాలం పిల్లలందరూ మంచివారే. వారు మట్టిముద్ద లాంటివారు. ఆ మట్టిముద్దతో సింహం బొమ్మ చేయవచ్చు, పిల్లి బొమ్మ చేయవచ్చు, అద్భుతమైన విగ్రహం చేయవచ్చు. అది చేసేవారి నైపుణ్యాన్ని బట్టి ఉంటుంది. అది తల్లిదండ్రులు కావొచ్చు, సమాజం కావొచ్చు, ప్రభుత్వం కావొచ్చు. "పాఠశాల మొదలు విశ్వవిద్యాలయం వరకు విద్యావిధానం మారాలి, అని ఉపన్యాసం ఇచ్చే పెద్దలే అధికార స్థానం అలంకరించినప్పుడు, ఆధ్యాత్మిక, ధార్మిక, నైతిక విలువలు, విద్యార్థులకు అవసరమని గుర్తించీకూడా దానికి విరుద్ధమైన చట్టాలు చేస్తారు. అది వారి బలహీనత. దానికితోడు నేటి విద్యావిధానం ఎంతో వ్యయం కూడుకున్నది. చదువుకునేవారికన్నా చదువు'కొనే'వారు ఎక్కువవుతున్నారు. ఇదా విద్య?! ఇదా విద్యకు పరమార్థం?!" అని బాబా సున్నితంగా హెచ్చరించారు.

ఈనాడు మన పిల్లలు ఇక్కడ డిగ్రీలు చదివి విదేశాలకు పోయి అక్కడేదో పెద్దపెద్ద చదువులు చదువుతున్నామని అనుకుంటున్నారు. విలువలు లేని విద్యలు ఎన్ని అభ్యసిస్తే నేమి? ఎంత సంపాదిస్తే నేమి? కన్నవారిని కాదని అక్కడేదో నేర్చుకుంటున్నామని అనుకోవడం ఒక భ్రమ.

నేటి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులుకూడా ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలగురించి యువతరానికి బాల్యంనుండే చెప్పవలసిన బాధ్యత వారిపై ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఈ విషయాలు చెప్పాలి:

- భారతదేశం పది వేల సంవత్సరాల చరిత్రలో ఏనాడూ ఇతర దేశాలమీద దండయాత్ర చేయలేదు.
- 200 సంవత్సరాలపాటు బ్రిటీషువారు మన దేశ సంస్కృతిని, మన సంస్కృత భాషను కనుమరుగు చేయాలనుకున్నా అది సాధ్యపడలేదు.
- గణితంలో అతి ముఖ్యమైన సున్న (0) కనిపెట్టినది మన భారతీయుడైన ఆర్యభట్టారకుడే. సున్నా లేకపోతే గణితం శూన్యమే. చదరంగం ఆటను కనిపెట్టినదీ మనవారే.
- విద్యకు మూలపీఠం మన దేశమే. ప్రపంచంలోని మొట్టమొదటి యూనివర్సిటీ మన తక్షశిల. ఇది క్రీస్తు పూర్వమే స్థాపించబడింది.
- మొట్టమొదటి జనరల్ ఫిజీషియన్ మన చరకుడు. మొట్టమొదటి సర్జన్ మన శుశ్రుతుడే. మొట్టమొదటి మెడికల్ కాలేజీలు మన ఆయుర్వేద కేంద్రాలే. మొట్టమొదటి అంతరిక్ష పరిశోధకుడు మన భాస్కరాచార్యుడే. ఇంకేం కావాలి?!

విద్యోన్మాదం వద్దు

చదువు అవసరమే కానీ, అదే పరమావధి కాదు. సంస్కారంతో కూడిన విద్య నభ్యసించినప్పుడే జీవితానికి అర్థం, పరమార్థం ఉంటుంది. అందుకే స్వామి అంటారు:

గుణము లేని సుతులు గురి లేని విద్యలు
నీతి లేని జాతి నిష్ఫలంబు
శాంతి లేని జీవి శశి లేని నిశి సుమీ
వినుము భారతీయ వీర సుతుడ!

గురి లేని విద్యలవలన ఈనాటి యువతరం అనేక ఇబ్బందుల్లో చిక్కుకుంది. భారతదేశంలో రోజురోజుకీ పెరుగుతున్న నేరాల సంఖ్యలు, ఆత్మహత్యలు, విడాకులు, వృద్ధాశ్రమాలు, ప్రేమ పేరుతో వంచనలు, వ్యసనాలు ... ఇలా సమస్యలు పెరుగుతున్నాయి. మానవతా విలువలు మంటగలిసిపోతున్నాయి. దైవ చింతన తగ్గిపోతోంది. ఇటువంటి సమయంలో స్వామి సమృద్ధిగా అందించిన సందేశాలు, సమాధానాలు, సలహాలు ప్రతి క్షణం గుర్తుంచుకుని అసలైన విద్య ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేయాలి.

గతంలో మన పూర్వీకులు గురుకులాల్లో నేర్చుకున్న విద్యలు వారిలో వ్యక్తిగతమైన క్రమశిక్షణా, విద్యాపరమైన క్రమశిక్షణా, సామాజిక క్రమశిక్షణా, ఆధ్యాత్మిక క్రమశిక్షణా పెంపొందించేలా ఉండేవి. కానీ ఇపుడు అవి కానరావటం లేదు. పిల్లల్లో క్రమశిక్షణ తగ్గింది. మానసిక సమస్యలు పెరుగుతున్నాయి.

ఆ రోజుల్లో మమకారాలుండేవి. ఈ రోజుల్లో మనోవికారాలు పెరిగాయి. గురువులంటే భయ భక్తులుండేవి. ఇప్పుడు గురువులే భయపడుతున్నారు. గతంలో తల్లిదండ్రులంటే ప్రేమ ఉండేది. ఇప్పుడు డబ్బుమీద ప్రేమ పెరిగింది.

సమాజంలో ఇటువంటి వికారాలు చోటు చేసుకోవడానికి కారణం ఏమిటి అని విచారిస్తే ఒకటి కాదు, రెండు కాదు, ఎన్నో ఉన్నాయి. ఈ విషయం స్వామి ఒకసారి శ్రీ సత్యసాయి యూనివర్సిటీ కాన్వొకేషన్లో ఇలా ఆశువుగా చెప్పారు:

ధనమే దైవంబయ్యె దర్పంబె మతమయ్యె
స్వార్థమే బుద్ధికి స్థానమయ్యె
అహము ఫ్యాషనయ్యె ఆశలందంబయ్యె
కపటమే జీవుల కాంతులయ్యె
ప్రేమానురాగముల్ రోగాల పాలయ్యె
కామాంధుని జేసె కలిని చదువు
బ్రతుకు బరువయ్యె మతులకు గతులు తప్పె
జాగు చేసిన జగతి కే గతియు నౌనొ?
విద్యయందున విధిగ నైతికము జేర్చి
భరత సంస్కృతిని మీరు బడయరయ్య!

కిం కర్తవ్యం?

ఇటువంటి పరిస్థితిలో నేటి సమాజం బాధ్యత ఎంతో ఉంది. మానవతా విలువలు మంటకలిసి పోతున్న తరుణంలో నేటి పెద్దలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఒక రోల్ మోడల్‌గా తమని తాము తయారు చేసుకోవాలి. ముఖ్యంగా ఐదు విషయాల్లో దృష్టి కేంద్రీకరించి, పిల్లల్ని తగినవిధంగా ప్రేరేపించాలి. పాశ్చాత్య దేశ ప్రభావాలవలన, టెక్నాలజీ అతిగా అభివృద్ధి చెందడంవలన మనకు కొన్ని కష్టాలు వచ్చాయి. వాటినుండి మన పిల్లలు అంటీ అంటనట్లుండేలా కృషి చేయాలి.

ఈ ఐదు విషయాలగురించి స్వామి పదేపదే చెప్తుంటారు. వాటిలో ముఖ్యమైనది టెలివిజన్. స్వామి చమత్కారంగా దీనిని టెలి'విషం' అంటారు. దీనినే కేబుల్ టీవీ అంటారు. విశేషమేమిటంటే, ఈ ఐదూ కూడా ఇంగ్లీషు అక్షరం 'సి'తో ప్రారంభమవుతాయి.

రెండవ 'సి', సినిమా. సినిమాలు చూడటం తప్పు కాదు కానీ, హింస, రక్తపాతం, హత్యలు, దైవనింద, తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమలు, పైశాచిక ప్రవర్తనలతో ఉన్నాయి. వాటిని చూడటం మానేయాలి.

మూడవ 'సి' కంప్యూటర్‌లో రేసులు, గేములు, అశ్లీల దృశ్యాలు. ఒక మంచి మాధ్యమంగా కనిపెట్టిన ఈ కంప్యూటర్ ఇంటర్‌నెట్లో ఫేస్‌బుక్కులు, ఆర్కుట్‌లు అంటూ కొత్తకొత్తవారితో అనవసర పరిచయాలు పెరుగుతున్నాయి, అనర్థాలు జరుగుతున్నాయి.

చివరి రెండు 'సి'లు 'కాస్ట్' (Caste) మరియు 'కమ్యూనిటీ' భేదాలు. కులం, మతం పేరుతో సమాజం చీలిపోతోంది. అందుకే స్వామి ఎంబ్లంలో మతములన్నియు ఒక్కటే అనే గుర్తులున్నాయి.

కాబట్టి చదువు అంటే మొయ్యలేనన్ని పుస్తకాలు చదవటం కాదు, ప్రపంచంలోని పెద్దపెద్ద విద్యాలయాల్లో చదవటం కాదు, కోట్లాది రూపాయలు డొనేషన్లు కట్టి డిగ్రీలు తెచ్చుకోవటం కాదు. అది విద్యాభ్యాసం కాదు, విద్యోన్మాదమే.

ఒకసారి మహాత్మా గాంధీ ఒక పాఠశాలకు వెళ్ళి పిల్లలతో కాసేపు ముచ్చటిస్తూ అసలైన చదువంటే

ఏమిటో చెప్పారు. తరువాత టీచర్లతో మాట్లాడుతూ ఒక టీచర్ని "మీరే సబ్జెక్టు చెప్తారు?" అని అడిగారు.

"నేను ఇంగ్లీషు చెప్తాను బాపూజీ" అన్నారు.

"మీరేం చెప్తారు?" మరో టీచర్ని అడిగారు గాంధీ.

"నేను సైన్సు చెప్తాను సార్"

"మీరేం చెప్తారు?" మరో టీచర్ని అడిగారు.

"నేను గణితం చెప్తాను."

"బావుంది" గాంధీగారు నవ్వుతూ, "మరి ఇంతకూ చదువు ఎవరు చెప్తారు?" అన్నారు.

అంటే చదువంటే టెక్స్ట్ పుస్తకాల్లో ఉండేదే కాదు, అందులో చెప్పని విలువలతో కూడిన విద్య ఉంది. అది నేటి సమాజానికి అవసరం. ❊

శీలనిర్మాణమే విద్యకు పరమావధి

ఈనాటి విద్యార్థులు శీలసంపత్తిని కోల్పోతున్నారు. అందువల్లనే వాళ్ళలో పెద్దలపట్ల గౌరవ మర్యాదలు క్షీణించిపోయాయి. పిల్లలను ఏవో గొప్ప చదువులు చదివించాలనే ఆశతో తల్లిదండ్రులు వాళ్ళను పట్టణాలకు పంపిస్తున్నారు. తల్లిదండ్రుల ఉద్దేశ్యము మంచిదే! కాని, పిల్లలు పట్టణాలకు వెళ్ళి పెడమార్గంలో ప్రవేశిస్తున్నారనే విషయాన్ని వాళ్ళు గుర్తించుకోలేకపోతున్నారు. పల్లెల్లో ఉన్నంతకాలం పిల్లలు పెద్దలపట్ల ఎంతో వినయవిధేయతలతో, గౌరవమర్యాదలతో ప్రవర్తిస్తారు. ఒకవేళ పిల్లలేదైనా తప్పుచేసినా వాళ్ళను మందలించి సరిదిద్దడానికి తల్లిదండ్రులు దగ్గరే ఉంటారు. కాని, పట్టణాల్లో పెడమార్గం పట్టే పిల్లలను దండించేవారే లేరు. సినిమాలకు పోవడం, పొగత్రాగడం లాంటి దురభ్యాసములను ప్రోత్సహించేవారే అధికంగా ఉన్నారు. దీనికి మూలకారణం ఆధునిక విద్యయే! పట్టణాలకు వెళ్ళేసరికి పిల్లలు వినయ విధేయతలను పూర్తిగా కోల్పోతున్నారు. కొంతమంది పిల్లలు తండ్రి ఎదురుగా వస్తున్నా లెక్కచేయకుండా సిగరెట్టు కాలుస్తారు. "ఇది నా ఇష్టము. నా సిగరెట్టు నేను కాలుస్తాను. ఇంకొకరికి నేనెందుకు భయపడాలి?" అంటారు ఆధునిక విద్యార్థులు.

ఒకానొక సమయంలో ఒక విదేశీయుడు, ఒక ఆధునిక విద్యార్థి రైలులో ఒకే కంపార్టుమెంటులో ప్రయాణిస్తున్నారు. ఆ విద్యార్థి పొగత్రాగుతూ విదేశీయునిపై 'ఉఫ్' అంటూ ఊదుతున్నాడు. ఆ విదేశీయుడు, "నాయనా! నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఈ పొగ నాకు పడదు. నీకు పొగ త్రాగాలనిపిస్తే బాత్‌రూమ్‌కి వెళ్ళి త్రాగు" అని చెప్పాడు. అందుకా విద్యార్థి, "ఇది నా ఇష్టము. ఈ సిగరెట్టు నాది. నేను కొన్నాను. కాబట్టి, నా ఇష్టమొచ్చినట్లు కాలుస్తాను, పొగ వదులుతాను. నీకిష్టం లేకపోతే నీవే బాత్‌రూమ్‌కి వెళ్ళి కూర్చో" అని దురుసుగా సమాధానమిచ్చాడు. ఆధునిక విద్యార్థులు ఈవిధంగా ఉంటారా, అని అతను ఆశ్చర్యపోయాడు. ఆ పిల్లవానితో వాదించడం ఇష్టంలేక మౌనం వహించాడు. కొద్దిసేపటికి విదేశీయుడు లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. అతను తిరిగి వచ్చేలోపల ఆ విద్యార్థి అతని బూట్లను కాలితో బయటికి నెట్టివేశాడు. ఆ దృశ్యం అతని కంటపడింది. కాని, వానితో పోట్లాడటం మంచిది కాదని భావించి అతను తన బెడ్‌మీద పడుకున్నాడు. కొంతసేపైన తరువాత ఆ విద్యార్థి లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. అప్పుడా విదేశీయుడు వానికి గుణపాఠం నేర్పాలనే ఉద్దేశ్యంతో అక్కడ తగిలించబడి ఉన్న వాని కోటును తీసి బయటికి విసిరేశాడు. వాడు తిరిగి వచ్చి, "నా కోటు ఎక్కడ?" అని అడుగగా, "నీ కోటు నా బూట్లను వెతకడానికి వెళ్ళింది" అని జవాబిచ్చాడు.

- బాబా

సాకార నిరాకార సంధి

పి.పి.ఎస్. శర్మ

'తేజోమయం సగుణ నిర్గుణ మద్వితీయం
ఆనంద కంద మపరాజిత మప్రమేయం'

ఇట్టి పరబ్రహ్మస్వరూపులైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి జీవితాన్నిగూర్చి, చర్యలను గూర్చి, వారి అలౌకిక ప్రవృత్తులగూర్చి ఇతమిత్థంగా నిర్వచించుట, వర్ణించుట, వ్యాఖ్యానించుట మొదలైన సాహస ప్రయాసలు ఎట్టివారికినీ సాధ్యం కాదు. మహాపురుషుల అవతరణ, ఆచరణలు ఎంత అగ్రాహ్యములో వారి నిష్క్రమణ విధానం కూడా అంతే అనూహ్యము. 'జన్మ కర్మచ మే దివ్యం...' అని కృష్ణ భగవానుడు తెల్పినట్లుగా, 'కాదు నన్నట్ట ఎటువంటి ఘనునికైన' అని బాబావారు సెలవిచ్చారు.

భగవానుని మహాభినిష్క్రమణ సమయంలో యావత్ప్రపంచంలోని వైవిధ్యపూరితమైన జనావళి తమతమ ప్రవృత్తిననుసరించి తమకు తోచినరీతిగా స్పందించుట జరిగినది. ఒక రాజకీయ నాయకురాలు ఒక వార్తాపత్రికలో వ్రాసిన వ్యాసం గమనార్హం. "సత్యసాయిబాబాకి నేను భక్తురాలిని కాదు కానీ, వారు సల్పిన సర్వతోముఖ సేవలను గమనించి ముగ్ధురాలి నైనాను. ముఖ్యంగా వారి ఉచిత వైద్యాలయాల్లో , వారి భక్తులు చేసే సేవలనుగూర్చి ఎందరో ప్రశంసలు చేయుచున్నారు. ఇంకా బాబా అనేక బృహత్కార్యాలను ప్రభుత్వాలుకూడా చేపట్టలేనివిధంగా విజయవంతంగా సాగించారు. ఇంతటి కార్యాలను వ్యక్తిగతంగా మరెవ్వరూ సాధించలేరని నా అభిప్రాయం...."

ఇవి కాకుండా, కొన్ని ప్రసార మాధ్యమాలు వాటికి తోచినరీతిగా ప్రచారం చేయటం మొదలుపెట్టాయి. ఈ ప్రచారాలనుబట్టి తెలిసేదేమిటంటే, బాబావారు ప్రపంచానికొసగిన మేరుపర్వతమంతటి ఆధ్యాత్మిక సంపదను వీళ్ళు విస్మరించారు. అన్నిటికంటే గొప్ప మిరకిల్ వీరికి అర్థమైనట్లు లేదు. అదే బాబావారి అపారమైన దివ్య ప్రేమతత్త్వం. ఈ తత్త్వం తెలియని వారినిగూర్చి సాయి భక్తులు సానుభూతి వహించి, వారందరికీ సరియైన అవగాహన కల్గజేయాలని స్వామిని ప్రార్థించాలి.

సాయి భక్తులందరికీ ఇదొక సాకార, నిరాకార సంధి కాలంగా కానవచ్చుచున్నది. ఇన్నాళ్ళుగా మనందరి ఎదుట స్వామి తమ అమోఘమైన దర్శన, స్పర్శన, సంభాషణలతో నిత్య నూతనంగా అలరించి, అనూహ్యమైన విధంగా నిష్క్రమించుటచేత భక్తకోటి ఒక్కమాటుగా దిగ్భ్రాంతిలో మునిగిపోయినది. శ్రీ కృష్ణుని నిర్యాణంవల్ల పాండవులు ఏ స్థితిలో ఉండిరో మనం ఇప్పుడు అదే స్థితిలో ఉన్నట్లు తోచుచున్నది. మహాతేజోవంతంగా పగటినేలిన సూర్యుడు అస్తమించి నంతమాత్రాన లేకుండా పోయినట్లా?

'యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవానుపశ్యతి
సర్వ భూతేషుచాత్మానం తతో న విజుగుప్సతే'

'యస్మిన్సర్వాణి భూతాన్యాత్మైవాభూద్విజానతః
తత్ర కో మోహః కః శోక ఏకత్వమను పశ్యతః'

అని ఈశావాస్యోపనిషత్తు తెలిపినట్లుగా, నిజమైన భక్తుడు సర్వమును తనతో సమానంగా భావించి ఆ ఏకాత్మ భావనను దినాదినాభివృద్ధి చేసికొనుటకై సాధన కావించాలి. అప్పుడే మనయందు స్వామియొక్క నిరాకార బ్రహ్మతత్త్వం స్థిరంగా నిలుస్తుంది.

'దప్పితో అలమటించు ప్రజలకు
వారొక జీవనాధారమైన జలధరము
బరువెక్కిన గుండెతో, ఖాళీ చేతులతో
జీవిత సమరమునందు గెల్చు ధైర్యములేని
ప్రతి ఒక్క అర్జుననితో బాబా పల్కెదరు
వారు నీకొరకై నీవద్దకు వచ్చినట్లనిపిస్తుంది
వారు నిశ్శబ్దంగా నలువైపులా చూస్తున్నట్లు తోచును
వారి గుప్పిటనుంచి నీ హృదయాన్ని లాగుకొనలేవు
వారి బంధం చల్లటి హాయి నిస్తుంది!'

స్వామి మనలో తెస్తున్న పరివర్తన

ఆదూరి శ్రీనివాసరావు

మంచు కొండల మధ్య మనుగడ నిల్పేసి
ఆంధ్ర జేరగ దలచె ఆర్తిహరుడు
కొత్త భక్తుల జూడ కోర్కెలు ఉదయించ
తనయుండు జేరెను తండ్రితోడ
అన్న నొదలి యుంట అసలు ఇష్టములేక
బాలమురుగ స్వామి బయలుదేరె
భర్తలేని విరహ బాధను పడలేక
పార్వతమ్మకూడ పయనమయ్యె
పుడమినున్న జనులు పూర్తిగ చెడిపోవ
భక్తిమార్గము చూపి బాగుచేసి
ఆత్మవిద్యను నేర్పి అద్వైతులుగ చేయ
పుట్టపర్తిని చేరె పురహరుండు

శివ శక్తి స్వరూపులైన శ్రీ సత్యసాయిబాబావారు మానవాళికి చేసిన మహోపకారమేమిటంటే, మానవాళికి తమ స్వరూపమును తెల్పి ఆ అనుభవంలో ఉండే ఆనందాన్ని పొందజేయడం.

ఇన్ఫర్మేషన్ సేకరణయే మానవుని గుణమైతే మానవునిలో ట్రాన్స్‌ఫర్మేషన్ తీసుకురావడం భగవంతుని లక్షణం. సామాన్య మానవునిగానూ, ఒక ఉద్యోగిగానూ అనేక హాస్య, వ్యంగ్య చిత్రాలను ప్రచురించే ఒక వారపత్రికలో ఉన్న శ్రీమాన్ కస్తూరిగారిని పిలిపించుకుని, “యూనివర్సిటీ నుండి రిటైరైన తరువాత నావద్దనే ఉందువు. నా జీవిత చరిత్రను నీవు వ్రాయవచ్చు” అని అన్నప్పుడు తాను ఆశ్చర్యంగా, “నేనా?!” అన్న పెద్ద మనిషిని దగ్గర చేర్చుకుని ఒక ఉత్తమ వ్యక్తిగానూ, ఒక అనుష్ఠాన వేదాంతిగానూ, ఒక మహాభక్తునిగానూ, తత్త్వవేత్తగానూ మార్చిన మహాపురుషుడు, దివ్య పురుషుడు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా. పుట్టపర్తికి వచ్చిన నాటినుండి పురాణపురుషుని సేవలో తరించిన శ్రీమాన్ కస్తూరిగారిని చేర్చి, మార్చి, ఆధ్యాత్మిక ఆణిముత్యంగా రూపొందించారన్న విషయం మనందరికీ తెలుసు. వారి స్మారకార్థం శ్రీ కస్తూరి రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

పాశ్చాత్యులలో హోవర్డ్ మర్ఫెట్. ఒకసారి స్వామి మర్ఫెట్‌గారి ఫోటోను చూపి, ‘వీరెవరు?’ అన్నారు. ఆ భక్తుడు, ‘వీరు మర్ఫెట్ స్వామీ’ అంటే, ‘కాదు, పర్ఫెక్ట్’ అంటూ ‘హేండ్స్ ఇన్ సొసైటీ, హెడ్ ఇన్ ఫారెస్ట్’ అన్నారు. మర్ఫెట్‌గారు ‘మేన్ ఆఫ్ మిరకిల్స్’ అనే ఒక గ్రంథాన్ని రచించి స్వామినిగురించి, స్వామి దివ్యత్వాన్నిగురించి ప్రపంచానికి చాటి చెప్పారు. ఇలాంటివారెందరో మహానుభావులు, అందరికీ మన వందనాలు.

కడుపులో నొప్పి వస్తే ఏ డాక్టరైనా ఒక టాబ్లెట్టో, ఇంజెక్షనో ఇస్తాడు. కానీ, పక్కవారి వృద్ధిని చూసి అసూయ పొందే వ్యక్తికి, యాంటీ జెలసీ టాబ్లెట్స్ గానీ, యాంటీ హేట్రెడ్ ఇంజెక్షన్‌గానీ ఇవ్వగలడా? అసలు అవి ఉన్నాయా? భవరోగ వైద్యులయిన మన బాబా తమ బోధలద్వారానూ, లీలలద్వారానూ, మహిమల ద్వారానూ, ఉపదేశాలద్వారానూ, ఈర్ష్యాసూయలనే రోగాలతో కొట్టుమిట్టాడేవారిని, అనైతిక మార్గాలద్వారా ధనాన్ని సంపాదించే వ్యాపారులను, అమానుషంగా ప్రవర్తించే హింసావాదులను, ధనమే దైవం అనుకునే డాక్టర్లను, ఇంజనీర్లను, విద్యావేత్తలను, మతోన్మాదంతో అక్రమమార్గాలను అన్వేషించే అంధులనూ చేరదీసి, తమ ప్రేమ అనే ఆయుధంతో మానవతా విలువలను నొక్కి చెపుతూ, క్రమక్రమంగా వారిలో మార్పును తెస్తున్నారు. మానవత్వంలోని మాధుర్యాన్ని, భక్తిలోని పరమార్థాన్ని తెలిపి మాధవత్వానికి దారితీయగల మహోన్నత మహిమాన్వితమూర్తి మన బాబా.

కళాశాలల్లో విద్య నేర్చుకొనవలసిన విద్యార్థులు 'మద శిష్యులు'గా, అధ్యాపకులు 'ధన గురువులు'గా తయారవుతున్న తరుణంలో తామే విద్యాసంస్థలను స్థాపించి, 'విద్య జీవిత పరమావధికేగానీ, జీవనోపాధికి కాదు' అని బోధిస్తూ, మహిళా కళాశాలనుకూడా స్థాపించి, 'ఆదర్శప్రాయులైన మాతృమూర్తులను తయారు చేయటమే ఈ మహిళా కళాశాల ధ్యేయము' అన్నారు. అలాగే చేస్తున్నారు. ప్రాపంచిక సుఖాలలో దురభ్యాసాలకు లోనౌతున్న యువతను ధర్మబద్ధులుగా చేస్తూ భజనలలోనూ, సమాజ సేవలోనూ ఆదర్శాన్ని అందింపజేస్తున్నారు, మన స్వామి. ఇలాంటివారు మన దేశంలోనూ విదేశాలలో కూడా రాణిస్తున్నారు.

సాయి భక్తులలో హిందువులున్నారు, ముస్లిమ్‌లు ఉన్నారు, పారశీకులున్నారు, బౌద్ధులున్నారు, క్రైస్తవులున్నారు. సర్వమతస్థులనూ సాయి తన ప్రేమ ప్రభావానికి కట్టుబడేటట్లు చేస్తున్నారు. వ్యక్తులలో పరివర్తన తీసుకురావడమే బాబా ప్రధాన లక్ష్యం. అది సఫలమవుతున్నది.

When there is righteousness in the heart
there is beauty in character,
when there is beauty in character
there is harmony at home,
when there is harmony at home,
there is order in the Nation, and
when there is order in the Nation
there is peace in the world

(హృదయం ధర్మం ఉంటే
ప్రవర్తన అందంగా ఉంటుంది.
ప్రవర్తన అందంగా ఉంటే
ఇంటిలో సామరస్యం ఏర్పడుతుంది.
ఇంటిలో సామరస్యం ఉంటే
జాతిలో సువ్యవస్థ నెలకొంటుంది.
జాతిలో సువ్యవస్థ ఉంటే
ప్రపంచంలో శాంతి వర్ధిల్లుతుంది)

అంటారు భగవాన్ బాబా. వ్యక్తి మార్పుకు, తద్వారా సమాజ మార్పుకు స్వామి చేస్తున్న సేవ అపారము.

నాస్తికులెందరో 'నారాయణ' అని పలుక
బ్రహ్మ సమాజుల భ్రమలు తొలగె
విష్ణు భక్తులు కాశీ విశ్వేశ్వరుని కొలువ
వీర శైవులు చేయ విష్ణు స్మరణ
భౌతిక వాదులు భజన చేయుచునుండ
తర్కవాదులు దైవ తత్త్వమరయ
కమ్యూనిష్టులు వచ్చి కైమోడ్పు చేయంగ
పాశ్చాత్యులు కూడి భక్తి చూప
ఆత్మతత్త్వము తెల్పి అందరనొక బాట
నడుపుచుంటివి ఓ సాయి! నళిన నేత్ర!
ఎట్టివారైన నీ ముందు వట్టివారె!
ఏమి చిత్రమొ నీ లీల లెవరి కెఱుక!

సాయిమాత

- కవిలిగ నరసింగరావు

మాతలకు మాత మా సాయిమాత
లాలించి పాలించే ప్రేమించే
సకల దేవతాతీతరూపమే మా సాయిమాత

సాకారమై నిరాకారమై వెలిగే
త్రిభువన పాలిని త్రిజగన్మోహిని
కని విని ఎరుగని కనికరమను గని
త్యాగమే భాగ్యమనే భవతారిణి
విశిష్ట 'సేవాయోగ వాసిష్ఠ' బోధిని

దీనజనోద్ధారిణి దీర్ఘ రోగ నివారిణి
అనంత ప్రేమదాయిని సాయిమాత!
సర్వమత సమ్మతమే సాయి మతము
వేదాంతసార పంక్తులే సాయి సూక్తులు

సాయిమాతకు సాటిలేరు
సమత మమతకు పోటీ లేరు
సాయిమాత మాటలు ముక్తికే బాటలు

మాతా మాతా ఓ సాయిమాతా!
నిను కీర్తింపగ మేమెంతా?
నీ దీవెనలొసగి ఉండుమా మాచెంతా!

స్వామితో శ్రీరామశరణ్ మధురానుభూతులు

ప్రొ॥ జి.ఎన్. మూర్తి

'శ్రీరామశరణ్' కుందుర్తి వెంకట నరసయ్యగారు 1905 మే 2వ తేదీన నాటి బాపట్ల తాలూకా పెద్ద చెరుకూరు గ్రామంలో కుందుర్తి లక్ష్మీ నరసయ్య, సీతమ్మ దంపతులకు జన్మించారు. స్వయంకృషితో ఇంగ్లీషు, సంస్కృతం, హిందీ, తెలుగు భాషలలో అనన్యమైన పాండిత్యం సంపాదించడంతోపాటు ఎన్నో భక్తి కీర్తనలు వ్రాసి, పాడి అసంఖ్యాకంగా భక్తుల్ని దేశం నలుమూలలా ప్రభావితుల్ని చేశారు. వీరు జీవితంలో ఆఖరి క్షణం వరకు 'శ్రీరామ' నామ స్మరణతో ఏరిన బియ్యంతో వండిన ఆహారాన్నే స్వీకరించారు. "శ్రీరామశరణ్" వారి రామభక్తికి నిదర్శనంగా నిలిచిన బిరుదు. శ్రీరామశరణ్‌గారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శన, స్పర్శన, సంభాషణా సౌభాగ్యం అనుభవించి, ఆనందించి, పలుసార్లు భగవాన్ సన్నిధిలో అద్భుతంగా ప్రసంగించి అందర్నీ అలరించారు. శ్రీ సత్యసాయి సేవాసంస్థలు నిర్వహించిన పలు సభలలో ప్రసంగించారు. వీరికి దేశం నలుమూలలా అసంఖ్యాకంగా శిష్యులున్నారు.

మాజీ విద్యాశాఖామంత్రి మాన్యశ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారితో కలిసి శ్రీరామశరణ్‌గారిని కలుసుకోవడానికి ఒకసారి వారు నివసిస్తున్న బుద్ధాం గ్రామానికి వెళ్ళాం. ఆ సందర్భంగా వారితో జరిగిన ఇంటర్వ్యూ విశేషాల్ని మీతో పంచుకుంటున్నాను.

శ్రీరామశరణ్‌గారిని ఆధ్యాత్మిక రంగంలో ఎలా ప్రవేశించారని అడిగితే, "నేను 5 సం॥ల వయస్సులో ఉన్నప్పుడు మా గ్రామానికి ఒక స్వాములవారు వచ్చారు. "దేవుడెక్కడున్నాడు?" అని ఆయన అందర్నీ ప్రశ్నించారు. నేను చేతితో త్రిప్పుతూ, "దేవుడు అంతటా ఉన్నాడు" అని చూపించాను. ఆ స్వాముల వారు ఆనందం పట్టలేక నన్ను ఎత్తుకున్నారు. ఆనాడే ఆధ్యాత్మిక భావం నాలో చిగురించింది. వావిలకొలను సుబ్బారావుగారు నన్ను రామకోటి వ్రాయమన్నారు. రామసాక్షాత్కారం రెండుసార్లు జరిగింది. రామాయణం 108 పటాలతో చిత్రించాను" అన్నారు.

శ్రీరామశరణ్‌గారు మధుర వచస్వి, అపూర్వ తేజస్వి, సంపూర్ణ యశస్వి, నిత్య తపస్వి, నిరంతర సంతోష మనస్వి. వారి ప్రసంగాలు అపురూప మధుర దివ్య విద్వత్ ఔషధాలు.

శ్రీరామశరణ్‌గారిని ఆత్రుతపట్టలేక, శ్రీ సత్యసాయి బాబావారిని భగవంతుడని ఎప్పుడు, ఎట్లా విశ్వసించారు? అని అడుగుతూ భగవాన్‌తో వారి మధురానుభూతులు వివరించమని అడిగాను. ఆనందంతో వారు వివరించిన అంశాలు మీకు నివేదిస్తున్నాను.

'నేను సనాతన భాగవత భక్త సమాజంలో ఉన్నాను. ఒకసారి వారంతా దసరాకు పుట్టపర్తి వెళుతూ నన్ను రమ్మన్నారు. ఆనాడు బాబామీద నాకు భగవంతుడన్న విశ్వాసం లేదు. అందువలన నేను రానన్నాను. వారు వెళ్లిపోయారు. తరువాత నాకు 105 డిగ్రీల జ్వరం వచ్చి చాలా బలహీనపడ్డాను. శిష్యుల సహాయంతో అడుగులు వేస్తున్నాను. నా మనస్సులో ఆకస్మికంగా అప్పుడు నేను వాళ్ళతో పుట్టపర్తికి వెళ్ళి ఉండవలసింది అనిపించింది. వెంటనే నేను మనస్సులో రెండు షరతులు పెట్టుకున్నాను. నేను చన్నీళ్ళతో స్నానం చేస్తాను, జ్వరం నార్మల్‌కి రావాలి. గడ్డ పెరుగు, ఆవకాయతో భోజనం చేస్తాను, జ్వరం పెరగకూడదు అనుకున్నాను. అట్లా జరిగితే వెంటనే పుట్టపర్తి వెళ్ళా లనుకున్నాను. నేను ఆశించినట్లే చన్నీళ్ళ స్నానం, గడ్డ పెరుగు, ఆవకాయతో భోజనం నా జ్వరాన్ని తగ్గించాయి. మరి రాలేదు. నేను అనుకున్నట్లు

శిష్యులతో పుట్టపర్తికి బస్సులో బయలుదేరాను. మధ్యలో బస్సు చెడిపోయింది. నీరసంతో, ఆయాసంతో నేను చాలా ప్రయాసపడ్డాను. వెనక్కి వెళ్ళలేక, ముందుకు సాగలేక చాలా వ్యథ చెందాను. ఎట్లాగైతేనేం, పుట్టపర్తి చేరుకున్నాం. ప్రశాంతి నిలయం ప్రాంగణంలో బాబా ఎదురొచ్చి, **"రామ శరణ్, బాగున్నావా? పాపం! చాలా శ్రమపడి వచ్చావు. 105 డిగ్రీల జ్వరంతో చన్నీళ్ళ స్నానం... ఆవకాయ, గడ్డపెరుగు భోజనం... దారిలో బస్సు ట్రబుల్... ప్రయాస, బడలిక... అయినా వచ్చావు. సంతోషం!"** అని పలుకరించారు. "రామశరణ్" అని పేరుతో పిలిచినందుకు, జరిగినదంతా పూస గ్రుచ్చినట్లు వివరించినందుకు ఆశ్చర్యానందాలకు లోనై, "బాబా సామాన్యుడు కాదు, ప్రత్యక్ష పరమాత్మ", "నా శ్రీరాముడే ఈ సాయిరాముడు" అని వెంటనే నిర్ణయానికి వచ్చి భగవాన్ బాబా దివ్య పాదపద్మాలకు సాష్టాంగ నమస్కారం చేశాను.

బాబా నన్ను పూర్ణచంద్ర మందిరంలోకి తీసుకు వెళ్ళారు. వేలాదిమంది భక్తులతో, సకల కళావైభవంతో ఆధ్యాత్మిక విజ్ఞాన వికాస సుందర మందిరంలో వేదిక మీదినుండి బాబా ప్రసంగిస్తున్నారు. మధురాతి మధురమైన మకరందమయ వాగ్వర్షం నన్ను ముగ్ధుణ్ని చేసింది. నాకు బాబా 'కోదండ రామునిగా' సాక్షాత్కరించి నా సందేహాలను పోగొట్టి పరవశం కలిగించారు. తరువాత స్వామి నన్ను నామమహిమ గురించి శ్రవణానందకరంగా ప్రసంగించమన్నారు" అని వివరించారు.

శ్రీరామశరణ్‌గారు శాస్త్ర ప్రమాణాలతో, సంఖ్యా శాస్త్ర జ్ఞానంతో అలవోకగా శ్రీరామ, సాయిరామ నామ మహిమలగురించి, భగవాన్ బాబావారి దివ్య అవతార తత్త్వంగురించి మధుర ప్రసంగం చేసి స్వామినీ, భక్తులందరినీ అలరించారు.

వారి అనుభూతులనుగురించి ప్రస్తావిస్తూ, "స్వామి నాకు ఇంటర్వ్యూ ప్రసాదించి, 'ఏమి కావాలో కోరుకో రామశరణ్' అన్నారు. 'స్వామీ, నాకేమీ కోరికలు లేవు' అన్నాను. వెంటనే స్వామి, 'రామశరణ్, రాముని బాణంలాగే స్వామి మాటకు తిరుగులేదు. కోరుకో వలసిందే' అన్నారు. వెంటనే, 'స్వామీ, నా శిష్యులకు మోక్షం ఇప్పించండి' అన్నాను. స్వామి, 'రామశరణ్, నాదగ్గరకు వచ్చేవారందరూ అనేక కోరికలతో వస్తారు. కానీ నీ మాదిరి శిష్యులకు మోక్షం ప్రసాదించమని అడిగేవారు చాలా అరుదు. నిజమైన గురువు కోరుకోవలసినిదిదే' అన్నారు. 'అభీష్టసిద్ధిరస్తు' అని ఆశీర్వదించారు."

శ్రీరామశరణ్‌గారి రచనలగురించి ప్రశ్నించితే, "నేను ఆధ్యాత్మికతనుగూర్చి, సాధననుగూర్చి, సనాతన ధర్మ ప్రచారమునుగూర్చి 118 పుస్తకాలు రచించి ప్రచురించాను. రామాయణంమీద నా ప్రసంగాలను పుస్తకరూపంలో ప్రచురించాను. 'నామ మహిమ' గ్రంథ రచనకు స్ఫూర్తి భగవాన్ బాబావారు. ప్రభుదత్త బ్రహ్మచారి హిందీలో వ్రాసిన 16 వేల పేజీల భాగవత కథను తెలుగులోకి అనువదించాను. గీతను అనువాదం చేశాను" అన్నారు. ప్రశాంతి నిలయంలో స్వామి దివ్య సన్నిధిలో పలుమార్లు ప్రసంగించినప్పుడు కలిగిన దివ్య మధురానుభూతులను, ఆ అపూర్వ క్షణాలను తలచుకుంటూ పరవశించిపోయారు.

చివరిసారిగా శ్రీరామశరణ్‌గారు, 1994లో విజయవాడ శ్రీ సత్యసాయి నిలయంలో ఏర్పాటు చేసిన 'భారతీయ సంస్కృతి – ఆధ్యాత్మికత' రెండు రోజుల శిక్షణా శిబిరంలో ప్రారంభోపన్యాసం, ముగింపు ఉపన్యాసం చేశారు. భారతీయ సంస్కృతి విశిష్టతను, ఆధ్యాత్మిక సంపదను, భగవాన్ బాబా దివ్య అవతార లీలా విశేష వైభవాన్ని, అవతార తత్త్వాన్నిగురించి మధురాతిమధురంగా, ప్రమాణాత్మకంగా ప్రసంగించి శ్రోతల్ని ముగ్ధుల్ని చేశారు.

తెలుగు, ఆంగ్ల, హిందీ, సంస్కృత భాషలలో అనర్గళ గళం, నిత్య చైతన్య కలం, ఆధ్యాత్మిక బలం మూర్తీభవించిన మహా త్రివేణి శ్రీరామశరణ్ చివరి క్షణం వరకూ సనాతన ధర్మ ప్రచారాన్ని చేస్తూ, సాయి సంస్థలలో స్వామి దివ్య అవతార తత్త్వాన్నిగూర్చి ప్రసంగిస్తూ ముగ్ధుల్ని చేస్తూ స్వామిలో ఐక్యమైన మహనీయునిగా వన్నెకెక్కారు. ❊

మానవతా విలువలు

ఎన్.బి.ఎస్. రామారావు

సత్య ధర్మ అహింసలు శాంతి ప్రేమ
మానవుని పంచ ప్రాణాలు మహిని ఇవియు;
పంచప్రాణాలలో ప్రేమ ఎంచ హెచ్చు
కాన హృదయాన ప్రేమను గట్టిపరచు

అన్నారు, బాబా. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస, త్యాగములను ఆరు మానవతా విలువలను (సాయి షట్కమును) ఆచరణలో పెట్టు విద్యావిధానమే "సాయి ఎడ్యుకేర్." మానవునిలోపల స్వతస్సిద్ధముగా ఉన్న విలువలను బహిర్గతము చేసి, ఆచరింపజేయుటే 'ఎడ్యుకేర్.' ఇక 'సాయి' అనగా ఏమిటి?

S - **S**piritual Transformation
(ఆధ్యాత్మిక పరిణామము)
A - **A**ssociation Transformation
(సామాజిక పరిణామము)
I - **I**ndividual Transformation
(వైయక్తిక పరిణామము)

ఈ త్రివిధ పరిణామములను సాధించుటలో 'ఎడ్యుకేర్' విధానమునకు ప్రముఖ పాత్ర ఉన్నది. విద్య అనగా మానవుని భవబంధములనుండి విముక్తుని చేసి, ఆధ్యాత్మికతవైపు నడిపించునది. **"సా విద్యా యా విముక్తయే".** సత్యమనగా మూడు కాలములందు ఉండునది, నాశరహితమైనది.

'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి' ఉన్న సత్యము ఒకటే అయిననూ ఋషులు దీనిని బహువిధములుగా పిలిచారు. సత్యమే ధర్మము. సత్యమే తపస్సు. సత్యమే యోగము. సత్యమే పరబ్రహ్మ. సత్యమే నీవు (ఆత్మ). సత్యం త్రికరణశుద్ధితో కూడినది. తలపు, మాట, క్రియ – ఈ మూడూ ఒకటిగా నుండుటయే త్రికరణ శుద్ధి. వేద శాస్త్రములన్నియు సత్యమునుండియే ఆవిర్భవించినవి. 'సత్యాన్నప్రమది తవ్యం', సత్యం విషయంలో ప్రమాదపడకూడదు. ఎంత కష్ట కాలములోనైనా సత్యమును వీడి దూరం పోరాదు.

ఎంతటి కష్టకాలములోనైనా సత్యమునే పలికాడు, సత్యహరిశ్చంద్రుడు. సత్యంకోసం భార్యాబిడ్డలనూ, రాజ్యాన్నీ వదులుకున్నాడు. 'సత్యమేవ జయతే' చివరకు సత్యమే జయించింది.

ధర్మము

"సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్యమును మించిన ధర్మము లేదు. బలి చక్రవర్తి వామనునికి మూడు అడుగుల నేల దానమిచ్చునప్పుడు – వచ్చినవాడు విష్ణుమూర్తి అని శుక్రాచార్యులు చెప్పినా వినక – తాను ఆడిన మాట తప్పలేననీ సత్యవాక్పరిపాలకుడుగా చరిత్రలో నిలిచిపోయేడు. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ సత్యహరిశ్చంద్రుని వీధి నాటకము చూసి, సత్యమును తన నిజ జీవితంలో ఆచరించి, 'మహాత్మా గాంధీ' అయ్యేడు. స్వామి చెప్పారు:

పరులు దూషింప నీవునూ వారివలెనే
తిరిగి దూషింప నీదు ఆధిక్యమేమి?
ఏది తప్పని నీవు ఎరిగినావో
దాని చేయకనుండుటే ధర్మపథము

"ధారణాత్ ధర్మః" ధరించబడునది, ఆచరింపబడునది ధర్మము. పీడింపబడుతున్న ప్రజా సమూహమునకు ఆచరణద్వారా శ్రేయస్సును ఒనగూర్చునదే ధర్మము. **"ధరతి విశ్వమితి ధర్మః"** విశ్వమునంతయూ ధరింప, భరింపగల్గు శక్తియే ధర్మము. నీవు ధర్మము ఆచరించిన ధర్మమే నిన్ను రక్షించును. ఉదాహరణకు, కాశీలో ధర్మపాలుని కథను తెలుసుకుందాం.

పూర్వం కాశీ క్షేత్రంలో ధర్మపాలుడనే బ్రాహ్మణు డుండేవాడు. అతని కుమారుని కాశీలో విద్యాభ్యాసము పూర్తయిన పిదప ఉన్నత విద్యకై 'తక్షశిల'లో చేర్పించాడు. ఆనాడు విద్యాలయములన్నీ గురుకుల వాసములే. ఈ అబ్బాయి గురుకులములో చేరిన ఒక నెలరోజుల తరువాత గురువుగారి ఎనిమిదేళ్ళ కుమార్తె హఠాత్తుగా మరణించింది. ఈ విషయంలో గురువు గారి శిష్యులందరూ బాధపడుతుండగా కాశీనుంచి వచ్చిన ధర్మపాలుని కుమారుడు, "గురువుగారి అమ్మాయికి అకాల మృత్యువా? మా కాశీలో అకాల మృత్యువులుండవు. అంతా ధర్మాచరణపరులు" అని స్నేహితులను ఎత్తి పొడిచాడు. విద్యార్థులు ఈ విషయం గురువుగారికి చేరవేసారు. ఆయనకు తన బాధలోకూడా ఈ కొత్త విద్యార్థిపై కోపం వచ్చింది.

కొద్ది రోజులు పోయాక గురువుగారు ధర్మపాలుని పరీక్షించదలచి కాశీ ప్రయాణమై వెళ్ళాడు. దారిలో గల స్మశానములో మేకయొక్క అస్థికలను మూట కట్టుకుని భుజాన వేసికొని ధర్మపాలుని ఇంటికి వెళ్ళి, "ధర్మపాలా! తక్షశిలలో నాదగ్గర చదువుతున్న నీ కుమారుడు హఠాన్మరణం పొందాడు. అతని శవాన్ని తీసికొని రాలేక మేమే దహన క్రియలు జరిపి అతని అస్థికలను తీసికొని వచ్చాను" అని ఏడుస్తూ ఆ మూట అక్కడ పెట్టాడు. అంత ధర్మపాలుడు మహాధైర్యంతో, "లేదు. నా కుమారుడు బ్రతికే ఉన్నాడు. కాశీ క్షేత్ర నివాసులమైన మేమందరంకూడా అన్ని ధర్మములను నిత్యము యథావిధిగా ఆచరిస్తాము. కనుక, మాకెట్టి అపమృత్యువూ సంభవించదు. ఆ సంచీలోని అస్థికలు నా కుమారునివి కావు. ధర్మో రక్షతి రక్షితః" అన్నాడు. అంత తక్షశిల గురువు ధర్మపాలుని ధర్మాచరణకు ఆశ్చర్యపడి, ధర్మముపై ఆయనకుగల విశ్వాసమునకు జోహార్లు అర్పించి, క్షమాపణ చెప్పుకున్నాడు. అట్టి ధర్మాచరణే మానవతా విలువ. ❊

అనుగ్రహం

జి. సత్యనారాయణరావు

అది 1978 సం॥. అప్పుడు నేనొక నిరుద్యోగిని. స్వామి భక్తురాలైన మా అమ్మమ్మ నా నిరుద్యోగ బాధను చూడలేక కన్నుమూసింది. తర్వాత ఆంధ్ర ప్రభలో అడ్వర్‌టైజ్‌మెంటు చూసి, పుట్టపర్తిలోని శ్రీమతి ఈశ్వరమ్మ హై స్కూల్‌కి దరఖాస్తు పెట్టుకున్నాను.

ఒకరాత్రి మా అమ్మమ్మ కలలోకి వచ్చి ఒక కవరు చేతికిచ్చింది. అది లేత పసుపురంగు కవరు, అందులో తెల్లని పేపర్, దానిపై ఏవో ఆంగ్ల అక్షరాలు. దాన్ని నాల్గు మడతలు పెట్టారు. మరునాడు ఉదయం 11 గం॥లకు పోస్టుమేన్ ఒక కవరు తెచ్చిచ్చాడు. అది సరిగ్గా నేను కలలో చూచిన పసుపు రంగు కవరు! అందులో నాల్గు మడతల తెల్లకాగితం! నేను ఆశ్చర్యంలో తలమునకలయ్యాను. ఇంతకీ అందులో కబురేంటి? నన్ను ఇంటర్వ్యూకి రమ్మని పుట్టపర్తినుండి వచ్చింది. స్వామి దయవల్ల ఇంటర్వ్యూ బాగానే జరిగింది. ఆరోజు సాయంత్రం నేను బస్టాండులో తిరుగు ప్రయాణంకోసం నిరీక్షిస్తుంటే, స్కూలు కరెస్పాండెంటు నన్ను వెదుక్కుంటూ వచ్చి, నా భుజంమీద చెయ్యి వేసి, "నీవు సెలెక్ట్ అయ్యావు. స్వామి కూడా ఆమోదించారు" అన్నారు. అప్పుడు నా పరిస్థితి ఎలా ఉంటుందో మీరూహించుకోవచ్చు. వర్ణనాతీత భావ స్పందనలు నాలో చెలరేగాయి.

ఈవిధంగా శ్రీ సాయి భగవానుడు నన్ను అనుగ్రహించి 1978లో పుట్టపర్తిలో ఉద్యోగం ప్రసాదించారు. ఈమధ్యనే నేను ఉద్యోగ విరమణ పొందాను. స్వామి అనుగ్రహంవల్ల శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగంలో సేవ చేసే భాగ్యం లభించింది. ❊

మహా మహిమాన్విత ప్రేమావతారి

(ధారావాహికం)

బి.వి. రమణరావు

హేట్‌ఫీల్డ్ (ఇంగ్లండ్)లో 'శ్రీ సత్యసాయిబాబా' అనే పేరుతో వెలువడే మాసపత్రికయొక్క 2001 నవంబరు సంచికలో Total Transformation అన్న శీర్షికతో డా॥ ఉపాధ్యాయ వ్యక్తులలో స్వామి గొనివచ్చే అద్భుత పరివర్తనకు దృష్టాంతంగా తన అనుభవాన్ని ఈవిధంగా వివరించారు:

నేను జీవితంలో భగవంతుడికి తప్ప మరెవరికైనా ఋణపడి ఉంటే అది లండన్ వాస్తవ్యుడైన డా॥ ఎరిక్. జె. ఆర్నాట్‌కి. అతను నేత్ర శస్త్ర చికిత్సలో అంతర్జాతీయ ఖ్యాతి గడించేడు. నేను గత పాతికేళ్లుగా అతనికి శుశ్రూష చేసి నేత్ర చికిత్సా సూక్ష్మాలను నేర్చుకొని పేరుప్రతిష్ఠలు సంపాదించేను. ఎన్నో దేశాలు పర్యటించి, అతని శస్త్ర చికిత్సా లాఘవానికి ప్రదర్శన లేర్పాటు చేసి, అతడు ఎందరో ప్రముఖ సర్జన్ల ప్రశంసలందుకోవడంలో తోడ్పడ్డాను. అందుచేత డా॥ ఆర్నాట్‌కి నేనంటే ఎంతో అభిమానం. నేను ఇండియాకు తరచు వచ్చి ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబావారిని దర్శించి, వారు నెలకొల్పిన విశ్వవిఖ్యాతి గాంచిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో వైద్యబృందంతో కలిసి శస్త్ర చికిత్సలో పాల్గొనేవాణ్ణి. తిరిగి లండన్ వచ్చినప్పుడు డా॥ ఆర్నాట్ "ఎప్పుడో ఓసారి నీతో ఇండియా వచ్చి మీ 'సయ్‌బావ'ని కల్సుకుంటాను" అనేవాడు.

నిజానికి నా జీవితంలో అతనికి కృతజ్ఞత చూపెట్టాలంటే అతనికి భగవాన్ బాబావారి దర్శనం చేయించడమే అని ఎన్నోసార్లు అనుకున్నాను. అయితే వచ్చిన సమస్య ఏమిటంటే, డా॥ ఆర్నాట్ అసాధారణ ప్రముఖ వ్యక్తి, వృద్ధుడు. అతని సంపాదన, పేరు ప్రతిష్ఠల దృష్ట్యా ఎక్కడికెళ్లినా అతనికి అఖండ గౌరవ మర్యాదలు చేస్తారు. అతను సకల సౌఖ్య సదుపాయాలకీ అలవాటు పడ్డాడు. అతనికి ఉన్న ఒకే ఒక బలహీనత 'డ్రింక్స్' తీసుకోవడం. ప్రశాంతి నిలయంలో ఉన్న నిబంధనలు, పాటించవలసిన క్రమశిక్షణ తెలుసున్నవాణ్ని కనక ఈ మహానుభావుణ్ణి అక్కడికి తీసుకొస్తే అతనూ నేనూకూడా ఎటువంటి అప్రతిష్ఠకు గురి కావలసివస్తుందో అన్న భయంతో ఇతనికి భగవాన్ దర్శనం చేయించాలన్న కోరికని అణచుకుంటూ వచ్చాను. అయితే, అతని భార్య వెరోనికా స్వామినిగురించి రాసిన పుస్తకాలు చదివి స్వామి యెడల భక్తి పెంచుకుంది. అతను వ్యక్తిగతంగా ఉత్తముడేగాని 'ఈజీ గోయింగ్'. సుకుమారుడు. 'సాయిబాబా' అనడమే రాదు, 'సయ్‌బావ' అంటాడు. నన్ను 'మేజర్' అంటాడు.

కంటి శస్త్ర చికిత్సకు కొత్తగా కనిపెట్టిన అత్యంత విలువైన 'లెగసీ 2000' అనే ఆధునిక పరికరాన్ని 'కేర్ అండ్ షేర్ ఇంటర్నేషనల్ రీసెర్చి ఫౌండేషన్' తరఫున, స్వామి అనుజ్ఞతో ప్రశాంతి నిలయంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి సమర్పించాం. అది అమెరికానుంచి నవంబరు నెలలో రావాలి. దాని నుపయోగించి 'కేటరాక్ట్ ఆపరేషన్' సునాయాసంగా పూర్తిచేసి ఆరోజునే పేషంటుని ఇంటికి పంపించెయ్యవచ్చు. **"ఇక్కడ కూలీ పని చేసుకునే పేద ప్రజలకు చాలా ఉపయోగం. వాళ్లు మర్నాడే పన్లోకి వెళ్లిపోవచ్చు. నువ్వు నవంబరులో వచ్చి ఇక్కడి డాక్టర్లకు ట్రెయినింగివ్వు"** అన్నారు స్వామి. ఆ అవకాశాన్ని పురస్కరించుకొని, "స్వామీ! డాక్టర్ ఎరిక్. జె. ఆర్నాట్...." అన్నానో లేదో **"తప్పక తీసుకురా"** అనేసి గదిలోకి వెళ్లిపోయారు. అతని

గురించి ముందుగా స్వామికి కొన్ని విషయాలు చెప్పాలనుకున్నా; ఆ అవకాశం దొరకలేదు. ఇక స్వామిమీదే భారం వేసి ఆయన్ని తీసుకొద్దామని నిర్ణయించుకున్నా.

"నిన్ను ప్రశాంతి నిలయం తీసుకురావడానికి బాబా పెర్మిషనిచ్చేరు" అని ఆర్నాట్‌తో చెప్పాను. "వెరీ హ్యాపీ! స్విమ్మింగ్ పూల్ ఉన్న ఫైవ్ స్టార్ హోటల్లో నాకు మకాం బుక్ చెయ్యి" అన్నాడు, అతనికి అలవాటైన ధోరణిలో.

"అక్కడ సాధారణమైన ఫ్యాన్ ఉన్న గదు లుంటాయి తప్ప స్విమ్మింగ్ సౌకర్యం ఉండే ఫైవ్ స్టార్ హోటళ్లుండవు. అక్కడ భగవాన్ ప్రేమసాగరమే స్విమ్మింగ్ పూల్"

"పోనీ, అక్కడికి దగ్గర్లో సిటీ ఏదీ లేదూ?"

"బెంగళూరుంది. అది అక్కడికి వందమైళ్లు" అన్నాను.

"ఫర్వాలేదు. నేను లండన్‌నుంచి కేంబర్లీ రోజూ డ్రైవ్ చేసుకొని వెళ్లడం లేదూ! అలాగే బెంగళూరు సిటీలో ఉండి రోజూ అక్కడికొస్తాను."

"చూడు, డాక్టర్ ఆర్నాట్! లండన్‌నుంచి కేంబర్లీ వంద మైళ్లయినా గంటలో వెళ్లగలవు. ఆ రోడ్లు, ఆ ట్రాఫిక్ వేరు. బెంగళూరునుంచి పుట్టపర్తి వెళ్ళడానికి ఆ గతుకుల రోడ్డుమీదా ఆ జనసమ్మర్దంలోనూ నాలుగు గంటలు పడుతుంది."

"అక్కడ డ్రింక్స్ తీసుకోవచ్చుగా?"

"తీసుకోకూడదు. నిషేధం" అన్నాను హెచ్చరిస్తూ.

"వైన్ తీసుకుంటాను. దానికేమీ అభ్యంతరం ఉండదు కదా!"

"అది డి-వైన్ ఆశ్రమం. అక్కడెవరూ ఆ మాటెత్తరు. అదీ నిషేధమే."

"వాడ్డాయు మీన్? నేను క్వీన్ ఎలిజబెత్‌తోనూ, ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాతోనూ కలిసి వైన్ తీసుకున్నాను."

"వాళ్లందరూ మహోన్నతులైనా మానవమాత్రులు. మనం వెళ్లేది సాక్షాత్తు దైవస్వరూపులైన సత్యసాయి బాబా దగ్గరికి."

"పోనీ, ఆశ్రమం బయట తీసుకోవచ్చుగా."

"సాయిబాబా నిన్ను పిలిచి మాట్లాడరు" అన్నాను నా ఆఖరి అస్త్రం సంధిస్తూ.

"సరే, చూద్దాం! నాలుగు రోజులే కదా!" అన్నాడు.

"భగవాన్! ఈ మహానుభావుణ్ణి తీసుకొస్తున్నాను. ఇక నీదే భారం" అని స్వామిని ప్రార్థించుకున్నాను మనస్సులో.

ఇంక వారం రోజుల్లో బయల్దేరతామనగా, డా॥ ఆర్నాట్ ఇండియా వెళ్లడానికి వీసా తీసుకున్నాడో లేదో కనుక్కుందామనుకుంటే, ఆయన టూర్ మీద జిబ్రాల్టర్ వెళ్లాడని తెలిసింది. బుధవారం సాయంత్రం ప్రయాణ మనగా, మంగళవారం తిరిగొచ్చాడు. వీసాకి అప్లయ్ చేయడం మరచిపోయాడుట. తన పాస్‌పోర్టు నా చేతికిస్తూ, "నా భార్య వెరోనికా కూడా వస్తానంటోంది. ఆమె కేంబర్లీలో ఉంది. రేపే ప్రయాణం కనక పాస్ పోర్టులో ఉన్న వివరాలు ఫ్యాక్స్ చేసి పంపమంటాను. ఆమెని రేపుదయానికి వచ్చెయ్యమంటాను. నువ్వు ఎలాగైనా హైకమీషనర్‌ని కలుసుకొని వీసాలకి ఏర్పాటు చెయ్యి" అన్నాడు, అదేదో నిమిషాలమీద అయ్యే పనయినట్లు!

ఇంత నిర్లక్ష్యం, బద్ధకం ఉన్న ఈ వృద్ధ దంపతుల్ని తీసుకెడితే ప్రశాంతి నిలయంలో అక్కడున్న క్రమశిక్షణ దృష్ట్యా అడుగడుగునా ఎలాంటి అవమానాలు పొందవలసి వస్తుందో అన్న భయంతో, అంత్య నిష్ఠూరంకంటే ఆది నిష్ఠూరమే మేలని, వీసాలు దొరకలేదన్న నెపంతో వాళ్ల ప్రయాణం కేన్సిల్ చేసేద్దామని నిర్ణయించుకొని, నా సర్జరీ సెక్షన్‌కి వెళ్లి, స్వామి ఫోటో ముందు నిలబడి క్షమాపణ చెప్పుకో బోతుంటే ఇంటర్‌కామ్‌లో రిసెప్షనిస్టు "హిజ్ హైనెస్ ది హై కమీషనర్ ఆఫ్ ఇండియా నిన్ను కలవడానికి వస్తున్నాడ"ని ఫోన్ చేశాడు.

ఆయనను సగౌరవంగా నా గదిలోకి తీసుకొచ్చి

పరీక్ష చేసి చికిత్స చేసి సంతృప్తిపరిచాను. 'థేంక్స్. మీరు వైద్యబృందంతో బయలుదేరి రేపు ఇండియా వెళుతున్నారని తెలిసింది. అందుచేత చెప్పా చెయ్యకుండా మీరు ఉన్నారని తెలిసి వచ్చేశాను" అన్నాడాయన కృతజ్ఞతా పూర్వకంగా. ఆయన యోగక్షేమాలు, కార్యకలాపాలగురించి ముచ్చటించి, ఆ అవకాశం పురస్కరించుకొని డా॥ ఆర్నాట్ దంపతుల వీసా సమస్యనుగురించి ప్రస్తావించాను. "ఏమీ ఇబ్బంది లేదు. వాళ్లిద్దరికీ డిప్లొమాటిక్ వీసా ఇచ్చేస్తాను" అన్నాడు. ఆయన ఆఫీసుకెళ్లిన గంటలో డిప్లొమాటిక్ వీసాలు వచ్చేశాయి. ఇంత అవ్యవధిగా ఎవర్ని కలవడం సాధ్యం కాదనుకున్నానో ఆయనే స్వయంగా వచ్చి సమస్య పరిష్కరించడం కేవలం భగవాన్ బాబా దివ్య సంకల్ప ప్రభావమని గ్రహించి, వాళ్లని తగురీతిగా సంస్కరించే భారం స్వామికే వదలిపెట్టాను.

ఎయిర్ పోర్టులో మరో సమస్య ఎదురైంది. వాళ్లిద్దరితో కలిపి మేము పదిహేడుగురం. వీసాలన్నీ యిచ్చి మా గ్రూప్ లీడర్‌ని టికెట్లు కొనమన్నాను. పదిహేడు టికెట్లు ఎవరో నా చేతికిచ్చారు. లగేజిని 'చెకిన్' చేయించడానికి వాటిని రిసెప్షనిస్ట్‌కిస్తూ పదిహేడు టికెట్లని చెప్పేను. ఆ టికెట్లు చూసి 'మేము ఫస్ట్ క్లాస్ (ఎగ్జిక్యూటివ్ క్లాస్)లో తప్ప 'ఎకానమీ క్లాస్'లో ఎప్పుడూ ట్రావెల్ చెయ్యలేదు. మేము రాము" అని మొరాయించాడు డాక్టర్ ఆర్నాట్. "మనం గ్రూప్‌గా వెడుతున్నాం. ఈసారి కెలాగో సర్దుకోవాలి" అని నచ్చజెబుతున్నాను. నిజానికి తప్పు నాదే. వాళ్లకి ఫస్ట్ క్లాస్ టికెట్లు దొరికితే రమ్మనాలి, లేకపోతే వాళ్ల ప్రయాణం మాన్పించెయ్యాలి.

ఇలా అనుకుంటుంటే రిసెప్షనిస్ట్ "పదిహేడు టికెట్లమీద 100 కేజీలు ఎక్సెస్ వెయిట్ ఉంది" అంది. "ఇప్పుడు మళ్లీ కౌంటర్ కెళ్ళి డబ్బు కట్టమని నన్ను నిర్బంధించొద్దు. ఫోనిలా ఇయ్యి. నేను మేనేజర్‌తో మాట్లాడతాను. ఇందులో మందులు, శస్త్ర చికిత్సకు సంబంధించిన పరికరాలు ఉన్నాయి. ఇవన్నీ ఇండియాలో సాయిబాబా సూపర్ స్పెషాలిటీ ఫ్రీ సర్వీస్ హాస్పిటల్‌కి... " అంటుంటే ఆమెకి ఫోన్ వచ్చింది.

చేతిలో ఉన్న టికెట్లు విడివిడిగా చూసి, "డాక్టర్ ఆర్నాట్ అండ్ మిసెస్ వెరోనికా టికెట్లు ఫస్ట్ క్లాస్‌కి మార్చినట్లు మెసేజ్ వచ్చింది. ఇందులో ఎండార్స్ చేస్తాను. ఈ రెండూ ఫస్ట్ క్లాస్ టికెట్లు కనక ఎక్సెస్ లగేజ్ ఉండదు" అంది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆర్నాట్ ఆనందించాడు. నాకు శ్వాస ఆగిపోయినంత పనయింది. అదనంగా చెల్లించవలసిన డబ్బు కట్టేసి ఫస్ట్ క్లాస్‌కి ఎవరు మార్చి ఉంటారు? ఇంకెవరు, సర్వాంతర్యామి భగవాన్ తప్ప. నేను చెయ్యాల్సిన పని స్వామి చేసి నాకు బుద్ధి చెప్పారు.

మేము బొంబాయి ఎయిర్ పోర్టులో (స్టాప్ ఓవర్) దిగేటప్పటికి ఇద్దరు ఎయిర్ హోస్టెస్‌లు రెండు పూలదండలు, పుష్పగుచ్చాలతో ఆర్నాట్ దంపతులకు నమస్కరించి, స్పెషల్ వి.ఐ.పి. లౌంజ్‌లో వాళ్లకి విశ్రాంతి ఏర్పాటు చేశారు. ఆ వృద్ధ దంపతులు ఆనంద సంభ్రమాశ్చర్యాలతో పరవశించేరు. "ఇంత ఘన స్వాగతాన్ని నేనెప్పుడూ ఎరుగను" అన్నాడు ఆర్నాట్. ఈ ఏర్పాట్లు చూసి నేనూ ఆశ్చర్యపడి, ఎయిర్ పోర్ట్ స్టాఫ్ నడిగితే పుట్టపర్తి నుంచి మెసేజ్ వచ్చిందని చెప్పేరు.

అక్కడినుండి ఫ్లయిట్ బెంగళూరొచ్చేటప్పటికి తెల్లారగట్ల మూడయింది. చిరునవ్వుతో స్వాగతించి, ఏ అభ్యంతరాలు, తనిఖీలు, ఆలస్యం లేకుండా, మాకోసం సిద్ధంగా ఉన్న వ్యాన్‌లలోనూ, టేక్సీలలోనూ బేగేజ్ సర్ది మమ్మల్ని కూర్చోపెట్టడంలో కస్టమ్స్ స్టాఫ్ సహకరించారు. వాళ్లూ స్వామి భక్తులే. ఇదంతా చూసి ఆర్నాట్ విస్తుపోయేడు.

"మనం వెంటనే బయల్దేరి వెళితే ఉదయం ఆరున్నరకి ప్రశాంతి నిలయంలో స్వామి దర్శనం చేసుకోవచ్చు" అన్నాను.

"నా తరం కాదు. ఇంత లాంగ్ జర్నీ నేనెప్పుడూ చేయలేదు. మాకు నాలుగైదు గంటలైనా విశ్రాంతి, నిద్ర కావాలి" అన్నాడు ఆర్నాట్.

మాకొక టేక్సీ ఉంచుకొని, మా గ్రూపువాళ్లందరినీ మిగిలిన టేక్సీలలో వెళ్లి ప్రశాంతి నిలయంలో సిద్ధంగా ఉండండని చెప్పి పంపేను. వీళ్లు రెస్టు తీసుకొని హోటల్‌నుంచి బయల్దేరేటప్పటికి పదకొండున్నర అయింది. సాయంత్రం దర్శనానికి వెళ్లవచ్చునని సమాధానపడ్డాను. తీరా ప్రయాణం మధ్య టేక్సీ ఆపమని, "ఈ ప్రయాణంలో ఒళ్లు హూనమైపోయింది. కాస్త డ్రింక్స్ తీసుకుంటాం" అంటూ ప్రత్యేకమైన హేండ్ బేగ్‌లో తెచ్చుకున్న వైనూ, తినుబండారాలూ తీశారు. దాంతో మరో అరగంట ఆలస్యం. మొత్తం మీద నిలయం చేరేటప్పటికి నాలుగుంపావయింది. స్వామి దర్శన మిచ్చి ఇంటర్వ్యూ రూమ్‌లో ఉన్నారని తెలిసింది. మేము జోళ్లు కార్లోనే ఉంచి దిగేం. ఇంతలో ఓ సీనియర్ వాలంటీరొచ్చి "డాక్టర్ ఉపాధ్యాయ! మీరు రాగానే మిమ్మల్నీ, డాక్టర్ ఎరిక్.జె.ఆర్నాట్ దంపతుల్ని వెంటబెట్టుకొని రమ్మన్నారు" అని కూడా వచ్చి వెరోనికాని లేడీస్ ఎంక్లోజర్‌లో అప్పగించి మమ్మల్ని వరండాలో స్వామి గదికి ఎదురుగా కూర్చోబెట్టాడు.

డా॥ ఆర్నాట్ ఫుల్ సూటులో ఉన్నాడేమో, కింద కూర్చునే అలవాటు లేక కాళ్లు జాపుకుని కూర్చున్నాడు. నెమ్మదిగా కాళ్లు ముడుచుకొని కూర్చోమని చెబుదామనుకునేలోగా తలుపు తీసుకొని స్వామి బయటికొచ్చి చిరునవ్వుతో మమ్మల్నిద్దరినీ లోపలికి రమ్మన్నారు. అప్పటికే ఆ గదిలో మా గ్రూపులో వచ్చిన రష్యన్, ఇంగ్లండ్ డాక్టర్లున్నారు. ఆర్నాట్ స్వామివైపు కాళ్లు జాపి కూర్చున్నాడు. నేను ఆర్నాట్ కాళ్లవైపు చూడటం గమనించి స్వామి నావైపు క్రీగంట చూసి మాట్లాడొద్దన్నట్లు సంజ్ఞ చేశారు. స్వామి కూర్చుని **"హౌ ఆర్ యు డాక్టర్?"** అని పలకరించేరు. 'ఫైన్ సర్' అన్నాడు. **"గ్లాడ్ యు హేవ్ కమ్"** అన్నారు స్వామి. ఆర్నాట్ నమస్కారం పెట్టేడు మౌనంగా. తర్వాత స్వామి కుర్చీ పక్కనే కూర్చున్న రష్యన్ డాక్టర్‌కేసి తిరిగి తమ దివ్య హస్తచాలనంతో ఓ బంగారు ఉంగరం సృష్టించి, ఆ రష్యన్‌కిస్తున్నట్లు నటించి, చెయ్యి ఆర్నాట్ వైపు తిప్పి విసిరేరు. దాన్ని ఆర్నాట్ చేతుల్లో పట్టుకున్నాడు.

"దానిమీద ఏముంది?" అడిగేరు స్వామి.

"తెలియదు సర్. ఈ సాంకేతిక అక్షరాన్ని ఈ మేజర్ ఆరాధిస్తూ ఉంటాడు" అన్నాడు.

"అది 'ఓం'. ఏదీ నువ్వు అను 'ఓం' అని"

స్వామి అతనిచేత మూడు సార్లు ఓం అనిపించారు.

"మీరు పాశ్చాత్యులు 'బిగ్ బేంగ్' జరుగుతుండగా ఉత్పన్నమైన శబ్దంతో సృష్టి ప్రారంభమయిందంటారు. సృష్టికి మూలమైన ఆ పవిత్ర శబ్దమే 'ఓం" అంటూ ఆ ఉంగరాన్ని తీసుకుని స్వామి ఆ రష్యన్ డాక్టర్ కిచ్చేరు. ఆ డాక్టర్ "స్వామీ! నాకు మీ బొమ్మ ఉన్న ఉంగరం కావాలి" అన్నాడు.

స్వామి ఆ ఉంగరం తీసుకుంటుండగా ఆర్నాట్ అందరి కాళ్లవైపు చూసి, తన తప్పును గ్రహించినట్లుగా నెమ్మదిగా కాళ్లు ముడుచుకొని స్వామికి మరింత దగ్గరగా జరిగేడు. స్వామి ఆ ఉంగరంమీద నోటితో ఊదగా అది స్వామి బొమ్మ ఉన్న ఉంగరంలాగ మారిపోయింది. ఆర్నాట్ స్వామి వేళ్లను రెప్ప వాల్చకుండా చూస్తూ అడుగు దూరంలో ఉండగా ఈ అద్భుతం జరిగింది. ఆ ఉంగరాన్ని స్వామి స్వయంగా ఆ రష్యన్ డాక్టర్ వేలుకి తొడిగేరు. సరిగ్గా సరిపోయింది. ఆ డాక్టర్ సంతోషంగా ఆ వేలుని ముద్దు పెట్టుకున్నాడు.

వెంటనే స్వామి లేచి అందరికేసి చూసి **"రేపు ఉదయం హాస్పిటల్లో కొత్త పరికరాన్ని ఉపయోగించి ఆపరేషన్లు ప్రారంభించండి. ఇక్కడున్న డాక్టర్లకు కూడా ట్రెయినింగ్ యివ్వాలి. మంచిది, వెళ్లి రండి"** అన్నారు. అందరం నమస్కారాలు చేసుకుని వెళుతుంటే ఆర్నాట్‌తో **"రేపు పిలిచి మాట్లాడతానులే"** అన్నారు. అందరి వెనక్కాల నేను ఉండి స్వామితో ఆర్నాట్ ధోరణి చూసి భయంతో "స్వామీ! ఆర్నాట్ దంపతుల బస..." అంటుండగా **"ఆశ్రమంలోనే"** అనేసి స్వామి భజన హాల్లోకి వెళ్ళిపోయేరు.

భజన తర్వాత అందరితోపాటు బయటికొచ్చేము. మా గ్రూప్ లీడరు మాకు ఏర్పాటు చేసిన గదుల తాళం

చేతులిచ్చాడు. మేము తిరిగి టేక్సీ దగ్గిరకొచ్చి వెరోనికాకోసం ఎదురు చూస్తుంటే ఆమె వచ్చింది. సంభ్రమాశ్చర్యాలతో ఆర్నాట్ "మేజర్! ఈ పవిత్ర వాతావరణంలో ఈ నాలుగు రోజులు నా గౌరవం దక్కించుకోవడం నా విధి. ఆ డ్రింక్స్ ఉన్న పెట్టె టేక్సీ డ్రైవర్ని పట్టుకు పొమ్మను" అన్నాడు. అతని త్యాగపూరితమైన నిర్ణయానికి నా కళ్లు చెమర్చేయి. స్వామి ఎంత అనూహ్యంగా 'సైలెంట్ ట్రాన్స్ఫర్మేషన్' తీసుకొచ్చేరో! ఆశ్చర్యం కలిగింది.

మర్నాడు ఉదయం డాక్టర్లందరూ హాస్పిటల్కి వెళ్లిపోయేరు. నేనూ, డాక్టర్ ఆర్నాట్ వరండాలో కూర్చున్నాం, స్వామి దర్శనం చేసుకుని ఆశీస్సులు తీసుకుందామని. "స్వామి నన్ను మళ్లీ ఈరోజు పిలిచి మాట్లాడతానన్నారు. వెరోనికానికూడా పిలిస్తే సంతోషిస్తుంది. ఆమెకి ఈయనంటే చాలా భక్తి" అన్నాడు ఆర్నాట్. "ఇప్పుడు పిలుస్తారో సాయంత్రం పిలుస్తారో, మరి వెరోనికాని పిలుస్తారో లేదో! అంతా స్వామి అనుగ్రహం. మనం స్వామి రాగానే నమస్కారం చేసుకుని హాస్పిటల్కి వెళ్లిపోదాం" అన్నాను. పాపం, నిరుత్సాహపడ్డాడు. ఏం చెయ్యను! ఇంతలోనే స్వామి వచ్చేరు. మమ్మల్నిద్దరినీ గదిలోకెళ్లమన్నారు. ఇంకెవరో మహిళని పిలవమని లేడీ వలంటీర్తో చెప్పినట్లున్నారు. **"ఆమె రాలేదా?"** అని అడిగారు. స్వామి లోపలికొచ్చి ఆర్నాట్తో **"నీ భార్యని కూడా పిలు"** అన్నారు. అక్కడున్న లేడీ వలంటీర్తో సంప్రదించి వరండాలోకెళ్లి చేతి రుమాలూపేడు. ఆ సంకేతాన్ని గుర్తించి పరుగులాంటి నడకతో వెరోనికా ఉత్సాహంగా వచ్చింది. గదిలో మేము కూర్చున్నాక స్వామి కొంతసేపు ఆధ్యాత్మిక విషయాలు, మానవ సేవాసాధనగురించి ముచ్చటించారు. తర్వాత వెరోనికాకేసి తిరిగి **"నీకేమి కావాలి?"** అని అడిగారు. "స్వామీ! నాకేమీ అడగాలని లేదు, ఒక్క స్వామి అనుగ్రహం తప్ప" అంది. వెంటనే స్వామి తమ దివ్య హస్తచాలనంతో స్వామి చిత్రం ఉన్న లాకెట్తో సహా బంగారు గొలుసు సృష్టించి ఆమెకిచ్చేరు.

ఆ తర్వాత అలాగే మరో బంగారు ఉంగరాన్ని సృష్టించి ఆర్నాట్ వేలుకు తొడుగుతూ **"నువ్వు పాతిక సంవత్సరాలుగా నాదగ్గిరకి వస్తాను, వస్తానంటూ ఇప్పటికొచ్చేవు.** You are a kind man; from now onwards you serve the mankind అన్నారు. ఆర్నాట్ ఆనందపరవశంతో స్వామి చెయ్యి అందుకుని ముద్దు పెట్టుకున్నాడు.

మేము నమస్కారాలు చేసుకుని లేచేము. స్వామి లేచి ఆర్నాట్ భుజం తడుతూ, **"అందరూ హాస్పిటల్లో మీకోసం కాచుకుని సిద్ధంగా ఉన్నారు. వెంటనే వెళ్లి ప్రారంభం చెయ్యి"** అన్నారు. వెంటనే ఆర్నాట్ "నేను ప్రారంభించే ముందు మీరు అక్కడికి వచ్చి చూసి ఆశీర్వదించాలి" అన్నాడు. **"అలాగే వస్తాను"** అని స్వామి గది బయటికొచ్చేరు. వెనక్కాలే మేమూ బయటికొచ్చేము. ఇంతలో స్వామి బయట వీల్ ఛైర్లో కూర్చున్న యువతికేసి చూసి **"ఏమింత ఆలస్యం అయింది? నీకోసం చూశాను"** అన్నారు. వీల్ ఛైర్లో తనని తీసుకొచ్చే మనిషి సమయానికక్కడ లేదు. అందుచేత ఆలస్యమైందని చెప్పి మొహం చేతుల్తో కప్పుకొని ఏడవటం మొదలుపెట్టింది. తర్వాత తెలిసింది, ఆమె ముప్ఫయ్యేళ్ళ అమెరికన్ వనితనీ, కారు ఏక్సిడెంట్లో వెన్నెముక దెబ్బ తినడంవల్ల కాళ్లు పడిపోయాయని.

ఆమెని చూసి స్వామి, **"నీకసలు వీల్ ఛైరెందుకు? లేచి నిలబడు"** అన్నారు. ఆమె తల అడ్డంగా తిప్పి మళ్లీ ఏడ్వడం మొదలెట్టింది. స్వామి ఆమెవద్దకి వెళ్లి ఆమె చెయ్యి పట్టుకుని **"ఊ.. నిలబడు"** అన్నారు. ఆమె నివ్వెరపోయి, తర్వాత రెండో చేత్తో కుర్చీ చేతిని అదిమిపట్టి 'సాయిరాం, సాయిరాం' అంటూ నెమ్మదిగా లేచి నిలబడగలిగింది. స్వామి వీల్ ఛైర్ని వెనక్కి నెట్టేసి ఆమె చెయ్యి పట్టుకుని నాలుగడుగులు వేయించి, తమ చేతిని తప్పించుకుని **"అలాగే ధైర్యంగా ముందుకు నడుచుకుంటూ వెళ్లు. వెనక్కి చూడకు"** అన్నారు. అక్కడున్న పదివేలమంది కరతాళ ధ్వనులు మిన్నుముట్టుతుండగా ఆమె నెమ్మదిగా

అడుగులు వేసుకుంటూ వెళ్లింది. ఈ అద్భుత దృశ్యం చూస్తున్న నేనూ ఆర్నాట్ స్వామి తమ గదిలోకి వెళ్ళిపోయేవరకు అందరితోపాటు చప్పట్లు కొడుతూనే ఉన్నాం.

ఉదయం ఎనిమిదిన్నరకి హాస్పిటల్లో థియేటర్లో పరికరాలమర్చేరు. డాక్టర్లందరూ ఆపరేషన్ చేసే విధానం చూడటానికి 'వ్యూ ఫైండర్స్' దగ్గర చేరేరు. ఆర్నాట్కూడా సిద్ధమై థియేటర్లో ప్రవేశించేడు. ఒక పేషంట్ని రెడీ చేసేరు. ఆర్నాట్ని ఆపరేషన్ ప్రారంభించమన్నాను. "ఉండు. స్వామి వస్తానన్నారుగా, వచ్చేక చేస్తాను" అన్నాడు. "తొమ్మిది గంటలకు భజన ఉంటుంది. ఇప్పుడెలా వస్తారు? మాటవరసకి వస్తానన్నారు. ఏదో టైమ్లో వస్తే రావచ్చు. అంతేకాని స్వామికోసం నిరీక్షించడం అవివేకం" అని కాస్త గట్టిగానే చెప్పాను. "నువ్వు వేదాంతం చెప్పకు. స్వామి వస్తానన్నారు. తప్పకుండా వస్తారు. నువ్వు ఆశ్రమానికి ఫోన్ చేసి బయల్దేరేరో లేదో కనుక్కో" అని భీష్మించుకు కూర్చున్నాడు.

నేను వెళ్లి మెయిన్ డోమ్లో ఉన్న స్వామి ఫోటో ముందు మోకరిల్లి, "ఈ మొండిఘటాన్ని ఎలా సంస్కరిస్తారో మీదే భారం" అని ప్రార్థించి థియేటర్కి తిరిగి వచ్చేను. ఈలోగా ఆర్నాట్ ఏమాలోచించేడో, నేను రాగానే "ఆల్ రైట్. ప్రారంభించేస్తాను. ఆయన కోసం వెయిట్ చేయడం ధర్మం కాదు" అన్నాడు గ్లవుస్ వేసుకుంటూ.

అతను కొనసాగిస్తున్న ఆపరేషన్ విధానం మీద నేను ప్రత్యక్ష వ్యాఖ్యానం చెబుతుండగా ఒక పేషంటు యొక్క కేటరాక్ట్ క్రష్ చేసి, క్లీన్ చేసి అందులో ఇన్ప్లాంట్ అమర్చడానికి సిద్ధంగా ఉన్న సమయానికి స్వామి వచ్చి అద్దంలోంచి చూస్తుండటం చూసి ఆర్నాట్ "చూశావా మరి స్వామి వచ్చేరు" అన్నట్లు నావైపు కళ్లెగరేస్తూ చూశాడు. ఆర్నాట్కేసి స్వామి అభయ హస్తంతో అద్దంలోంచే ఆశీర్వదించి, ఆర్నాట్ని ఏకాగ్రతతో ఆపరేషన్లు కొనసాగించమని, సాయంత్రం అతన్ని ఆశ్రమానికొచ్చినప్పుడు చూస్తానని థియేటర్లోకి మెసేజ్ పంపించారు. ఆపైన చకచకా ఆపరేషన్లు జరిగిపోయాయి.

సాయంత్రం హాస్పిటల్నుంచి ఆశ్రమానికి కార్లో వస్తున్నాం. ఆర్నాట్ గంభీరవదనంతో మౌనంగా ఉన్నాడు. "ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అని అడిగేను. ఒక క్షణం తర్వాత సజల నేత్రాలతో, గద్గద స్వరంతో "ఈరోజంతా కట్టుకోడానికి సరైన బట్టలు కూడా లేని నిరుపేదలకు ఆపరేషన్ చేస్తుంటే అనిర్వచనీయమైన ఆనందం, సంతృప్తి కలిగేయి. ఇటువంటివాళ్లకు నేనెప్పుడూ ఆపరేషన్ చెయ్యలేదు. ఆపరేషన్ అయ్యాక వాళ్లు చేసే కృతజ్ఞతాపూర్వక వందనాలలో భగవంతుని ఆశీర్వచనపూర్వక మందహాసాన్ని చూశాను" అన్నాడు ఆర్నాట్.

నిజమే. ప్రపంచం నలుమూలలనుంచీ కోటీశ్వరులతనిచ్చే 'అపాయింట్మెంట్'కోసం ఆత్రుతతో ఎదురు చూస్తూ ఉంటారు.

నిత్యం సాయంత్రం భజన ముందు స్వామి మా వద్దకు వచ్చి ఆనాడు జరిగిన ఆపరేషన్ల వివరాలు అడిగేవారు. నేను చెప్పేవాణ్ణి. ఆర్నాట్ స్వామికి మౌనంగా చేతులు జోడించి నమస్కరించేవాడు. స్వామి అతని చేతులు ప్రశంసాపూర్వకంగా స్పృశించేవారు. మేమొచ్చి నాలుగు రోజులయింది. ఇక్కడున్న డాక్టర్లకు ట్రెయినింగ్ ఇవ్వడంకూడా అయింది. తిరిగి వెళ్లబోయే ముందు ఆర్నాట్ని స్వామి చూస్తానన్నారు.

ఆరోజు శుక్రవారం. శనివారం సాయంత్రంనుంచి ఆదివారం సాయంత్రంవరకు అఖండ భజన. శనివారం సాయంత్రం ఆర్నాట్ దంపతులు సైట్ సీయింగ్ చేస్తూ గడపటానికి బెంగళూరు వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. మైసూరు మహారాజు బంధువులు వీళ్లకి స్నేహితులు. వాళ్లతో కలిసి మైసూరు, ఊటీ వెళ్లి మంగళవారం సాయంత్రానికి బెంగళూరు తిరిగి వస్తామన్నారు. మేమిక్కడ సోమవారం సాయంత్రం వరకూ ఉండి బెంగళూరొచ్చి వాళ్లని కల్సుకుని అందరం మంగళ వారం రాత్రి ఫ్లయిట్లో తిరిగి వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నాం.

శనివారం సాయంత్రం మేము హాస్పిటల్‌నుంచి తిరిగి వచ్చేటప్పటికి స్వామి భజన హాల్లో ఉన్నారు. కాస్సేపటికి అఖండ భజన ప్రారంభమైంది. భజనలో ఎంతసేపుంటారో తెలియదు. తిరిగి వెళ్లే ముందర స్వామి ఆర్నాట్‌ని చూస్తానన్నారు కాని ఏడు గంటలకి బయల్దేరటానికి ఏర్పాటు చేసుకున్న ఆర్నాట్‌ని స్వామి చూసి పలకరించే అవకాశం కనబడలేదు.

"స్వామి నిత్యం పలకరిస్తూనే ఉన్నారు. వారి అనుగ్రహంతో నా హృదయం నిండిపోయింది. మరి మేము బెంగళూరు వెళ్లి మీకోసం మంగళవారం ఎదురు చూస్తూ ఉంటాం" అని ఆర్నాట్ బయల్దేరి వెళ్లిపోయాడు.

ఆదివారం సాయంత్రం అఖండ భజన అనంతరం అందరికీ విద్యార్థులు ప్రసాదాలు పంచుతున్న సమయంలో మాకు స్వామి స్వహస్తాలతో ప్రసాదం పంచిపెడుతూ, **"రేపు మీరందరూ మీ అంతకి మీరు స్వయంగా ఆపరేషన్లు చేయండి. మీ ఆత్మవిశ్వాసం దృఢపడుతుంది. మీ నైపుణ్యం పరిశీలిస్తూ అవసర మైనప్పుడు సలహాలిస్తాడు డా॥ ఆర్నాట్"** అంటూ ముందుకు నడిచిపోతుండగా, "స్వామీ! ఆర్నాట్ సతీ సమేతంగా నిన్న సాయంత్రమే వెళ్లిపోయాడు" అన్నాను. స్వామి వినిపించుకున్నట్లు లేదు.

సోమవారం ఉదయం మేము హాస్పిటల్‌కి ఎనిమిది గంటలకి వెళ్లి అక్కడ డా॥ ఆర్నాట్ దంపతులుండటం చూసి దిగ్భ్రమ చెందాం. అంతకు అయిదు నిమిషాల ముందే వాళ్లు బెంగళూరునుంచి తిరిగొచ్చేరుట. ఆర్నాట్ నాతో "మై డియర్ మేజర్! ఆదివారం వెరోనికాని సైట్ సీయింగ్‌కి వెళ్లమని, నేను హోటల్లో కూర్చుని స్వామినిగురించి రాసిన పుస్తకాలు తిరగేస్తూ గడిపాను. రాత్రి మేమిద్దరం మాట్లాడుకున్నప్పుడు, 'ఇక్కడికొచ్చింది స్వామిని చూడటానికి, చేతనైన సేవ చెయ్యడానికి. అంతేకాని 'హాలీ డేయింగ్'కి రాలేదు. పైగా వారిని కలవకుండా వచ్చెయ్యడం తప్పు' అనిపించింది. స్వామి మమ్మల్ని తిరిగి రమ్మన్నట్లనిపించి ఈ తెల్లవారగట్ల నాల్గింటికి బయల్దేరి వచ్చేశాం" అన్నాడు. ఇది స్వామి దివ్య సంకల్ప ఫలితం. **"రేపు మీరు ఆపరేషన్లు చేసేటప్పుడు చూసి సలహాలివ్వడానికి ఆర్నాట్ ఉంటాడు"** అని స్వామి అనడంలో అంతరార్థం గ్రహించేము.

సోమవారం సాయంత్రం మేము హాస్పిటల్‌నుంచి తిరిగొచ్చి మందిరం వరండాలో కూర్చున్నాం. స్వామి చిరునవ్వుతో మా దగ్గరికొచ్చి ఆర్నాట్‌తో **"ఎలా చేశారు వీళ్లు ఆపరేషన్లు?"** అని అడిగేరు. "ఆర్నెల్లు ట్రెయినింగ్ పొందినంత అనుభవజ్ఞుల్లాగ చక్కగా చేశారు. ఇది స్వామి అనుగ్రహ ప్రభావం" అంటూ నమస్కరించి స్వామి చేతి వేళ్లు పట్టుకుని ముద్దు పెట్టుకుంటూ "మళ్లీ మిమ్మల్ని చూసే అదృష్టం ఎప్పుడు కలుగుతుందో" అన్నాడు. **"ఇది నీ ఇల్లు. నువ్వెప్పుడయినా రావచ్చు"** అన్నారు స్వామి అతని శిరస్సు స్పృశిస్తూ.

అందరం స్వామి పాదాలకు నమస్కరిస్తుండగా నా దగ్గిరకొచ్చి, **"ఈ సంతృప్తి, ఆనందం అందరితో పంచుకోవాలనే అతన్ని వెనక్కి రప్పించేను"** అన్నారు.

స్వామి పాదాలకు నమస్కరిస్తుంటే నా కళ్లు చెమర్చేయి. ఆర్నాట్‌ని తీసుకు రావడానికి ఎంత భయపడ్డాను! ఇప్పుడెంత ఆనందంగా తిరిగి వెడుతున్నాం!

నేనూ ఆర్నాట్ మాకోసం సిద్ధంగా ఉన్న టేక్సీ దగ్గరకు వెళ్లి వెరోనికా రాకకోసం ఎదురు చూస్తున్నాం. ఆమె చేతి రుమాలుతో కన్నీళ్లు తుడుచుకుంటూ మా దగ్గరకొచ్చింది. ఏమిటి సంగతి అని ఆమెని అనునయంగా ప్రశ్నిస్తే "మీ అందరికీ పాదనమస్కారా లిచ్చేరు. స్వామి నావైపైనా చూడలేదు" అంది. సరిగ్గా అదే సమయానికి సింగపూర్‌నుంచి వచ్చిన ఒక మహిళ పరుగుపరుగున వచ్చి, "మిసెస్ ఆర్నాట్! స్వామి మీకు యిమ్మన్నారు" అంటూ "విత్ బ్లెస్సింగ్స్ – బాబా" అని స్వామి సంతకం చేసిన స్వామి ఫోటో వెరోనికా చేతిలో పెట్టి వెళ్లిపోయింది. ఆ ఫోటోను ఆమె ఆనందంగా హృదయానికి హత్తుకుంది.

(సశేషం)

ప్రశాంతి సమాచారం

దివి చతుర్వేది

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో విద్యాభ్యాసము పూర్తి గావించుకొని స్వామి సన్నిధిలో వివిధ శాఖలలో పని చేసే భాగ్యానికి నోచుకున్న పూర్వ విద్యార్థులు ప్రతి సంవత్సరం సెప్టెంబరు మాసంలో సాయిమాతకు ప్రేమపూర్వక కృతజ్ఞతాంజలి ఘటిస్తూ 'సాయి సన్నిధి' దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. అదేరీతిగా సెప్టెంబరు 4వ తేదీన సాయికుల్వంత్ హాలులో జరిగిన 'సాయి సన్నిధి' దినోత్సవ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ మేనేజిమెంటు విభాగంలో పోస్ట్ డాక్టొరల్ ఫెలో అయిన శ్రీ శశాంక్ షా ప్రసంగిస్తూ సాయి సన్నిధిని ఒక ప్రేమగాథగా వర్ణించారు. తదుపరి శ్రీ సత్యసాయి హైయర్ సెకెండరీ స్కూలు సంస్కృత అధ్యాపకులు, జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీత శ్రీ వేదనారాయణ్ ప్రసంగిస్తూ, విద్యార్థులు యోచన, మాట, నడతల మధ్య సమన్వయాన్ని సాధించాలన్నారు. చివరిగా ప్రశాంతి డిజిటల్ స్టూడియోలో పనిచేస్తున్న శ్రీ బి. అరవింద్ ప్రసంగిస్తూ మన జీవితాలలో జరిగే ప్రతి సంఘటనా దైవసంకల్పానుసారమే మన ఉద్ధరణకై జరుగుతున్న దన్న దృఢ విశ్వాసముతో మనమెల్లప్పుడూ ఉల్లాసంగా ఉండాలన్నారు. ఉల్లాసము, ప్రేమ, కృతజ్ఞతలు - వీటికి మించిన సందేశమేమీ లేదన్నారు.

తదుపరి పూర్వ విద్యార్థులు వ్యాఖ్యానాలతో కూడిన అయిదు కీర్తనలను నూతన వాయిద్య రీతులను మేళవించి పాడారు.

హృదయ సంగమం

శ్రీ సత్యసాయి వైద్యాలయములలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న రోగులకు వారు పూర్తిగా కోలుకునేదాకా సేవలనందించాలన్న సత్సంకల్పంతో, భగవాన్ ఆశీస్సులతో మూడు సంవత్సరముల క్రితం కేరళ సాయి సంస్థవారు 'సాయి రిహాబిలిటేషన్' పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకములో రోగులకు శస్త్ర చికిత్సానంతరము 15 రోజుల తరువాత, ఇంకా మూడు నెలల వ్యవధిలో రెండు మార్లు అన్ని పరీక్షలు చేస్తారు. ఈ పథకముద్వారా లబ్ధి పొందిన ఎందరో బృందాలుగా ప్రశాంతి నిలయానికి వచ్చి స్వామికి కృతజ్ఞతలు తెల్పుకోవడం ప్రారంభించారు. ఈ సంవత్సరం శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైట్‌ఫీల్డులో చికిత్సలు చేయించుకున్న రోగులు 400ల మంది సెప్టెంబరు 6వ తేదీన వారి అనుభవాలను భక్తులతో పంచుకున్నారు. ముందుగా కేరళ సాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షులు ప్రొ॥ ముకుందన్ రిహాబిలిటేషన్ పథకాన్ని వివరించారు. తదుపరి లబ్ధిదారులైన శ్రీమతి జీనత్ అస్రాఫ్ మరియు శ్రీ చంద్రన్ ప్రసంగించారు. శ్రీమతి జీనత్ అస్రాఫ్ శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన సేవలను అందిస్తున్నదన్నారు. శ్రీ చంద్రన్ తాను హేతువాదినని, సాయి వైద్యాలయములో సేవలందుకున్న సమయంలో స్వామియొక్క దివ్యమహిమను చవిచూశానన్నారు.

సంప్రదాయ భజన గీత మాలిక

ఓణం మహోత్సవములో భాగంగా సెప్టెంబరు 7వ తేదీన సాయం సమయంలో శ్రీ వినయ చంద్ర మీనన్ భజన గీతాలను ఆలపించారు. ఆధునిక కాలములో కర్ణాటక సంగీత కచేరీలకు ముందు ఈ సంప్రదాయ కళ అత్యంత ప్రాచుర్యాన్ని పొందింది. వంశానుగతంగా, గురుశిష్య పరంపరగా వ్యాప్తి నొందిన ఈ కళను దైవతత్త్వముతో వివిధ సంగీత రీతుల మేళవింపుగా భావిస్తారు.

ఓణం పండుగ ముందు రోజయిన సెప్టెంబరు 8వ తేదీన బాల సంగీత విద్వాంసుడయిన యస్. మహదేవన్ 45 నిమిషాలపాటు నిర్వహించిన సంగీత కార్యక్రమము భక్తులను ఆశ్చర్యానందాలకు గురిచేసింది. కేరళవాసి అయిన మహదేవన్‌కు 12 సంవత్సరాలు మాత్రమే. పిన్న వయసులోనే ఇతను భారతదేశమంతటా ఎన్నో సంగీత కచేరీలను నిర్వహించాడు.

ఓణం పండుగ సందర్భంగా సెప్టెంబరు 9 ఉదయం కేరళ సంప్రదాయ దుస్తులను ధరించిన వేలాది భక్తులు కుల్వంత్ హాలులో సమావేశమైనారు. కేరళ భజన బృంద సభ్యులు భక్తిగీతాలను ఆలపించారు. ఆనాటి సాయంకాలం కేరళ రాష్ట్ర అధ్యక్షులు కేరళలో చేపట్టిన సేవాకార్యక్రమాలను వివరించారు. కేరళ ప్రభుత్వములో అడిషనల్ ఛీఫ్ సెక్రెటరీగా పనిచేస్తున్న శ్రీ కె. జయకుమార్ ప్రసంగిస్తూ, "భగవాన్ నా జీవితమే నా సందేశం అన్నారు. వారు ఆ సందేశాన్ని తు.చ. తప్పక పాటించి మనమంతా ఈ మానవ శరీరముతో ఏమి సాధించ వచ్చునో తెలియజేశార"న్నారు. అనంతరం కేరళ బాలవికాస్ బాలలు 'శ్రీకృష్ణ కృపాసాగరం' అన్న నృత్య నాటికను ప్రదర్శించారు.

ప్రకాశం జిల్లా భక్తుల పర్తియాత్ర

సెప్టెంబరు 24వ తేదీన ప్రకాశం జిల్లావారు సాయికుల్వంత్ హాలులో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షులయిన శ్రీ ఎమ్.ఎస్. కృష్ణమూర్తి ప్రకాశం జిల్లాలో చేపట్టిన సేవాకార్యక్రమాలను వివరించారు. నాటి సంగీత సేవాకార్యక్రమములో పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ ద్వారం లక్ష్మి కచేరీని నిర్వహించారు.

సెప్టెంబరు 25వ తేదీన ప్రకాశం జిల్లా భక్తులు 'సేవారాధన' నృత్య నాటికను ప్రదర్శించారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో భగవాన్ బాబా చేసిన అపారమైన కృషి ఈ నాటికలో ముఖ్యాంశం.

ప్రశాంతి నిలయంలో దసరా ఉత్సవాలు

షిరిడీ సాయిబాబావారి జన్మదినమైన సెప్టెంబరు 28వ తేదీ సాయి భక్తులకు పర్వదినం. ఆరోజు ఉదయం గం 8 లకు ప్రశాంతి నిలయంలో దసరా మహోత్సవాలను భజన మందిరంలో కలశ స్థాపన చేసి ప్రారంభించారు. గం 8.30 లకు విద్యార్థులు గ్రామసేవకై తరలి వెళ్ళారు. ఆరోజు కొత్తచెఱువు మండలంలో 23 గ్రామాల ప్రజలకు వస్త్రాలను, ఆహారాన్ని స్వామి ప్రసాదంగా అందజేశారు.

ఆరోజు సాయంకాలం హిందుస్తానీ విద్వాంసులు ఉస్తాద్ గుల్షన్ భారతి సాయికుల్వంత్ హాలులో కచేరీ చేశారు. భక్తిరస ప్రధానమయిన సూఫీ సిద్ధాంతవాణి వీరి కీర్తనలలో ప్రతిధ్వనించింది.

సెప్టెంబరు 29వ తేదీన కొత్తచెఱువు మండలంలో సాయి విద్యార్థుల గ్రామసేవ కొనసాగింది. నాటి సాయంకాలం సాయికుల్వంత్ హాలులో శ్రీ అజిత్ పొపట్ తమ ప్రసంగంలో భగవాన్ బాబావారిని ఉటంకిస్తూ ఆధ్యాత్మిక సాధనకు సంవేదన, పరిజ్ఞానం, అనుభవం, సాక్షాత్కారం సోపానాలు అన్నారు. ఈ ప్రసంగానంతరం శ్రీ ఆర్. రాఘవేంద్ర కర్ణాటక సంగీత బాణీలో 'నాద తను మనిశం', 'శివ శివ అనరాదా' కీర్తనలను పాడారు.

వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం

సెప్టెంబరు 30వ తేదీన ఉదయం దీక్షావస్త్రాలను ధరించిన ఋత్విక్కులు భజన మందిరమునుండి కలశాన్ని వేదమంత్రోచ్చారణతో పూర్ణచంద్ర హాలుకు తీసుకువెళ్లి సభావేదికపై పశ్చిమ దిక్కున స్థాపన చేసి కుంకుమార్చన, లలితా సహస్ర నామ పారాయణం గావించారు. దసరా యజ్ఞం సందర్భంగా పూర్ణచంద్ర హాలును అలంకరించారు. భగవాన్ బాబావారికొరకు రజిత సింహాసనాన్ని వేదికపై కుడివైపున ఉంచారు. ఎడమప్రక్కన వేదికను సీతారామలక్ష్మణుల విగ్రహాలు అలంకరించాయి. భగవంతుని విశ్వరూపం నేపథ్యంగా ఉన్నది. మధ్యలో యజ్ఞకుండాన్ని నిర్మించారు. ఋత్విక్కులు పవిత్రాగ్నిని కఱ్ఱలను మథించడంద్వారా

ప్రజ్వలింపజేసి యజ్ఞాన్ని ఆరంభించారు. గం. 9 లకు ఆరతి ఇచ్చారు. ఆరోజు విద్యార్థులు పుట్టపర్తిలో గ్రామసేవ చేశారు.

ప్రశాంతి విద్వన్మహా సభలు

ఆరోజు సాయం సమయంలో గం 4.30 లకు ప్రాథమిక పాఠశాల బాలల వేదమంత్ర పఠనంతో కార్యక్రమము ప్రారంభమైంది. పోస్ట్ డాక్టొరల్ స్కాలర్ శ్రీ శశాంక్ షా వేదపోషణ, ధర్మపరిరక్షణ, భక్తజన రక్షణ భగవాన్ బాబావారి అవతార లక్ష్యాలని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ జగదీశ్ చంద్ర 'భగవంతునితో ఒప్పందం' అన్న ఆసక్తిదాయకమైన అంశంపై ప్రసంగించారు. ఈ ఒప్పందంతో భక్తునికి అత్యంత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎమ్.బి.ఎ. రెండవ సంవత్సరం విద్యార్థి శరణాగతుడైన భక్తుని బాధ్యతను భగవంతుడే వహిస్తాడన్నాడు. ఈ ప్రసంగాల అనంతరం రికార్డు చేసిన భగవాన్ బాబావారి దివ్యోపన్యాసములోని కొన్ని భాగాలను భక్తులకు వినిపించారు. తదుపరి, గ్రామీణ బెంగాల్ జానపద గీతాలను శ్రీ పూర్ణదాస్ బాల్ తన కుమారుడు బిబ్యేందదాస్ బాల్‌తో కలిసి పాడారు.

(అక్టోబరు 6వ తేదీవరకు కొనసాగిన ప్రశాంతి విద్వన్మహాసభల విశేషాలు వచ్చే సంచికలో...) ❋

Sri Sathya Sai Sadhana Trust
Bhaktha Sahayak Division

Sri Sathya Sai Sadhana Trust – Bhaktha Sahayak Division is looking for a Senior Systems Administrator – IT. Currently the division is supported by a few Dell Servers in LAN environment through fiber optical network with over 60 users running various applications such as Retail Management Software (developed in-house) and other proprietary software. Majority of the applications are running on Microsoft Databases such as SQL Server and Access with Visual Basic as Front-End in Windows XP environment.

The incumbent must be completely conversant administering the Databases – performing a Sr. DBA role and must also look after the Network Administration. He should be creative, having good analytical capabilities with good communication skills and should be able to work independently handling various user-related (IT) problems. He should have preferably the following pre-requisites:

- Thorough knowledge of all MS products – must have at least 3-4 years of experience as MS-SQL Server DBA and at least 3 years as Windows Network Administrator.
- Qualification : MCSE, MCA, M.Sc.(Computer Science)
- Age – Below 45 years
- Willing to work in Prasanthi Nilayam while conforming to the discipline, rules and regulations of the Ashram.

Please send in detailed resumes along with expected remuneration to: **The Convener, Sri Sathya Sai Sadhana Trust – Bhaktha Sahayak Division, Prasanthi Nilayam – 515134.** You may also email your resumes and queries to: rteja@sssstbsd.org - Phone No.: +91-8555-288550.

సమాధి చెంత స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన విషయమై భక్తులకు ఒక విజ్ఞప్తి

ఈ సంవత్సరం గురుపూర్ణిమనాడు ప్రశాంతి నిలయంలో ఆవిష్కరింపబడిన భగవాన్ బాబావారి సమాధిని భక్తులందరూ స్వయంగా దర్శించుకొని ఉంటారు, లేదా సమాధి చిత్రపటాన్నైనా చూసి ఉంటారు. భగవాన్ సశరీరులై మన మధ్యలేని లోటు ఎన్నటికీ తీరనిదైనప్పటికీ పాలకడలిని తలపిస్తూ స్వచ్ఛమైన పాలరాయితో రూపుదిద్దుకున్న సమాధి భక్తులకు ఊరటను, ఓదార్పును కలిగిస్తూ, **'నేను దేహము కాదు, దేహిని'** అన్న భగవాన్ దివ్యవాణిని స్ఫురణకు తెస్తూ, వారు చూపిన వెలుగుబాటలో జీవనయానం సాగించడానికి ప్రేరణ కలిగిస్తూ, అభయ ప్రదానం చేస్తోంది.

సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న సమాధి చెంత దర్శించినంతనే భగవానుని దివ్య మంగళ స్వరూపమును, సుందర దరహాస చంద్రికలు వెదజల్లే వారి దివ్య వదనారవిందమును స్మృతిపథంలో నిలిపేవిధంగా భగవానుని ప్రతిమను ప్రతిష్ఠించవలసిందనేది భక్తుల ఆకాంక్ష. ఈమేరకు స్వామి ప్రతిమను ప్రతిష్ఠించటానికి సమాధి సౌందర్యము, వేదిక నిర్మాణము తదితర అంశాలను దృష్టిలో ఉంచుకోవలసిన అవసరం ఉన్నది. కాబట్టి, సమాధి చెంత స్వామి ప్రతిమ ఎటువంటిది, ఏ భంగిమలో, ఏ సైజులో, ఏ స్థానంలో ఉండాలనే అంశంపై తమ అమూల్యమైన అభిప్రాయానికి రూపకల్పన గావిస్తూ నమూనా చిత్రాలను, డిజైన్లను 2011 నవంబరు నెలాఖరులోగా మాకు పంపవలసిందిగా దేశ, విదేశాలలోని చిత్రకారులను, శిల్పకళా నిపుణులను, చక్కని సృజనాత్మకశక్తి కలిగిన వ్యక్తులను కోరుతున్నాము. అయితే, వాటిని రూపొందించి మాకు పంపే ముందు ఆయా వ్యక్తులు ఒక పర్యాయం సమాధిని దర్శించుకొని, వేదికను సునిశితంగా పరిశీలించిన తరువాతనే ఒక నిర్ణయానికి రావడం సమంజసమని మా అభిప్రాయం.

నమూనా చిత్రాలను, డిజైన్లను పంపవలసిన చిరునామా:

ఛైర్మన్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, ప్రశాంతి నిలయం, 515134, అనంతపురం జిల్లా, ఇండియా.

ఇమెయిల్: coordinator@sssmt.org.in

మీరు పంపే నమూనా చిత్రాలను, డిజైన్లను పరిశీలించి మీ సూచనలను స్వీకరించే / నిరాకరించే విషయంలో తుది నిర్ణయం శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టువారిదేనని తెలియజేయడమైనది.

భగవాన్ బాబావారి దివ్య సందేశము, అవతారోద్యమము, అన్నిటికీ మించి వారి దివ్యప్రేమను ప్రతిబింబిస్తూ భక్తులకు, భావితరాలవారికి ఆత్మోత్తేజము కలిగించేవిధంగా భగవానుని దివ్య మంగళమూర్తిని ప్రతిష్ఠించే ఈ మహత్తరమైన కార్యనిర్వహణలో భగవాన్ మన చేయి పట్టి ముందుకు నడిపించాలని ప్రార్థిద్దాం.

శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు

REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64 REGN.NO. HDP/OO1/2009-2011
Licenced to post without prepayment No. HDP/001/2009-11

స్వామి అంతర్యామి

మనోవాక్కాయకర్మల ఏకత్వంతో ప్రార్థన చేయాలి. మీరు ఏమి ప్రార్థన చేస్తున్నారో మీలోపల ఉన్న స్వామి వింటూనే ఉంటాడు. స్వామి బయట ఉన్నాడనే భావంతో మీరు లోపల ప్రార్థన చేస్తే అది స్వామికి ఎట్లా చేరుతుంది? స్వామి మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్నాడనే పరిపూర్ణమైన విశ్వాసంతో ప్రార్థన చేయండి. ప్రేమచేత సాధ్యం కానటువంటిది లోకములో ఏ ఒక్కటీ లేదు. కాబట్టి, ప్రేమనే ప్రధానమైన ప్రార్థనగా తీసుకోండి.... ఒక్క పుష్పము హారమవుతుందా? కాదు. అనేక పుష్పములు చేరినప్పుడే హారమవుతుంది. కనుక, మీరంతా ఏకమై ఒక మాలగా తయారు కావాలి. ఆ మాలకు మధ్యలో నేను కుచ్చుగా ఉంటాను. మీరందరూ ఒకే తల్లి బిడ్డలుగా భావించండి. జాతి, మత భేదములకు అవకాశమివ్వకండి. సమాజాన్ని దైవస్వరూపంగా భావించి సమాజసేవ చేస్తే మీ అభీష్టములన్నీ నెరవేరుతాయి.

- బాబా

వార్షిక చందా: రూ॥ 60.00 (భారతదేశంలో)
రూ॥ 550 లేక $13 లేక £9 (విదేశాలకు)
చందా ఒకటి, లేక రెండు, లేక మూడు
సంవత్సరాలకు స్వీకరింపబడును

Sri Sathya Sai Sadhana Trust
Publications Division

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Anantapur district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : B.V. Ramana Rao